ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి


# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

గురువారం 08 అక్టోబర్ 2026 | Thursday 08 octobar 2026 | హైదరాబాద్ Hyderabad | ➩ పేజీలు: 12+12 | ➩ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 173 | Vol.No 28 Issue No .173 | www.visionandhra.in


అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

## పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- సమన్వయంతో సమర్థవంతంగా చేపట్టాలి
- ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం



హైదరాబాద్, అక్టోబర్ 07 : రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మిగతా 2లో..

## తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

- చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ
- 19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



హైదరాబాద్, అక్టోబర్ 07 : తెలంగాణలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు చేరువైన డిమాండ్ ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించామని చెప్పారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు. కర్ణాటకలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు మిగతా 2లో..

**విజన్ ఆంధ్ర - ఆధ్యాత్మిక స్పెషల్ బంపర్ స్టోరీ**

# తొమ్మిది రాత్రులు.. తొమ్మిది అద్భుతాలు..

- కోటి జన్మల పుణ్యం
- దేవీ నవరాత్రుల పూర్తి చరిత్ర!
- అమ్మవారి మాల వేయగానే మనిషి ఎందుకు మారిపోతాడు?
- శరదృతువులోనే ఎందుకు జరుపుతారు?
- దుర్గమ్మ విగ్రహం ముందు కొబ్బరికాయ ఎందుకు కొడతారు?
- తెలియని 20 నిజాలు!



**తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 7, విజన్ ఆంధ్ర:** నవరాత్రులు అంటే కేవలం పండుగ కాదు, అది ఒక శక్తి ప్రవాహం. ఆశ్వయుజ మాసంలో చంద్రుడు తన పూర్తి కళలతో ప్రకాశించే సమయంలో ఈ ఉత్సవాలు మొదలవుతాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా అమ్మవారి నామస్మరణే.

*పుట్టుక కథ – స్త్రీ శక్తి ముందు రాక్షసుడు ఓడిపోయిన వేళ!*

సృష్టిలో మొదటిసారి పురుషాధిక్యానికి సవాల్ విసిరిన కథ ఇది. మహిషాసురుడు "ఏ మగవాడూ నన్ను చంపలేడు" అని వరం పొందాడు. దేవతలంతా భయపడ్డారు. అప్పుడు ఆదిశక్తి ఆలోచించింది – మగవాడు కాకపోతే ఆడది చంపుతుంది అని. అందుకే త్రిమూర్తుల తేజస్సు నుండి ఆవిర్భవించింది. ఆమె కళ్ళు సూర్యచంద్రుల్లా, చేతులు 18 ఆయుధాలతో, సింహంపై స్వారీ చేస్తూ వచ్చింది. మహిషాసురుడు మొదట అమ్మవారిని చూసి "ఆడదానా?" అని నవ్వాడు. కానీ అదే ఆడది అతడి పీచమణచింది. ఇది స్త్రీ శక్తికి ప్రపంచానికి చాటిన మొదటి విజయం. అందుకే అమ్మవారిని "స్త్రీ శక్తికి ప్రతీక" అంటారు. మిగతా 2లో..

# 'రోడ్ డస్ట్' నియంత్రణకు ప్రత్యేక దృష్టి

- సమన్వయంతో స్వచ్ఛ వాయు లక్ష్య సాధనకు టీజీపీసీబీ కృషి
- కాలుష్య మూలాల నిర్మూలనే లక్ష్యంగా విస్తృత కార్యక్రమాలు
- వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ మరింత బలోపేతం
- ప్రజా రవాణాలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం పెంపు
- స్వచ్ఛ వాయు సర్వేక్షణలో తెలంగాణకు గుర్తింపు
- టీజీపీసీబీ మెంబర్ సెక్రటరీ రవి వెల్లడి
- వాయు నాణ్యత మెరుగుదలకు శాస్త్రీయ పర్యవేక్షణ, సమగ్ర కార్యాచరణ
- కాలుష్య మూలాల నియంత్రణకు ప్రభావవంతమైన చర్యలు
- కాలుష్య మూలాల నియంత్రణపై సెక్రటేరియట్‌లో సమావేశం

Telangana Pollution Control Board
తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి

హైదరాబాద్, అక్టోబర్ 07 : తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ, వాయు నాణ్యత మెరుగుదల కోసం ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కమిటీ(ఎక్యుఎంసి) ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ అన్నారు. శాస్త్రీయ పర్యవేక్షణ, కాలుష్య మూలాల గుర్తింపు, నియంత్రణ చర్యలు, పచ్చదనం పెంపు, మిగతా 2లో..

# కరువులో తాగునీటికే ప్రాధాన్యం

### సింగూరు బ్రూవరీల లీక్ పై మంత్రి జూపల్లి క్లారిటీ



తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 07,విజన్ ఆంధ్ర : రాష్ట్రంలో నెలకొన్న కరువు, జూరాల ప్రాజెక్టు వద్ద రైతుల ఆందోళనల నేపథ్యంలో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కీలక వ్యాఖ్యలు చేశారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి కోసమే కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. జూరాల రిజర్వాయర్ లో నీటి మట్టం తక్కువగా ఉండటానికి కారణాలను వివరిస్తూ – రిజర్వాయర్ లో భారీగా పూడిక పేరుకుపోయి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం, అలాగే ఎల్ నినో ప్రభావం వల్ల ఎగువన వర్షాభావ పరిస్థితులు నెలకొనడం ప్రధాన కారణాలని మంత్రి పేర్కొన్నారు. రైతుల పంటలు ఎండిపోతున్నాయని రైతు సంఘాలు ఆందోళన చేస్తున్న వేళ, ప్రభుత్వం మిగతా 2లో..

## తెలంగాణ ఉద్యోగులకు దీపావళి కానుక

### ఒకేసారి 2 డి.ఎ. లు విడుదల

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 7, విజన్ ఆంధ్ర: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఎప్పటి నుండో పెండింగ్ లో ఉన్న కరువు భత్యం (డి.ఎ.) లలో రెండు డి.ఎ. లను ఒకేసారి విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మిగతా 2లో..



# 25 ఏళ్ల తర్వాత తొలిసారి

- సగం బయటపడ్డ సంగమేశ్వరాలయం! కరువు సైరన్
- సోమశిల లో కృష్ణా నీరు ఇంకిపోయి గోపురం దర్శనం
- కరువు భయంలో రైతన్న

**తెలంగాణ స్టేట్ బ్యూరో,కొల్లాపూర్, అక్టోబర్ 7, విజన్ ఆంధ్ర:** సాధారణంగా వేసవిలో మాత్రమే పూర్తిగా దర్శనమిచ్చే చారిత్రక సంగమేశ్వరాలయం ఈసారి వర్షాకాలంలోనే సగం వరకు బయటపడింది. 25 ఏళ్లలో ఇలా వర్షాకాలంలో గోపురం పైభాగం కనిపించడం ఇదే మొదటిసారి అని స్థానికులు చెబుతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల సమీపంలో కృష్ణా నది బ్యాక్ వాటర్ లో ఉన్న ఈ 1000 ఏళ్ల నాటి ఆలయం ప్రస్తుతం నీటి మట్టం తగ్గడంతో పై అంతస్తు, గోపురం వరకు బయటకు వచ్చింది. కింది భాగం, గర్భగుడి ఇంకా నీటిలోనే ఉంది. సాధారణంగా జూన్ – జూలై నెలల్లో ఈ ప్రాంతమంతా 20–30 అడుగుల నీటిలో మునిగి ఉంటుంది. మిగతా 2లో..

## సీఎం చంద్రబాబును కలిసిన ఏషియన్ గేమ్స్ విజేతలు



అమరావతి, అక్టోబర్ 07 : 2026 ఆసియా క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మిగతా 2లో..

# రెపో రేటు 5.50 శాతానికి పెంపు

- 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ
- ఆగస్టులో ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరిక
- ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో నిర్ణయం
- ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం!!
- 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చు
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి
- ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడం తప్పదు
- ఎస్‌బీఐ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్



న్యూఢిల్లీ, అక్టోబర్ 07 : ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి చేరింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతో పాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.75 శాతానికి చేరాయి.ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దీంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల మిగతా 2లో..



# యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

- ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, అక్టోబర్ 07 : తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు జరిగిన డిఇ షా షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా డిఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్‌మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డిఇ షా ఒకటని మిగతా 2లో..

## ఢిల్లీలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

- ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో భేటీ చాన్స్?



అమరావతి, అక్టోబర్ 07 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి పయనమయ్యారు. ఈరోజు మధ్యాహ్నం ఆయన హస్తినకు చేరుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై, రాష్ట్రానికి మిగతా 2లో..

## కుమార్తె పెళ్లికి సీఎం విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల



అమరావతి, అక్టోబర్ 07 : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె వివాహ వేడుకకు ఆయన్ను ఆహ్వానించేందుకు షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నేడు చెన్నై వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం విజయ్‌ను నేరుగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వచ్చే నెల 25న తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని సీఎం విజయ్‌ను సాదరంగా కోరారు. ఈ సమావేశం అనంతరం షర్మిల మిగతా 2లో..

## 25 ఏళ్ల తర్వాత తొలిసారి

స్థానికులు ఏమంటున్నారు?
"ప్రతి ఏటా ఏప్రిల్, మే నెలలో ఆలయం పూర్తిగా బయటపడుతుంది. జూన్ లో వర్షాలు మొదలవ్వగానే మునిగిపోతుంది. కానీ ఈసారి సెప్టెంబర్ నెలలోనే, అది కూడా సగం వరకు కనిపిస్తోంది. అంటే వరద నీరు ఎంత తక్కువగా వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. కరువు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి" అని సోమశిల మత్స్యకారులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
నీటి మట్టం ఎందుకు తగ్గింది?
సోమశిల, శ్రీశైలం ప్రాజెక్టుల్లోకి ఎగువ నుంచి వరద ప్రవాహం ఈ ఏడాది 40% తక్కువగా నమోదైందని నీటిపారుదల శాఖ వర్గాలు చెబుతున్నాయి. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్ లలో నిల్వలు తక్కువగా ఉండటంతో కృష్ణాకు వరద తక్కువగా వచ్చింది. దీంతో సోమశిల బ్యాక్ వాటర్ లో నీటి నిల్వ 885 అడుగులకు బదులు 870 అడుగుల వద్దే ఉండిపోవడంతో ఆలయ గోపురం బయటపడింది.
భక్తుల ఆసక్తి:
సగం ఆలయం నీటిలో, సగం బయట ఉండటంతో ఆ దృశ్యం చూసేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. పడవలపై వెళ్లి గోపురాన్ని దర్శించుకుంటున్నారు. పూర్తిగా బయటపడితే గర్భగుడిలో పూజలు చేసే అవకాశం ఉంటుందని అర్చకులు చెబుతున్నారు. అయితే నీటి మట్టం మరింత తగ్గితే తప్ప పూర్తి దర్శనం సాధ్యం కాదు.
అధికారుల సూచన:
భక్తులు బురదలో, లోతైన నీటిలోకి వెళ్లవద్దని, పడవల్లో వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు హెచ్చరించారు..

## తెలంగాణ ఉద్యోగులకు దీపావళి కానుక

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 01-01-2024 నుండి డి.ఎ. ను 33.67% నుండి 37.31% కి పెంచింది. పెరిగిన శాతం 3.64%. అలాగే 01-07-2024 నుండి డి.ఎ. ను 37.31% నుండి 40.04% కి పెంచింది. పెరిగిన శాతం 2.73%. మొత్తంగా ఈ 2 డి.ఎ. ల ద్వారా 6.37% డి.ఎ. పెరిగింది. పెంచిన డి.ఎ. లను అక్టోబర్ 2026 నెల వేతనంతో కలిపి నవంబర్ 1, 2026 న చెల్లిస్తారు. పాత బకాయిలు (ఏరియర్స్ ) ను ఉద్యోగుల అర్హతను బట్టి జిపిఎఫ్ ఖాతాలో జమ చేయబడతాయి. సిపిఎస్ మరియు కాంటింజెంట్ ఉద్యోగులకు సమాన వాయిదాలలో చెల్లించబడతాయి. ఈ పెంపు వల్ల 50,000 బేసిక్ పే ఉన్న ఉద్యోగికి నెలకు దాదాపు రూ. 3185 అదనంగా లభిస్తుంది. దీంతో రాష్ట్రంలోని లక్షలాది మంది ఉద్యోగ, పెన్షనర్ల కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. గతంలో ఆర్ పి ఎస్ 2020 చివరి డి.ఎ. 33.67% ను జీవో నంబర్ 02, తేదీ 12-01-2026 ద్వారా విడుదల చేయగా, ఇప్పుడు 2 డి.ఎ. లు రావడంతో మిగిలిన 4 డి.ఎ. లు కూడా త్వరలో విడుదలవుతాయని ఉద్యోగ సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## కరువులో తాగునీటికే ప్రాధాన్యం

తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పడం చర్చనీయాంశంగా మారింది.
సింగూరు నీళ్లు బ్రూవరీలకా?
సింగూరు డ్యామ్ నుంచి బ్రూవరీలకు నీళ్లు ఇస్తున్నారనే ఆరోపణలపై మంత్రి స్పందిస్తూ - "ఇది పాత పద్ధతే, కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదు" అని తెలిపారు. గత ప్రభుత్వాల నుంచి వస్తున్న విధానాన్నే కొనసాగిస్తున్నామని ఆయన పరోక్షంగా చెప్పారు. యునైటెడ్ బ్రూవరీస్ వంటి కంపెనీలకు నీటి కేటాయింపుపై విపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.
శ్రీశైలం నీటిపై కీలక సూచన:
మరోవైపు శ్రీశైలం జలాలపై మంత్రి జూపల్లి గతంలోనే ఒక కీలక సూచన చేశారు. ఏడుళ్ల నుంచి కాకుండా శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి నేరుగా నీటిని తీసుకుంటే తెలంగాణకు ప్రయోజనం ఉంటుందని, అలాగే అచ్చంపేట మీదుగా నల్గొండకు శ్రీశైలం నీటిని తరలించాలని తాను సీఎం రేవంత్ రెడ్డికి సూచించినట్లు ఆయన వెల్లడించారు. ఆంధ్రా ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని, తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ పడబోమని కూడా ఆయన హెచ్చరించారు.
రైతుల ఆందోళన:
జూరాల నుంచి నీటి విడుదల చేయాలని కొల్లాపూర్, గద్వాల రైతులు రోడ్డెక్కారు. తమ పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటామని చెబుతోంది.

## సీఎం చంద్రబాబును కలిసిన ఏషియన్ గేమ్స్ విజేతలు

పతకాలు సాధించిన క్రీడాకారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా సత్కరించారు. నేడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విజేతలు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తిని చాటిచెప్పినందుకు వారిని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో క్రికెటర్ శ్రీచరణి, ఆర్చర్లు గణేశ్ మణిరత్నం, ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ ఉన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడాకారులు సాధించిన పతకాల వివరాలను శాప్ ఎండీ భరణి ముఖ్యమంత్రికి వివరించారు. మూడు వేర్వేరు క్రీడాంశాల్లో మన అథ్లెట్లు 3 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి మొత్తం 8 పతకాలను గెలుచుకున్నారని ఆయన తెలిపారు. ఈ విజయాల స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలతో పాటు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ఢిల్లీలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన చర్చించనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి, ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో భేటీ కానున్నారు. ప్రధానంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు తక్షణ ఆమోదం తెలపాలని ఆయన ప్రధానిని కోరనున్నారు. అలాగే, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితుల దృష్ట్యా సహాయక చర్యల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేయనున్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్రం నుంచి అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిపే చర్చల్లో ముఖ్యమంత్రి ప్రస్తావించనున్నారు. గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళుతున్న మిగులు జలాల సద్వినియోగం, నదుల అనుసంధానం ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం చేయించడం వంటి అంశాలను కేంద్ర జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా రేపు మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించే 'భాగస్వామ్య సదస్సు' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం రేపు రాత్రికి ఆయన ఢిల్లీ నుంచి తిరిగి అమరావతికి బయలుదేరనున్నారు.

## కుమార్తె పెళ్లికి సీఎం విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. తమకు సమయం కేటాయించిన సీఎం విజయ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆయన చూపిన ఆప్యాయత, అనురాగం ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాబోయే దంపతులకు సీఎం విజయ్ తన శుభాకాంక్షలు తెలియజేసినట్లు వైఎస్ షర్మిల వివరించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు

ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు.తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శి

## యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. "సుమారు 20 మందితో ప్రారంభమైన డిఇ షా ఇండియా ప్రస్థానం ఇవ్వాళ హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది. సాంకేతికత, ఆర్థిక పరిశోధన, ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కార్పొరేట్ విభాగాల్లోని సంస్థ బృందాలు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నాయి" అని మంత్రి తెలిపారు. మూడు దశాబ్దాలుగా డీఈ షా సాధించిన వృద్ధి హైదరాబాద్ ఎదుగుదలతో ముడిపడి ఉందన్నారు. నగరం ఇప్పుడు ప్రపంచస్థాయి సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు కేంద్రంగా మారిందని చెప్పారు. "హైదరాబాద్ గత మూడు దశాబ్దాల్లో ఎంతో మారింది. సాంకేతికత, ఆవిష్కరణలు, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగింది. యువతలోని నైపుణ్యం, ప్రతిభే మన ప్రధాన బలం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సంస్థలు కేవలం తమ కార్యకలాపాలను నిర్వహించే ప్రదేశంగా కాకుండా.. కొత్త ఆవిష్కరణలు, అత్యున్నత విలువ కలిగిన కార్యకలాపాలు, భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణను కేంద్రంగా ఎంచుకునేలా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. "ప్రపంచ సంస్థలు ఇక్కడ విస్తరించాలి. ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. అత్యున్నత నైపుణ్యంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాలి. ఇందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది" అని చెప్పారు. డిఇ షా నియోపొలిస్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయాన్ని మంత్రి స్వాగతించారు. హైదరాబాద్‌పై సంస్థకు ఉన్న దీర్ఘకాలిక నమ్మకానికి ఇది మరో నిదర్శనమన్నారు. "నియోపొలిస్‌లో డిఇ షా ఏర్పాటు చేస్తున్న కొత్త కార్యాలయం కేవలం మరో కార్యాలయం కాదు. హైదరాబాద్ భవిష్యత్తుపై, తెలంగాణ వృద్ధి ప్రయాణంపై ఆ సంస్థకు ఉన్న విశ్వాసానికి ఇది బలమైన సంకేతం" అని శ్రీధర్‌బాబు అన్నారు.

కొత్త కార్యాలయం ద్వారా హైదరాబాద్‌లో డీఈ షా కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. "ఈ విస్తరణను తెలంగాణ స్వాగతిస్తోంది. రానున్న రోజుల్లో డీఈ షా రాష్ట్రంలో మరింతగా విస్తరిస్తుందని ఆశిస్తున్నాం" అని మంత్రి చెప్పారు. ప్రపంచస్థాయి సంస్థల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. "డిఇ షా నాయకత్వానికి నేను హామీ ఇస్తున్నాను. మీ వృద్ధి, విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది. మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణలో సౌలభ్యం, ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇస్తాం" అని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ సాంకేతిక, ఆర్థిక సేవల సంస్థలకు తెలంగాణను మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## రెపో రేటు 5.50 శాతానికి పెంపు

సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జులైలో ఇది 4.45 శాతంగా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపో రేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపో రేటు పెరగొచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మార్కెట్లలో మారుతున్న రిస్క్‌ల నేపథ్యంలో ముందస్తు చర్య తీసుకోవడం మంచిదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావం, అక్టోబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కూడా రబీ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు తెలిపారు. మరోవైపు రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది. వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే. ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది.

గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

# తొమ్మిది రాత్రులు.. తొమ్మిది అద్భుతాలు..

నవరాత్రులు ఎందుకు అంత స్పెషల్? శాస్త్రీయ రహస్యం!

***కాల మహత్యం:***

సంవత్సరంలో నాలుగు నవరాత్రులు వస్తాయి. అందులో శరన్నవరాత్రులు అత్యంత శక్తివంతమైనవి. ఈ సమయంలో భూమి సూర్యుడికి దగ్గరగా ఉండి, విశ్వంలోని పాజిటివ్ ఎనర్జీ భూమిపై ఎక్కువగా ఉంటుందని శాస్త్రం చెబుతుంది. అందుకే ఈ 9 రోజులు ఉపవాసం, ధ్యానం చేస్తే మన శరీరానికి మంచి శక్తి వస్తుంది.
నవదుర్గల్లో దాగిన జీవిత పాఠం:

***అమ్మవారి 9 రూపాలు ఒక మనిషి జీవితంలో ఎదిగే 9 దశలు.***

- శైలపుత్రి - పుట్టుక
- బ్రహ్మచారిణి - విద్య, తపస్సు
- చంద్రఘంట - యవ్వనం, అందం
- కూష్మాండ - సృష్టి, పెళ్లి, పిల్లలు




- స్కందమాత - తల్లిగా బాధ్యత
- కాత్యాయని - ధర్మం కోసం పోరాటం
- కాళరాత్రి - కష్టాలను ఎదుర్కోవడం
- మహాగౌరి - పాపాలు కడిగి ప్రశాంతత
- సిద్ధిదాత్రి - చివరకు మోక్షం, జ్ఞానం పొందడం




***మాలధారణ, విగ్రహాలు - ఊరంతా ఒక్కటయ్యే మహా సంబరం!***

***అమ్మవారి మాల అంటే ఏమిటి?***

మాల వేయడం అంటే 9 రోజులు అమ్మవారిలా బతకడం. ఉదయం 4 గంటలకే లేవడం, చన్నీటి స్నానం, కటిక నేలపై పడుకోవడం, ఒంటిపూట భోజనం, ఎవరినీ తిట్టకపోవడం, అబద్ధం ఆడకపోవడం. ఇది మన శరీరాన్ని, మనస్సును శుద్ధి చేసే ఒక గొప్ప యజ్ఞం. మాలలో ఉన్న 108 పూసలు



మనలోని 108 చెడు ఆలోచనలను తీసేస్తాయని నమ్మకం.

***విగ్రహం ఎందుకు పెడతారు? ఎలా పూజిస్తారు?***

ఊరి మధ్యలో అమ్మవారి విగ్రహం పెట్టడం వెనుక ఒక పెద్ద సంస్కృతి ఉంది.




మట్టి విగ్రహం రహస్యం:
అమ్మవారి విగ్రహాన్ని చెరువు మట్టితోనే ఎందుకు చేస్తారు? ఎందుకంటే మట్టి నుండి పుట్టి మట్టిలోనే కలవాలి అనే జీవిత సత్యాన్ని చెప్పడానికి.

***పూజా విధానం:***

ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, రాత్రి కోలాటం, బతుకమ్మ, దీపాలతో అమ్మవారికి హారతి. చివరి రోజున అమ్మవారిని చెరువులో నిమజ్జనం చేస్తారు. అంటే అమ్మవారు నీటిలో కలిసి మళ్లీ వర్షంగా వచ్చి పంటలను పండిస్తుందని రైతుల నమ్మకం.

***చివరి హైలైట్ పాయింట్:***

దేవీ నవరాత్రులు కేవలం 9 రోజుల పండుగ కాదు. ఇది మనకు ఒక గుణపాఠం. నీలో కూడా దుర్గమ్మ ఉంది, నీ కష్టాలనే మహిషాసురుడిని నువ్వే చంపుకోవాలి అని చెప్పే పండుగ. అందుకే ఈ నవరాత్రుల్లో అమ్మవారిని పూజించండి, మీలోని శక్తిని గుర్తించండి. అప్పుడే మీ ఇంట్లో నిజమైన దసరా పండుగ.

## తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

13 వేల మెగావాట్లుగా ఉందని తెలిపారు. ఈ రాష్ట్రాల కంటే తెలంగాణలో విద్యుత్ వినియోగ డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాను కొనసాగించగలిగామని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ రంగంపై కొందరు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర విద్యుత్ సంస్థలను పబ్లిక్‌గా లిస్ట్ చేయడం లేదా వాటిని ప్రభుత్వ రంగం నుంచి తప్పించే ప్రతిపాదన కూడా లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నెహ్రూ అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రస్తావించిన భట్టి.. మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో పాటు బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు కాంగ్రెస్ విధానంలో కీలక భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత పటిష్ఠం చేస్తామని తెలిపారు.

## 'రోడ్ డస్ట్' నియంత్రణకు ప్రత్యేక దృష్టి

ప్రజా అవగాహన కార్యక్రమాలతో కూడిన సమగ్ర కార్యాచరణను కొనసాగిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. సెక్రటేరియట్ లో కమిటి ఛైర్మన్, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ ఆధ్వర్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ రవి కమిటి మెంబర్ కన్వీనర్ గా నిర్వహించిన ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి సమావేశం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ఆమోదించిన ఎక్యుఎంసి కార్యాచరణ ప్రణాళికలోని అంశాల పై చర్చించింది. సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్, NCAP నోడల్ ఆఫీసర్ ప్రసాద్, జీహెచ్ఎంసి, సైబరాబాద్ మల్కాజ్గిరి కార్పొరేషన్ల కమిషనర్లు, నల్గొండ కలెక్టర్, సిడిఎంఎ అధికారులు, ట్రాన్స్పోర్ట్ కమిషనర్, టిజిఎస్ ఆర్ టిసి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి ట్రాఫిక్ కమిషనరేట్ల అధికారులు, టిజి ఐఐసి, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన కార్యక్రమాల పై చర్చించిన తర్వాత ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, ఫలితాలను సమావేశం విశ్లేషించింది. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద ఎక్యుఎంసి చేపడుతున్న కార్యక్రమాలను సీనియర్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ ప్రసాద్ కమిటి ఛైర్మన్ అహ్మద్ నదీమ్, టిజిపిసిబి మెంబర్ సెక్రటరీ, కమిటి మెంబర్ కన్వీనర్ రవి, కమిటి సభ్యులకు వివరించారు. వాయు నాణ్యతను మరింత ఖచ్చితంగా, నిరంతరంగా పర్యవేక్షించేందుకు 13 'నిరంతర పరిసర వాయు నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ ల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతున్నది. పర్యవేక్షణ కేంద్రాల స్థానాలను శాస్త్రీయంగా నిర్ణయించి, ఆయా ప్రాంతాల్లోని వాయు నాణ్యతకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని పొందేలా సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. డేటాను సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావడానికి "ఎయిర్ క్వాలిటి డ్యాష్ బోర్డు" అభివృద్ధి ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. సంబంధిత శాఖలకు అలర్ట్ ల ద్వారా వాయు నాణ్యతకు సంబంధించిన సమాచారం చేరవేస్తారు. అదేవిధంగా తక్కువ వ్యయంతో వాయు నాణ్యతను పర్యవేక్షించే 'లో కాస్ట్ సెన్సార్ల వినియోగాన్ని కూడా విస్తరిస్తున్నారు. టిజిపిసిబి ఆధ్వర్యంలో బొల్లారం, జీడిమెట్ల ప్రాంతాల్లో ఇప్పటికే 8 ఎల్సిఎస్ లను ఏర్పాటు చేశారు. రీసైక్లింగ్, క్రషింగ్ తదితర కార్యకలాపాలు జరిగే ప్రాంతాల్లో, అలాగే నిర్మాణ, కూల్చివేత ప్రదేశాల్లో ఎల్సిఎస్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.పట్టణ వాయు కాలుష్యంలో ధూళికణాల కాలుష్యాన్ని నియంత్రించేందుకు రోడ్ డస్ట్ నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. రోడ్ల మెరుగుదల, ఎండ్-టు-ఎండ్ పేవింగ్, మెకానికల్ రోడ్ స్వీపింగ్, బహిరంగ ప్రాంతాల్లో పచ్చదనం పెంపుదల, ట్రాఫిక్ కారిడార్లలో గ్రీన్ కవర్, మినీ ఫారెస్టులు, మియావాకీ ప్లాంటేషన్లు వంటి చర్యలను నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (చీజూూా) కింద చేపడుతున్నారు. మెకానికల్ రోడ్ స్వీపింగ్‌పై టిజిపిసిబి నిర్వహించిన అధ్యయన ఫలితాలను మూడు పట్టణ స్థానిక సంస్థల అధికారులకు వివరించేందుకు వర్క్ షాప్ నిర్వహించగా, సుమారు 100 మంది అధికారులు పాల్గొన్నారు. అధ్యయన సిఫారసులను రాబోయే సర్వీస్ ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోనున్నారు. వాహనాల ఉద్గారాలను తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, పీయూసి వ్యవస్థ బలోపేతం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ వాహనాల కొనుగోలు, అద్దెకు తీసుకునే వాహనాల్లో ఈవీ లకు ప్రాధాన్యత కల్పించే చర్యలు అమలయ్యాయి. పీయూసి వ్యవస్థను మరింత సమర్థవంతం చేసేందుకు రాష్ట్రంలోని 516 పీయూసి కేంద్రాలను కేంద్ర సర్వర్‌తో అనుసంధానం చేశారు. ఇప్పటివరకు 36,14,208 పరీక్షలు నిర్వహించినట్లు రవాణా శాఖ నివేదించింది. పీయూసి గడువు ముగిసిన వాహనాలపై ఆటోమేటిక్ చలాన్ల విధానం అమలు చేసేందుకు వాహనాల నంబర్ ప్లేట్లను స్వయంచాలకంగా గుర్తించే కెమెరాల ఏర్పాటుకు కూడా చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా రంగంలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచే చర్యలు కొనసాగుతున్నాయి. ఆర్టీసి ప్రస్తుతం జీహెచ్ఎంసి పరిధిలో 310 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతోంది. అదనంగా ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్యను పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. రాష్ట్రానికి కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా కొనసాగుతున్నది. నల్గొండ, సంగారెడ్డి ప్రాంతాల్లో వాయు కాలుష్యానికి కారకమవుతున్న వివిధ మూలాలను శాస్త్రీయంగా గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. ఐఐటీ బాంబే సమర్పించిన డ్రాఫ్ట్ తుది నివేదికను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా మరింత మెరుగుపరచేందుకు టిజిపిసిబి, ఇతర నిపుణ సంస్థలు సూచనలు అందించాయి. ఈ అధ్యయన ఫలితాలను భవిష్యత్ కాలుష్య నియంత్రణ చర్యలకు ఉపయోగించనున్నారు. తెలంగాణలో వాయు కాలుష్య నియంత్రణ కోసం స్టేట్ యాక్షన్ ప్లాన్ ను మరింత శాస్త్రీయంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి యునైటెడ్ నేషన్ ఎన్విరాన్ మెంట్ ప్రోగ్రామ్ తో కలిసి ఉద్గారాల సమగ్ర లెక్కింపు పై చర్యలు చేపడుతున్నది. వివిధ శాఖల నుంచి అమలు నివేదికలను సేకరించి, రాష్ట్ర స్థాయి కార్యాచరణను మరింత సమర్థవంతంగా రూపొందించే ప్రక్రియ కొనసాగుతున్నది. అన్ని జిల్లాలకు జిల్లా స్థాయి అమలు కమిటీల పరిధిని విస్తరించే చర్యలు కూడా ప్రతిపాదనలు సమర్పించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో వాయు నాణ్యత పర్యవేక్షణను బలోపేతం చేయడంతో పాటు, నిర్మాణ ప్రాంతాలు, ఇతర ప్రధాన కాలుష్య ఉత్పత్తి ప్రాంతాల్లో పర్యవేక్షణకు సెన్సార్ వ్యవస్థలను విస్తరిస్తున్నారు. డీజిల్ జనరేటర్ సెట్ల నుంచి వెలువడే ఉద్గారాలను నియంత్రించేందుకు ఉద్గార నియంత్రణ పరికరాల అదనపు అమరిక లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సంబంధిత సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు, విద్యుత్ శాఖల సమన్వయంతో అమలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ అవశేషాలను బహిరంగంగా దహనం చేయడం వల్ల వాయు కాలుష్యం పెరగకుండా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ అవశేషాలను బ్రికెట్లు, పెలెట్లుగా మార్చి సంప్రదాయ ఘన ఇంధనాలకు ప్రత్యామ్నాయ ఇంధనంగా వినియోగించే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బ్రికెట్ తయారీ యూనిట్ల ఏర్పాటు ఇప్పటికే ప్రారంభమైంది. 15వ ఫైనాన్స్ కమిషన్ కింద విడుదలైన నిధులను నిర్దేశిత వాయు కాలుష్య నియంత్రణ చర్యలకు సమర్థవంతంగా వినియోగించడంపై ఎయిర్ క్వాలిటి మానిటరింగ్ కమిటి ప్రత్యేకంగా సమీక్షించింది. హైదరాబాద్‌లో కింద విడుదలైన నిధుల్లో 90.27 శాతం, నల్గొండలో 82.5 శాతం, పటాన్‌చెరులో 100 శాతం, సంగారెడ్డిలో 76.43 శాతం వినియోగమైనట్లు సమీక్షలో వెల్లడైంది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణలో నల్గొండకు రూ.4.83 కోట్లు, సంగారెడ్డికి రూ.2.42 కోట్లు, మొత్తం రూ.7.25 కోట్ల నిధులు కేటాయించారు.

ఈ నిధులతో రహదారుల మెరుగుదల, పచ్చదనం, ఎలక్ట్రిక్ క్రిమేటోరియంలు తదితర వాయు నాణ్యత మెరుగుదల చర్యలకు వార్షిక కార్యాచరణ ప్రణాళికలు టిజిపిసిబి సిద్ధం చేసింది. చీజూూా దేశవ్యాప్తంగా 130 నగరాల్లో తొలిసారిగా నిర్వహించిన వార్డు స్థాయి స్వచ్ఛ వాయు పర్యవేక్షణ్ లో తెలంగాణకు గుర్తింపు లభించింది. నల్గొండలోని 16వ వార్డు కేటగిరి 3 (10 వేల జనాభా) కింద జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించి రూ.20 లక్షల పురస్కారం పొందింది.అదేవిధంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్ 215వ వార్డు, గన్‌ఫౌండ్రీ 154వ వార్డు, సంగారెడ్డిలోని 31వ వార్డు రాష్ట్ర స్థాయిలో కేటగిరి 1,2,3 కింద అత్యుత్తమ పనితీరు కనబరిచిన వార్డులుగా నిలిచాయి. రవాణా, మున్సిపల్ పరిపాలన, పరిశ్రమలు, ట్రాఫిక్ వ్యవసాయం, పట్టణాభివృద్ధి తదితర శాఖల సమన్వయంతోనే వాయు కాలుష్యానికి దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ, కమిటి మెంబర్ కన్వీనర్ రవి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అందుబాటులోకి వస్తున్న రియల్‌టైమ్ వాయు నాణ్యత డేటా, కాలుష్య మూలాల అధ్యయన ఫలితాలు, ఉద్గారాల సమగ్ర లెక్కింపు, శాస్త్రీయ అధ్యయనాలు, ఫీల్డ్ లెవల్ చర్యలను సమన్వయం చేసి కాలుష్య మూలాలను లక్ష్యంగా చేసుకుని టిజిపిసిబి చర్యలు చేపడుతున్నదని తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, సంబంధిత శాఖల సమన్వయం, శాస్త్రీయ పర్యవేక్షణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా తెలంగాణలో మెరుగైన వాయు నాణ్యతను సాధించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిరంతరం కృషి చేస్తున్నదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ హైదరాబాద్, సికింద్రాబాద్ లలో సిటి గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ను విస్తరించే దిశగా చర్యలు తీసుకోవాలని కమిటి ఛైర్మన్ అహ్మద్ నదీమ్ సంస్థ అధికారులకు సూచించారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# అనుభవమే గొప్ప ఆస్తి

సీఎం, పీఎంగా 25 ఏళ్ల అధికార ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ తన రాజకీయ జీవితం, వ్యక్తిగత అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, తన జీవితంలోని ప్రతి క్షణం, ప్రతి సంఘటన తనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పించాయని తెలిపారు. సాధించిన ప్రతి విజయం తనను మరింత ఉన్నత లక్ష్యాల వైపు నడిపించిందని అన్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు. తన చిన్నతనం రోజులను గుర్తుచేసుకుంటూ, గుజరాత్‌లోని వద్నగర్‌ను ప్రస్తావించారు ప్రధాని మోదీ. తాను ఎప్పుడూ పాఠశాలకు అందరికంటే ముందుగా వచ్చే విద్యార్థులలో ఒకడినని తెలిపారు. నేర్చుకోవాలనే తపన తన జీవితంలో ఒక భాగమని, నేటికీ తాను ఎప్పుడూ ఒక విద్యార్థిగానే భావిస్తానని పేర్కొన్నారు. తన చదువు, నేర్చుకునే తపన ఎన్నటికీ తగ్గకూడదని దేవుడిని ప్రార్థించినట్లు వెల్లడించారు. జీవితంలో ఎదురైన కష్టాల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చెబుతూ, "నన్ను కించపరిచిన వారు నాకు కోసం తిరిగి నిలబడటం నేర్పించారు. నన్ను వ్యతిరేకించిన వారు ప్రజాస్వామ్య శక్తిని నేర్పించారు. ప్రతి సంక్షోభం నా సహనానికి ఒక పరీక్షగా నిలిచింది" అని అన్నారు. బాధ్యతలను ఒక లక్ష్యంగా మార్చుకున్నామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కార్యాచరణే తన మతమని, భగవద్గీత బోధించిన 'కర్మణ్యే వాధికారస్తే' మార్గంలోనే నడుస్తున్నానని చెప్పారు. తాను ఎప్పుడూ కీర్తి ప్రతిష్టల గురించి పట్టించుకోలేదని, కేవలం దేశం కోసం పని చేయడమే తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాతికేళ్ల పాటు ప్రభుత్వం అధినేతగా కొనసాగుతానని తాను అసలు ఊహించలేదని, తన కెరీర్ ఇలా సాగుతుందని అసలు ఊహించలేదు అన్నారు. "దేశం నాకు చాలా ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత అందరికంటే ఎక్కువగా ఉంటుంది. భారత్‌లోని ప్రతి పౌరుడికీ నాపై అత్యంత హక్కు ఉందని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను" అన్నారు. ప్రధానమంత్రి మాట్లాడుతూ, "నేను దేశప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 7 అక్టోబర్ 2001న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ ఘట్టం వస్తుందని అనుకోలేదు. ఈరోజు ప్రభుత్వ అధినేతగా నిరంతరం సేవ చేస్తూ నేను 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాను. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదాల ఫలితం. బీజేపీ, ఎన్డీఏ, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉన్న రాజకీయ సహచరులందరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను దేశ ప్రజల పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అన్నారు. మరోవైపు 25 ఏళ్ల సుదీర్ఘ కాలంపాటు ప్రభుత్వ అధినేతగా పనిచేసిన ప్రధాని మోదీ నాయకత్వాన్ని కేంద్ర కేబినెట్ మంగళవారం ప్రశంసించింది. తొలుత గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత భారత ప్రధానమంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడింది. 'దేశమే ప్రథమం, పౌరుడే తొలి ప్రాధాన్యం' అనే సూత్రంతో ముందుకు వెళ్తున్నారని పేర్కొంది. విశేష జనాదరణ పొందుతూ మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ వరుసగా విజయాలు సాధించారని గుర్తు చేస్తూ, ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా మూడుసార్లు సేవలందించిన సమయంలో మోదీ పలు విజయవంతమైన కార్యక్రమాలను చేపట్టారని కేబినెట్ పేర్కొంది. గుజరాత్‌లో అమలు చేసిన పథకాల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ దార్శనికతతో ముందుకు సాగుతున్నారని తెలిపింది. చిన్నతనంలో తన తల్లి ఎదుర్కొన్న ఇబ్బందికర పరిస్థితులను, దేశంలో పేదరికాన్ని స్వయంగా చూసిన అనుభవం మోదీ విధానాలపై ప్రభావం చూపిందని పేర్కొంది. ఆ అనుభవాలతో ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారని తెలిపింది. మహిళలు, రైతులు, యువతకు అవకాశాలను విస్తరించేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని కేబినెట్ పేర్కొంది. దేశ అభివృద్ధికి అవసరమైన సంస్కరణలను ధైర్యంగా చేపడుతున్నారని తెలిపింది. మోదీ నాయకత్వంలో మూలధన వ్యయం రూ.12 లక్షల కోట్లకు పెరిగిందని వెల్లడించింది. హైవేల విస్తరణ, రైల్వేల ఆధునీకీకరణ వేగంగా జరుగుతున్నాయని పేర్కొంది. అలాగే మోదీ పాలనలో డిజిటల్ సేవల్లోనూ విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని కేబినెట్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లు, అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ తన నాయకత్వ సామర్థ్యంతో దేశాన్ని సరైన దిశలో ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొంది. అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు ప్రాధాన్యం మరింత పెరుగుతోందని తెలిపింది. దేశ భద్రత విషయంలోనూ ప్రధాని మోదీ రాజీపడని వైఖరిని అవలంబిస్తున్నారని కేబినెట్ తీర్మానంలో పేర్కొంది. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలు ఇందుకు నిదర్శనమని తెలిపింది. 2047 నాటికి సుసంపన్న, అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు మద్దతుగా నిలుస్తూ తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్లు కేబినెట్ వెల్లడించింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ అథారిటీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రవాణా రంగంలో పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టుల పర్యవేక్షణలో ఈ సంస్థ కీలకంగా వ్యవహరించనుందని కేంద్ర ఐటీ, సమాచారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వివిధ మంత్రిత్వ శాఖలు, ఏజెన్సీల మధ్య సమన్వయ లోపాలను తగ్గించి మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచేలా ఇట్లా పనిచేస్తుందని ఆయన వివరించారు. రూ.500 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సాంకేతిక అర్హతలను ఇట్లా మదింపు చేస్తుందని తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా రూ.10 వేల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసే ప్రతిపాదనకూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ గ్రోత్ ఫండ్ ద్వారా ఎంఎస్ ఎంఈ లకు దీర్ఘకాలంలో అవసరమైన పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దీంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవడంతో పాటు నూతన సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. మొత్తంగా ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపిస్తూ కేబినెట్ తీర్మానం చేయడంతో పాటు రవాణా మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ రంగంలో సమన్వయం, ఎంఎస్ ఎంఈలకు పెట్టుబడుల లభ్యతను పెంచే కీలక నిర్ణయాలను సమావేశంలో తీసుకుంది.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య**



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు రావు, మండల విద్యాధికారి, గ్రామ సర్పంచ్ ఫయాజ్ లతో కలిసి సందర్శించి పాఠశాలలోని తరగతి గదులు, రిజిస్టర్లను తనిఖీ చేసి పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేసే పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని, ప్రతి విద్యార్థి విద్యా పురోగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక బోధన అందిస్తూ విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పర్యవేక్షించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం సకాలంలో అందేలా సంబంధిత అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## "రాజనాల కళా తరంగిణి" ఆధ్వర్యంలో "పురుషోత్తం పటేల్" కు ఘన సత్కారం




హైదరాబాద్ అక్టోబర్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, హైదరాబాద్. సౌజన్యంతో ప్రముఖ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రముఖ నిర్మాత దర్శకుడు రాజనాల సత్య నేతృత్వంలో నిర్వహించిన "రాజనాల కళా తరంగిణి – షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్" కార్యక్రమం ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. బుధవారం సాయంత్రం పి.జె.ఆర్ థియేటర్, 2వ అంతస్తు, రవీంద్ర భారతి, హైదరాబాద్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలోపలువురు ప్రముఖులను, కళాకారులను సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రముఖ సామాజికవేత్త, ప్రముఖ సేవా తాత్పరుడు, మాజీ కొత్తపేట్ ఫ్రూట్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుటం. పురుషోత్తం పటేల్ ను షాల్ తో, మొమెంటో తో ఘనంగా సత్కరించిన నిర్వాహకులు, అతిథులు వంశీ రామరాజు, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ ఇతర ప్రముఖులు. ఈ సందర్భంగా పుటం. పురుషోత్తం పటేల్ మాట్లాడుతూ, కళలు, కళాకారుల ప్రోత్సాహం కోసం తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు ప్రేక్షకులను అలరించారు.

## ఎన్.సీ.సీ. తెలంగాణ అధ్యక్షుడిగా బిషప్ మద్దెల సంజయ్ ఆనంద్..!

**- మరో రెండేళ్లు పదవీకాలం పొడిగింపు..!**




కాప్రా/అక్టోబర్ –07(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (చీజజ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బిషప్ మద్దెల సంజయ్ ఆనంద్ మరో రెండేళ్లపాటు పునర్నియమితులయ్యారు. ఆయనకు పునర్నియామక ఉత్తర్వులను ఎన్.సీ.సీ. వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.టి. రెవ. డాక్టర్ కె. సామ్ పాల్, రెవ. స్టీఫెన్ చిట్టిబాబు, రెవ. బ్రైటీ బ్యూలా అందజేశారు. గత ఐదేళ్లుగా న ఎన్.సీ.సీ. తో కలిసి పనిచేస్తున్న సంజయ్ ఆనంద్ తెలంగాణలో సంస్థాగత విస్తరణ, నాయకత్వ బలోపేతం, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు, క్రైస్తవ సమాజ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు కృషి చేశారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, హక్కులు, అభివృద్ధి అంశాలపై పలు కార్యక్రమాలు చేపట్టారు. తన పునర్నియామకానికి జాతీయ నాయకత్వానికి, రాష్ట్ర కమిటీకి, ఎన్. సీ.సీ కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రెండేళ్లలో 'క్రైస్తవ హక్కులు––సమాజ అభివృద్ధి––ఎన్. సి. సి. బలోపేతం' లక్ష్యంతో సేవా, అవగాహన, సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని పేర్కొన్నారు.

# వేరుశనగ రైతులకు డికార్టికేటర్ యంత్రం రైతులకు ఎంతో ఉపయోగకరం

***ఉప్పునుంతల లో యంత్రం పనితీరును పరిశీలించిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్***

అచ్చంపేట అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : వేరుశనగ రైతులకు డీకార్టికేటర్ యంత్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు అచ్చంపేట నియోజకవర్గం లోని ఉప్పునుంతల మండలంలో వేరుశనగ డిగార్డినేటర్ యంత్రం కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు యంత్రం పనితీరు, సామర్థ్యం, రైతులకు అందుతున్న సేవలపై అధికారులతో మాట్లాడారు వేరుశనగ పంట సాగు చేసే రైతులకు పంట అనంతరం ప్రక్రియలో ఇబ్బందులను తగ్గించి, శ్రమను ఆదా చేసేందుకు అందుబాటులోకి తీసుకొచ్చిన డీకార్టికేటర్ యంత్రం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గంలోని ఉప్పునుంతల మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేరుశనగ గింజల నుంచి పొట్టు తొలగించే డీకార్టికేటర్ యంత్రం ద్వారా నిర్వహిస్తున్న ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పరిశీలించారు. అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ యంత్రం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా యంత్రం ఏర్పాటు చేసిన ఉద్దేశ్యం, దాని పనితీరు, సామర్థ్యం,



ఒకేసారి ఎంత పరిమాణంలో వేరుశనగను శుభ్రపరచి గింజలను వేరు చేయగలదు, రైతులకు ఏ విధంగా సేవలు అందిస్తున్నారనే అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వేరుశనగ కాయల నుంచి పొట్టును తొలగించి, నాణ్యమైన గింజలను వేరు చేసే ప్రక్రియను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వేరుశనగ సాగులో పంట కోత అనంతరం గింజలను వేరు చేయడం, శుభ్రపరచడం వంటి పనులకు రైతులు గతంలో ఎక్కువ సమయం, శ్రమ వెచ్చించాల్సి వచ్చేదని, యాంత్రీకరణ ద్వారా ఈ ప్రక్రియను సులభతరం చేయవచ్చని, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ఇటువంటి యంత్రాలు అందుబాటులో ఉండటం వల్ల పంట అనంతర పనుల్లో శ్రమ, సమయం ఆదా అవుతుందని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ యంత్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా అవసరమైన అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేరుశనగ సాగు చేసే రైతులకు యంత్రం ద్వారా అందించే సేవలపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వ్యవసాయ పనుల్లో ఆధునిక పద్ధతులను ప్రోత్సహించవచ్చని కలెక్టర్ తెలిపారు. పంటల సాగు నుంచి పంట అనంతర ప్రక్రియ వరకు రైతులకు అవసరమైన సాంకేతిక, యాంత్రీకరణ సేవలను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సంబంధించిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో పరిశుభ్రత, సురక్షిత త్రాగునీటిపై అవగాహన కల్పించాలి

***రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద***

మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించడంతో పాటు నీటి వనరుల పరిరక్షణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండలం దాంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బాలవికాస నీటి శుద్ధికరణ పథకాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ బాలవికాస నీటి శుద్ధికరణ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. 3 లక్షల 25 వేల రూపాయలతో ఏర్పాటు చేయడం జరిగిందని, 5 రూపాయలకు 20 లీటర్ల శుద్ధమైన త్రాగునీటిని అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించడం, త్రాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం, నీటి కాలుష్యాన్ని




నివారించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాలలోని నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా గ్రామంలో 72 ఇండ్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గృహజ్యోతి పథకం క్రింద అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుదారులకు చౌక ధరల దుకాణాల ద్వారా ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 10 లక్షల రూపాయల విలువ గల కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడం జరుగుతుందని, వ్యయపరిమితి దాటిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో సుమారు 10 వేల మంది ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని సోమనపల్లిలో 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం 100 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరలోనే ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల కోసం పల్లె దవాఖానకు శంకుస్థాపన చేయడం జరిగిందని, 4 కోట్ల రూపాయలతో సి.సి. రహదారుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బతుకమ్మ కొరకు హైమాస్ లైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, బోర్లు ఏర్పాటు చేసి నీటిని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 2047 వికసి త్ భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- నరేంద్ర మోడీ పాలనలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం**

**- శాసనమండలి సభ్యులు మల్క కొమరయ్య**

**జిల్లా అధ్యక్షుడు యు రమేష్ కుమార్ ముదిరాజ్**

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 07 ( విజన్ ఆంధ్ర ) : అన్నింటికంటే దేశమే ముఖ్యమని నమ్మిన పార్టీ భారతీయ జనతా పార్టీ అని శాసనమండలి సభ్యులు మల్క కొమరయ్య, బిజెపి పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు యు రమేష్ కుమార్ ముదిరాజ్ అన్నారు. బుధవారం సంకల్ప్ అభియాన్ లో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని చిగుర్లపల్లి గ్రౌండ్ లో బిజెపి పార్టీ నాయకులు నరేంద్ర మోడీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2047 వికసిద్భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. నరేంద్ర మోడీ పాలనలో భారత దేశం అతి వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రపంచ దేశాలు భారతదేశం వైపు, నరేంద్ర మోడీ వైపు చూస్తున్నాయని అన్నారు. నరేంద్ర మోడీ 25 సంవత్సరాలు సుదీర్ఘంగా ప్రజలకు నిరంతరంగా సేవలు అందించారని అన్నారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.



తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సేవాజ్యోతి యాత్రలో భాగంగా బిజేఆర్ చౌరస్తా నుండి, బసవేశ్వర చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ యాదవ్, బిజెపి పార్టీ వికారాబాద్ జిల్లా ఇంచార్జ్ సుధాకర్, వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సంకల్ప్ అభియాన్ రాష్ట్ర కో కన్వీనర్లు పెద్దింటి నవీన్ కుమార్, ఎస్ శ్రీలత, అసెంబ్లీ కోఆర్డినేటర్, దిశ కమిటీ మెంబర్ వడ్ల నందు,రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు శివరాజ్, వివేకానంద రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అనిల్ యాదవ్, పట్టణ అధ్యక్షురాలు యాష్కీ శిరీష, వివిధ మండలాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, బిజెపి పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలి

**- ఇతర రాష్ట్రాల పత్తిని తీసుకురాకుండా చెక్ పోస్ట్ ల వద్ద పటిష్ట నిఘా ఉండాలి**

**- కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర బ్యూరో) : పత్తి పంటను పండించిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పత్తి కొనుగోలు కేంద్రాల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. గద్వాలలో రెండు, ఆలంపూర్ నియోజకవర్గంలో ఒక పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినప్పటికీ రైతులు ఎంతో కష్టపడి తమ పంటలను పండిస్తున్నారని, వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. క్వింటాల్ పత్తికి ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.8667 గా పేర్కొన్నారు. ఆయా మిల్లుల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద తూకాల్లో ఎలాంటి మోసాలకు ఆస్కారం లేకుండా తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేయాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఆయా మిల్లులలో ఫైర్ సేఫ్టీ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. రైతులు తాము పండించిన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు ఎలాంటి అవాంతరాలు ఎదురవకుండా రవాణా, పోలీస్, విద్యుత్, తదితర శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడి కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకురాకుండా చెక్ పోస్ట్ ల వద్ద పటిష్ట నిఘా ఉండాలన్నారు. సీసీఐ ప్రతినిధులు పత్తి తేమ, ధర, తూకాలు, తదితర అన్ని విషయాల్లో పర్యవేక్షణ చేయాలని, అవకతవకలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శంకర్, డీఏవో వీరప్ప, మార్కెటింగ్ జిల్లా అధికారిని పుష్పమ్మ, ఆర్టీవో రాధిక, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అశోక్, సిసిఐ ప్రతినిధులు అనీషా, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

## దసరా సెలవుల్లో ప్రైవేట్ పాఠశాలలు నిర్వహించరాదు

**ప్రభుత్వ నిబంధనలను ప్రతి ప్రైవేట్ పాఠశాల తప్పనిసరిగా పాటించాలి : ఎంఈఓ బి. రాములు**



అయిజ అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాధికారి బి. రాములు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బి. రాములు మాట్లాడుతూ, దసరా సెలవుల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలలను నిర్వహించరాదని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలు, విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘించి సెలవుల్లో పాఠశాలలు నిర్వహించే యాజమాన్యాలపై ఉన్నతాధికారులకు నివేదించి, నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా సిఫారసు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా దసరా సెలవులను సద్వినియోగం చేసుకుని పాఠశాలలకు సంబంధించిన పెండింగ్ పనులు, విద్యార్థుల వివరాల నవీకరణ తదితర అంశాలను పూర్తి చేసి, జిల్లాలో అయిజ మండలాన్ని ముందంజలో నిలిపేందుకు ప్రతి పాఠశాల యాజమాన్యం సహకరించాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ నిబంధనలను ప్రతి ప్రైవేట్ పాఠశాల తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ సూచించారు. ఈ సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎఉంఐఎస్.కోఆర్డినేటర్ ఆర్. ఉదయ్ కిరణ్, సిఆర్పీ. తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**- కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం**

**- సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయిన వెంటనే 1930కు ఫోన్ చేయాలి: పోలీస్ కమిషనర్ వెల్లడి**

నిజామాబాద్ అక్టోబర్07:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలు, ముఖ్యంగా విద్యార్థినులు అప్రమత్తంగా ఉండేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యతిథులు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ. పి. యస్. పాల్గొని విద్యార్థినులకు సైబర్ నేరాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా రోజురోజుకూ కొత్త రూపాల్లో జరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా అనేక మోసాలను నివారించవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ప్రజల అత్యాశ , భయం , అత్యవసర పరిస్థితులు , ఉద్యోగాల అవసరం వంటి అంశాలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ప్రధానంగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ , డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ , సోషల్ మీడియా ఫేక్ ప్రొఫైల్ ఫ్రాడ్ , డీప్‌ఫేక్ ఫ్రాడ్ , పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్ , లోన్ ఫ్రాడ్ , ఆన్‌లైన్ షాపింగ్ ఫ్రాడ్ తదితర సైబర్ మోసాల తీరును విద్యార్థినులకు వివరించారు. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ విషయంలోలి అధిక లాభాలు వస్తాయని



నమ్మించి నకిలీ యాప్‌లు , వాట్సాప్/టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా పెట్టుబడులు పెట్టించి భారీ మొత్తంలో డబ్బులు దోచుకుంటున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే పెట్టుబడి లింకులు, యాప్‌లను నమ్మవద్దని సూచించారు. డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ లోలి పోలీస్ , సిబిఐ , ఏది , కస్టమ్స్ తదితర ప్రభుత్వ సంస్థల అధికారులుగా నకిలీ వీడియో కాల్స్ చేసి కేసుల్లో ఇరుక్కున్నారని భయపెట్టి డబ్బులు బదిలీ చేయించుకుంటారని తెలిపారు. ఏ ప్రభుత్వ సంస్థ కూడా వీడియో కాల్ ద్వారా 'డిజిటల్ అరెస్ట్' చేసి డబ్బులు చెల్లించాలని ఆదేశించదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ఫేక్ ప్రొఫైల్ , డీప్‌ఫేక్ మోసాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తుల ఫోటోలు , వీడియోలు , పేర్లను దుర్వినియోగం చేసి నకిలీ ఖాతాలు సృష్టించడం , AI సాంకేతికతను ఉపయోగించి మార్ఫింగ్ / డీప్‌ఫేక్ వీడియోలు రూపొందించడం ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. పార్ట్‌టైమ్ జాబ్ , లోన్ , ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో జరిగే మోసాల పట్ల కూడా జాగ్రత్త వహించాలని తెలిపారు. తెలియని వ్యక్తులకు ఞూలు , PINలు , CVVలు , పాస్‌వర్డ్‌లు , బ్యాంక్ వివరాలు , వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు.

డబ్బులు పోయిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో 1930కు సమాచారం ఇవ్వాలి

సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయినట్లయితే బాధితులు భయపడకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే స్పందించే సమయం అత్యంత కీలకమని , ప్రారంభ దశలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా https://cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా సైబర్ నేరంపై ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సైబర్ నేరం జరిగినప్పుడు ఆలస్యం చేయకుండా బ్యాంకు/సంబంధిత ఆర్థిక సంస్థలకు కూడా సమాచారం అందించాలని తెలిపారు. విద్యార్థినులు తాము సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించడంతో పాటు , తమ కుటుంబ సభ్యులు , స్నేహితులు మరియు పరిచయస్తులకు కూడా సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు , సురక్షితమైన డిజిటల్ వినియోగం, వ్యక్తిగత సమాచార రక్షణ , ఆన్‌లైన్ లావాదేవీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ సంబంధించినటువంటి వాల్ పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసిపి ప్రకాష్ యాదవ్ కాకతీయ ఇన్స్టిట్యూట్స్ ఐఱఅతీవష్శీతీ రజనీకాంత్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ సైబర్ క్రైమ్ సిఐ శ్రీముఖి పాష మాక్లూర్ ఎస్సై అనిల్ రెడ్డి మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది

# ఈవీఎం గోదాముకు కట్టుదిట్టమైన భద్రత

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : జిల్లా కేంద్రంలో ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం వెనుక ఉన్న ఈవీఎం గోదామును నెలవారీ తనిఖీల్లో భాగంగా ఆయన పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాము వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ పనితీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు.?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం ఎప్పటికప్పుడు ఈవీఎం గోదామును తనిఖీ చేసి, ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక సమర్పిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే బుధవారం నెలవారీ పరిధిలో తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్ రెడ్డితో పాటు పలువురు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పెన్షన్ల వెరిఫికేషన్ పకడ్బందీగా చేపట్టాలి

**- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి**

**- జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



?వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : పెన్షన్ లబ్ధిదారుల వివరాల పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శ్రీరంగాపూర్ మండలం కంబాలాపూర్ గ్రామంలో కొనసాగుతున్న పెన్షన్ వెరిఫికేషన్ ప్రక్రియను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) ఉమా మహేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ?ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారుల దరఖాస్తులు, నమోదు వివరాలు, వెరిఫికేషన్ సాగుతున్న తీరుపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. లబ్ధిదారుల పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అర్హత కలిగిన వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

ఉపాధి పనుల్లో నాణ్యత ముఖ్యం : అనంతరం శ్రీరంగాపూర్ గ్రామంలో చెరువు ఇన్‌లెట్, అవుట్‌లెట్ కాలువల వద్ద వీబీజీ రామ్జీ పథకం కింద కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న కూలీలతో నేరుగా మాట్లాడి, వారికి ఎదురవుతున్న సమస్యలు, పని వేళల గురించి అడిగి తెలుసుకున్నారు. ?ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, పని ప్రదేశంలో తాగునీరు, నీడ వంటి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను విధిగా పాటించాలని, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు, ఉపాధి పనుల అమలుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏపీఓతో పాటు పలువురు మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

***జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి దీపా కాసరగడ్డ***




వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : పేదలు, బాధితులకు చట్టపరంగా లభించే ఉచిత న్యాయ సహాయాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి దీపా కాసరగడ్డ పిలుపునిచ్చారు. శ్రీరంగాపురం మండలంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసుల పరిష్కారానికి 'రాజీ మార్గమే రాజమార్గం' అని పేర్కొంటూ, ఇరు వర్గాల వారు పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకూడదని స్పష్టం చేశారు. 6 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఉచిత విద్యా హక్కు చట్టం ద్వారా విద్యను పొందవచ్చని తెలిపారు. ?వయోవృద్ధులైన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం చట్టరీత్యా నేరమని జడ్జి హెచ్చరించారు.తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం ద్వారా వారి సమస్యల పరిష్కారానికి జిల్లా రెవిన్యూ అభివృద్ధి కార్యాలయంలోని ట్రిబ్యునల్స్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. లేదా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తును అందించినా సమస్య పరిష్కారానికి తగిన కృషి చేస్తామని భరోసానిచ్చారు. ?ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెలర్ కృష్ణయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ హిమబిందు, సర్పంచ్ మద్దిలేటి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పారా లీగల్ వాలంటీర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు రీ-సర్వేతోనే శాశ్వత పరిష్కారం

**- పారదర్శకంగా, పకడ్బందీగా కొలతలు పూర్తి చేయాలి**

**- రైతుల సమక్షంలోనే సరిహద్దుల గుర్తింపు**

**- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్**



వనపర్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : భూ వివాదాలకు తావులేకుండా శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీ-సర్వే ప్రక్రియను అధికారులు పకడ్బందీగా, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం పాన్గల్ మండలంలోని బండపల్లి, జమ్మాపూర్ గ్రామాలు, వీపనగండ్ల మండలంలోని కోర్లకుంట గ్రామాల్లో కొనసాగుతున్న రీ-సర్వే పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో సర్వే పురోగతి, సరిహద్దుల గుర్తింపు, రికార్డుల నిర్వహణను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీ-సర్వేలో అత్యంత కీలకమైన కో-రిలేషన్ రిజిస్టర్‌ను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. పనులు ప్రారంభించే ముందే భూ యజమానులు, రైతులకు సమాచారం అందిస్తూ ముందస్తు నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. కొలతల ప్రక్రియను రైతుల సమక్షంలోనే పూర్తి చేసి, సరిహద్దులను స్పష్టంగా గుర్తించాలన్నారు. సర్వే రాళ్లను సులభంగా గుర్తించేందుకు వీలుగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాటికి రంగులు (కలరింగ్) వేయాలని ఆదేశించారు. ?భూ రీ-సర్వే లక్ష్యాలు, దీనిద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాలపై గ్రామస్థులకు పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. రైతులకు ఎలాంటి సందేహాలు, ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ పర్యటనలో పాంగల్ తహసీల్దార్ కార్తీక్ రావు, వీపనగండ్ల డిప్యూటీ తహసీల్దార్ శివ, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# కేఎల్ఐ పంపులు నడిపి పంటలను కాపాడాలి

**- ఈ నెల 12లోగా నార్లాపూర్ పంపులు ప్రారంభించకపోతే ముట్టడి**

**- ఆక్రమణల ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధం**

**- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సవాల్**




వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు కేఎల్ఐ పంపులను నిర్విరామంగా నడిపించి, జూరాల నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం (12వ తేదీ) లోగా నార్లాపూర్ పంపులను ప్రారంభించి నీటిని విడుదల చేయకపోతే వేలాది మంది రైతులతో కలిసి ముట్టడి చేపడతామని హెచ్చరించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై, తనపై వస్తున్న ఆరోపణలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

***పంటలు ఎండిపోతున్నా పట్టవా***

జిల్లాలో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రభుత్వ అలసత్వం, నిర్వహణ లోపం వల్ల 6 నుంచి 7 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేఎల్ఐలో 70 టీఎంసీల నీరున్నా, సరైన విద్యుత్ సరఫరా లేక మోటార్లు కాలిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి నెపంతో సాగునీటిని నిలిపివేయడం సరికాదని, వెంటనే 3 పంపులను నడిపి చెరువులు, వాగులను నింపాలని కోరారు. కరెంట్, యూరియా, రుణమాఫీ, రైతు భరోసా అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

***ఆక్రమణలు రుజువైతే ముక్కు నేలకు రాస్తా***

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న తనపై ప్రభుత్వం వ్యక్తిగత కక్షసాధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. పానగల్‌లోని తన వ్యవసాయ క్షేత్రం కష్టార్జితమని, అందులో భూ ఆక్రమణలు జరిగాయంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. "మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావులు వారి కలెక్టర్లు, రాష్ట్ర మీడియాతో కలిసి నా క్షేత్రానికి రావచ్చు. అక్కడే టెంట్లు వేసి భోజనం కూడా పెడతా. బహిరంగ చర్చకు నేను సిద్ధం. అరగుంట భూమి అయినా ఆక్రమించినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెబుతా" అని సవాల్ విసిరారు. నిరాధార ఆరోపణలు చేస్తే చట్టపరంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ?ఈ సమావేశంలో నాయకులు గట్టు యాదవ్, బి.లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, లక్ష్మారెడ్డి, నందిమల్ల అశోక్, కృష్ణా నాయక్, మాణిక్యం, వనం రాములు, రాళ్ళ కృష్ణయ్య, గంధం పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానేశ్వర్ కాదు..

# అజ్ఞానేశ్వర్!

**- ఓట్ల తొలగింపు కుట్రపై కదం తొక్కిన 'ఇండియా' కూటమి, అఖిలపక్షాలు**

**- సీఈసీని పదవి నుంచి తొలగించి, తక్షణమే అరెస్టు చేయాలి**

**- కలెక్టర్ ఆదర్శ సురభికి వినతిపత్రం అందజేత**




వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : ప్రజాస్వామ్యానికి పునాది అయిన వయోజన ఓటు హక్కును కాలరాస్తూ, అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించేందుకు పెద్దఎత్తున కుట్ర జరుగుతోందని డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆరోపించారు. భాజపాకు ఓటు వేయని పౌరులను లక్ష్యంగా చేసుకుని 'ఫామ్-6' పేరుతో ఓట్లను తొలగిస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఓట్ల అక్రమ తొలగింపును నిరసిస్తూ బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఇండియా' కూటమి, అఖిలపక్ష పార్టీల నేతలు బృందంగా ఏర్పడి భారీ నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ?స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సేకరించిన నేతలు, సీఈసీ జ్ఞానేశ్వర్‌కుమార్‌తో పాటు భాజపా నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'భాజపా హటావో.. దేశ్ బచావో' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

***45 వేల ఓట్ల తొలగింపునకు కుట్ర..***

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఉన్న సుమారు 2.75 లక్షల ఓట్లలో దాదాపు 45 వేల ఓట్లను అక్రమంగా తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఎన్నికల ప్రధాన అధికారిగా ఉన్న జ్ఞానేశ్వర్‌కుమార్ భాజపాకు ఓట్ల కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన జ్ఞానేశ్వరుడు కాదు.. అజ్ఞానేశ్వరుడు. రాజ్యాంగంలోని ఆర్టికల్-326 పౌరులకు కల్పించిన ఓటు హక్కును తొలగించే అధికారం ఎవరిచ్చారు?" అని నిలదీశారు. సుప్రీంకోర్టు కూడా ఇటీవల సీఈసీ తీరుపై చేసిన వ్యాఖ్యలను దేశ ప్రజలంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు.

?కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని, ప్రజా సమస్యలపై ప్రశ్నించిన ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని అక్రమంగా అరెస్టు చేయించారని విమర్శించారు. ఇటువంటి అక్రమ అరెస్టులకు కాంగ్రెస్ భయపడదని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ, లౌకిక విలువల కాపాడటమే లక్ష్యంగా 'ఇండియా' కూటమి పోరాడుతోందని, తొలగించిన ప్రతీ ఓటును తిరిగి పునరుద్ధరించే వరకు తమ ఉద్యమం ఆగదని హెచ్చరించారు.

***కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్న నేతలు***

ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి జయరాములు, తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ బాషా, సీపీఎంఎల్ జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, సీపీఎం కార్యవర్గ సభ్యులు జబ్బార్, సీపీఐ నేత రమేష్, ఎంఐఎం, సమాజ్‌వాదీ పార్టీ నాయకులతో పాటు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, మాజీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, కౌన్సిలర్లు ధనలక్ష్మి, విజయలక్ష్మి, ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాల్యానాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆదిత్య, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అయూబ్ ఖాన్, నాయకులు లక్కాకుల సతీష్, ఎండీ బాబా, శివకుమార్ నాయుడు, పాండు సాగర్, అరవింద్ నాయక్ మరియు వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలి

***రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా***




మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) జిల్లాలో చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ లతో కలిసి ఎ.ఈ.ఆర్.ఓ.లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్-2026 లో భాగంగా జిల్లాలో మ్యాపింగ్ కాని, అనమోలీస్ ఓటర్ల సంబంధిత నోటీసులను పూర్తిగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 3 ఈ.ఆర్.ఓ.లు, 18 ఎ.ఈ.ఆర్.ఓ.లు, అదనంగా కేటాయించబడిన 18 ఎ.ఈ.ఆర్.ఓ.లు ఎస్ ఐ ఆర్ సంబంధిత క్లెయిమ్స్ ఌ అబ్జెక్షన్ ప్రక్రియపై పని చేస్తున్నారని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని, నోటీసులు జారీ అయిన ప్రతి ఒక్కరు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించేలా వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘంచే జారీ చేయబడిన 11 డాక్యుమెంట్లలో నుంచి మాత్రమే సంబంధిత ఓటర్లు డాక్యుమెంట్లు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్ణీత సమయంలోగా క్లెయిమ్స్ ఌ అబ్జెక్షన్ ప్రక్రియను పూర్తి చేయాలని, అవసరం మేరకు కుల ధ్రువీకరణ పత్రాలు నిబంధనలు మేరకు అందజేయడం జరిగిందని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఫారం 7 ద్వారా అందిన దరఖాస్తులను మరణ ధ్రువీకరణ పత్రం పరిశీలన, సంబంధిత కుటుంబ సభ్యుల ఆమోదం ద్వారా తీసి వేయాలని, అర్హత కలిగిన ఏ ఒక్కరూ కూడా ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లకు అవసరమైన సమాచారాన్ని బూత్ స్థాయి అధికారుల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారి, మంచిర్యాల రాజస్వ మండల అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లతో కలిసి ఎ ఈ ఆర్ ఓ లు, అదనపు ఎ ఈ ఆర్ ఓ లతో ఎస్ ఐ ఆర్- 2026 ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులు ఫారం 7 దరఖాస్తుల పరిశీలన విషయంలో రిజిస్టర్ నిర్వహించి సంబంధిత పూర్తి వివరాలు రిజిస్టర్ లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కమ్యూనిటీ సర్టిఫికెట్ నిబంధనలను అనుసరించి త్వరితగతిన జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి వివరాలు తెలియజేయాలని తెలిపారు.అంతకుముందు జిల్లాకు చేరుకున్న విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తో కలిసి జైపూర్ మండలం ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 111, 112 పోలింగ్ కేంద్రాలను సందర్శించి సంబంధిత బూత్ స్థాయి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు, ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**- ఎస్పీ డి. సునీత రెడ్డి**

**- జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేసిన పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు**




వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 7 (విజన్ ఆంధ్ర) : పోలీసు సిబ్బంది సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని వనపర్తి జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతనంగా ఎన్నుకోబడిన జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్పీ చాంబర్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం సమర్పించారు.?ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు పోలీసు సిబ్బందికి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు, సరెండర్ లీవ్ బిల్లులు, ప్రయాణ భత్యాలు (టీఏలు) త్వరగా విడుదలయ్యేలా చూడాలని కోరారు. అలాగే ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సవివరంగా వివరించారు.?అనంతరం ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ... పెండింగ్ బకాయిలు త్వరలోనే విడుదలయ్యేలా, ఈహెచ్‌ఎస్ హెల్త్ స్కీమ్ సమస్యలు పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎస్పీ స్పందనపై పోలీస్ అసోసియేషన్ నాయకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ?ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు గోవిందు, ఉపాధ్యక్షులు ఆర్ఐ అప్పలనాయుడు, నాగరాజుతో పాటు కార్యదర్శులు, అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గంలో ములుగుకు చోటు - గాదం మాధవికి అవకాశం.



ములుగు అక్టోబరు 07, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నేత గాదం మాధవి-కుమార్ కు రాష్ట్ర స్థాయిలో పదవి దక్కింది. ఆమెను బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఉత్తర్వులు జారీ చేశారు. గత 12 సంవత్సరాలుగా బీజేపీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్న మాధవి గతంలో ములుగు మేజర్ గ్రామపంచాయతీ 9వ వార్డు సభ్యురాలిగా గెలుపొందారు. ఉన్నత చదువులు చదివిన ఆమె సామాజిక సేవ, ప్రజా సమస్యలపై పోరాటంలో ముందుంటున్నారు. ఇటీవల ములుగు మున్సిపాలిటీ 3వ వార్డు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. తన సేవలను గుర్తించి పదవి ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం, జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు మాధవి-కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# మేడారం ఆదివాసీ మ్యూజియాన్ని సందర్శించిన ఐ ఐ ఎఫ్ ఎం భోపాల్ బృందం

**- ఏర్పాట్లు చేసిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో**




ములుగు అక్టోబరు 07, విజన్ ఆంధ్ర ప్రతినిధి: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, అటవీ ఆధారిత జీవనోపాధి అంశాలపై క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్మెంట్ (ఐఐఎఫ్ఎం,) భోపాల్ కు చెందిన ప్రొఫెసర్ శరదిందు పాండే బృందం మేడారంలోని శ్రీ సమ్మక్క-సారలమ్మ ఆదివాసీ మ్యూజియాన్ని సందర్శించింది. ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోలి సూచనల మేరకు ఐఐఎఫ్ఎం బృందం మేడారం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. మ్యూజియంలో గిరిజనుల సంప్రదాయ జీవన విధానం, సంస్కృతి, కళలు, ఆచారాలు, అటవీ ఆధారిత జీవనోపాధికి సంబంధించిన ప్రదర్శనలను బృందం నిశితంగా పరిశీలించింది. మ్యూజియంలో ప్రదర్శిస్తున్న గిరిజన సంప్రదాయ వస్తువులు, కళాకృతులు, తెలంగాణ గిరిజన ప్రాంతాల ప్రత్యేకతలు, సంస్కృతి పరిరక్షణకు చేపడుతున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా గిరిజనుల అభివృద్ధి, అటవీ ఉత్పత్తుల సేకరణ, విలువ జోడింపు, ఎకో టూరిజం, గిరిజన సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నారు. ఈ పర్యటన ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అనుభవాలను పరస్పరం పంచుకునే అవకాశం ఏర్పడింది.

# ములుగు మున్సిపాలిటీలో దోపిడీ బాగోతం బట్టబయలు .

**- కమిషనర్ కు చుక్కలు చూపించిన కౌన్సిలర్లు!**



ములుగు అక్టోబరు 07, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నేడు యుద్ధభూమిని తలపించింది. కమిషనర్ అక్రమాలపై కౌన్సిలర్లు గళమెత్తడంతో సభ రసాభాసగా మారి మధ్యలోనే ముగిసింది.

***లక్ష దాటితే టెండర్ – మరి 11 లక్షల మాటేంటి?***

మున్సిపల్ చట్టం ప్రకారం లక్ష రూపాయలు దాటిన ఏ పనికైనా టెండర్ పిలవాలి. కానీ ములుగు కమిషనర్ చట్టాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని, ఎవరికీ తెలియకుండా నర్సంపేట విశ్వం సౌండ్ కు 11 లక్షల పనిని నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు. ఇది బహిరంగ దోపిడీ కాదా అని కౌన్సిలర్లు నిలదీశారు.

***సద్దుల బతుకమ్మ పేరుతో స్వాహా?***

6 లక్షలతో ముగిసే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు 11 లక్షలు చూపించడం వెనుక భారీ కమీషన్ల బాగోతం ఉందని ఆరోపణ. దసరా ఉత్సవాలకు రెండు నెలల ముందే తీర్మానం చేయాల్సి ఉండగా, సెప్టెంబర్ సమావేశాన్ని ఎందుకు దాటవేశారని ప్రశ్నించారు. కొందరికి భయపడి కమిషనర్ ఒంటెద్దు పోకడలతో పరిపాలనను భ్రష్టు పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు.

***అభివృద్ధికి నిధులు లేవు – దోపిడీకి ఉన్నాయా?***

కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు, మిషన్ భగీరథ పైపులు లీకేజీలతో రోడ్లన్నీ చెరువులయ్యాయి, గల్లీల్లో మొరం లేదు, జేసీబీ రిపేర్ కు డబ్బు లేదు, చెత్త ట్రాక్టర్లకు డీజిల్ కూడా పోయలేని దీనస్థితిలో మున్సిపాలిటీ ఉందని, అలాంటప్పుడు 11 లక్షలు ఎక్కడి నుంచి వచ్చాయని కౌన్సిలర్లు ఎండగట్టారు. కౌన్సిలర్లు గోనెల భరత్, బైక సునీత-ఓదెలు, రేవోజు వేణుగోపాల్ చారి, పద్మ, గండ్రకోట వాణికుమార్, కోయిల లక్ష్మి, బైకాని అనూష-సాగర్ తీవ్ర వాగ్వాదానికి దిగి కమిషనర్ ను నిలదీయగా, కమిషనర్ కుంటిసాకులతో సమాధానం దాటవేశారు. దీంతో ఆగ్రహించిన కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించారు.

# ఈవీఎం భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

**- అధికారులకు కలెక్టర్ హేమంత్ ఆదేశం**



ములుగు అక్టోబరు 07, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఈవీఎం గోదాంలో భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలని, భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదాంను ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారీ తనిఖీ చేశారు. గోదాం ప్రధాన ద్వార సీల్‌ను పరిశీలించి, సీసీ కెమెరాలు, నిఘా వ్యవస్థ, విద్యుత్ సరఫరాను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిన్నముద్దునూరు సింగిల్ విండో కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్, ఫోటో జర్నలిస్ట్ : అక్టోబర్ 7(విజన్ ఆంధ్ర) తెలకపల్లి మండల పరిధిలోని చిన్న ముద్దునూరు గ్రామ సింగిల్ విండో కార్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆకస్మిక తనిఖీ చేశారు ఇటీవల కార్యాలయం వద్ద చేపట్టిన ప్యూర్ కోడ్ ప్రెస్ ఆయిల్స్ యూనిట్ ను తనిఖీ చేశారు నూనెల ఉత్పత్తులు తదితర అంశాలు ఆరా తీశారు సింగిల్విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ యూనిట్ లో వినియోగిస్తున్న ముడి సరుకు నాణ్యత ఆయిల్ తయారీ విధానం శుద్ధికరణ ప్యాకేజింగ్ మార్కెట్ అంశాల గురించి వివరించారు కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో రైతులకు లాభదాయకంగా, వినియోగదారులకు అన్ని రకాల నూనెలను శుద్ధికరించి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు డి సి ఓ రఘునాథరావు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబాటు

***బాణం గుర్తుపై ఓటేసి టి డబ్ల్యూయు -ఐఎన్టియుసి అభ్యర్థులను గెలిపించాలి: మంత్రి వివేక్ వెంకటస్వామి***



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) మంచిర్యాల ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. తెలంగాణ వర్కర్స్ యూనియన్ ఐఎన్టియుసి కలిసి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేపథ్యంలో కార్మికులు బాణం గుర్తుపై ఓటు వేసి టిడబ్ల్యూయు - ఐఎన్టియుసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు అభ్యర్థుల విజయానికి కాంగ్రెస్ శ్రేణులు అన్ని స్థాయిల్లో కృషి చేస్తున్నాయని మంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కాంగ్రెస్--ఐఎన్ టియుసి--టి డబ్ల్యూయూ కూటమికి కార్మికులు మద్దతు ఇచ్చి గెలిపిస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను తక్షణమే చేపడతాం అని మంత్రి వివేక్ వెంకటస్వామి మరోసారి భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను మంజూరు చేసి కార్మికులకు అందించామని ఆయన గుర్తుచేశారు. కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు భవిష్యత్తులోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుండి పనిచేస్తుందని తెలిపారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. మంచిర్యాల ప్రాంతంలోని ఆర్టీసీ కార్మికులు బాణం గుర్తుపై ఓటు వేసి టీ డబ్ల్యూయు--ఐ ఎన్టియుసి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వేణుగోపాల చారి కాంగ్రెస్ సీనియర్ నాయకులు జగన్మోహన్ రావు టిడబ్ల్యూయు ఐఎన్టియుసి నాయకులు పాల్గొన్నారు.

# బీసీ-ఏ కోసం కదం తొక్కిన ముదిరాజులు

**- బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చాలని డిమాండ్**

**- జిన్నారం తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ**

**- ఆర్ఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించిన ముదిరాజ్ నాయకులు**

జిన్నారం/ అక్టోబర్07 (విజన్ ఆంధ్ర న్యూస్)లి సంగారెడ్డి జిల్లా. పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మండల ముదిరాజులు కదం తొక్కారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘాల నాయకులు, ప్రతినిధులు భారీగా తరలివచ్చి జిన్నారంలో ర్యాలీ నిర్వహించారు.

***హక్కుల సాధన కోసం భారీ ప్రదర్శన:***

జిన్నారం మండలంలోని అన్ని గ్రామాల ముదిరాజ్ సంఘాల నాయకులు, సభ్యులు ఒకచోట చేరి బీసీ-ఏ డిమాండ్‌పై నినదించారు. భారీ ర్యాలీగా జిన్నారం తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి చేర్చి తగిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

***అధికారులకు వినతిపత్రం:***

ర్యాలీ అనంతరం ముదిరాజ్ నాయకులు జిన్నారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ముదిరాజుల ప్రధాన డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కోరారు.



***ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం:***

ముదిరాజ్ నాయకులు సమర్పించిన వినతిపత్రంపై ఆర్ఐ శ్రీనివాస్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ముదిరాజుల డిమాండ్‌పై సంబంధిత అధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

***నాయకుల పాల్గొన్నారు.***

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ-ఏ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గుండ్లపల్లి శ్రీనివాస్, బాలు గారి నర్సింలు, ముదిరాజ్ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అడ్వైజర్ రవి, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గంగు రమేష్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ పోరాట సమితి మండల అధ్యక్షుడు సుంకరబోయిన మహేష్, నరసింగరావు, మల్లేష్, వీర్నాల సత్యనారాయణ, మాణిక్యం, బాల్రాజ్, వెంకటేష్ వివిధ గ్రామాల ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

**- సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు**

**- అనుమానాస్పద లింకులు, సందేశాలకు స్పందించవద్దు..**

**- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలి**

**- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**




మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయడం ద్వారా సైబర్ నేరగాళ్లు వాటిని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 2026ను జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసంగా నిర్వహిస్తున్న సందర్భంగా, తెలంగాణ సైబర్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాస్ ఫర్ సేఫ్టీ-పాస్, థింక్, వెరిఫై. అనే నినాదంతో ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగ్రూకత దివస్లో భాగంగా బుధవారం మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక మాధ్యమాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్, మంచిర్యాల పట్టణ పోలీసులు, రామగుండం సైబర్ క్రైమ్ పోలీసులు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో యువత సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారం, కుటుంబ వివరాలు, ఫొటోలు, ఆర్థిక వివరాలు వంటి సున్నితమైన సమాచారాన్ని బహిరంగంగా పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యక్తుల వివరాలను సేకరించి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు, తల్లిదండ్రులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. రైతుల నమోదు, యూరియా యాప్ డౌన్‌లోడ్ తదితర పేర్లతో ఎవరైనా ఫోన్ చేసి ఒకసారి ఉపయోగించే సంకేత సంఖ్య (ఓటిపి), బ్యాంకు వివరాలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని అడిగితే అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటిపి, పిన్, పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు లేదా అనువర్తనాల విషయంలో తొందరపడి స్పందించకుండా పాస్, థింక్ ,వెరిఫై. అనే విధానాన్ని పాటించాలని సూచించారు. తెలియని లింకులపై క్లిక్ చేయకుండా, అనుమానాస్పద అనువర్తనాలను డౌన్‌లోడ్ చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ నేరగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఆర్థిక మోసాలకు పాల్పడటమే కాకుండా ఇతర విధాలుగా కూడా ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే లేదా అనుమానాస్పద లావాదేవీ జరిగినట్లు గుర్తించిన వెంటనే జాతీయ సైబర్ నేరాల సహాయవాణి 1930కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసుల చర్యలతో పాటు ప్రజల అప్రమత్తత, సహకారం కూడా ఎంతో కీలకమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. విద్యార్థులు తాము సైబర్ భద్రతా జాగ్రత్తలు పాటించడంతో పాటు, తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసం కార్యక్రమాల్లో భాగంగా పాస్ ఫర్ సేఫ్టీ పాస్ థింక్ వెరిఫై అనే నినాదంతో రూపొందించిన సైబర్ భద్రత అవగాహన పోస్టర్‌ను పోలీసు అధికారులతో కలిసి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ డి. వి రంగారెడ్డి, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు, రామగుండం సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ 25 సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా సేవా సంకల్ప అభియాన్ సేవ జ్యోతి యాత్ర



మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు ప్రభుత్వ అధినేతగా 25 సంవత్సరాల (రెండున్నర దశాబ్దాల) నిరంతర ప్రజాసేవ పూర్తి చేసుకున్న సందర్భంగా "సేవా సంకల్ప అభియాన్" మరియు సేవా జ్యోతి కార్యక్రమంలో భాగంగా ఈరోజు బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలో ఎల్ ఈ డి స్క్రీన్ ఏర్పాటు చేసి నరేంద్ర మోడీ లైవ్ స్పీచ్ వీక్షించిన అనంతరం విశిష్ట అతిథి వాలీబాల్ లో జాతీయస్థాయి కాంస్య పథకం సాధించిన రామ్మోహన్ ముఖ్య అతిథి బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్ రెడ్డి మరియు జిల్లా ఇంచార్జి కన్నెబోయిన ఓదెలు రైల్వే స్టేషన్ నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు కాగడ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మరియు ముఖ్య అతిథి జిల్లా ఇన్చార్జి మాట్లాడుతూ. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీ , ఆ తర్వాత మూడుసార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 2014 నుండి వరుసగా దేశ ప్రధానమంత్రిగా దేశానికి సేవలు అందిస్తూ వస్తున్నారు. మోడీ తన 25 ఏళ్ల ప్రయాణం ప్రజల నమ్మకంతోనే సాధ్యమైందని కొనియాడారు. కోట్ల మంది భారతీయుల విశ్వాసమే మోదీ బలం అని పేర్కొన్నారు. ఏ విధమైన రాజకీయ నేపథ్యం, కుటుంబ వారసత్వం లేకుండా కేవలం అంకితభావం, కష్టపడే తత్వంతో అంచెలంచెలుగా ఎదిగి దేశాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి ఒక రోల్ మోడల్ అని అన్నారు. ?ఈ సేవా సంకల్ప వేడుకలు కేవలం గత విజయాలను గుర్తుచేసుకోవడమే కాకుండా, రాబోయే కాలంలో దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపించడానికి, ప్రజలకు మరింత చేరువ కావడానికి ఒక నూతన ఉత్సాహాన్ని ఇస్తున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సంకల్పయాన్ జిల్లా కన్వీనర్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పట్టి వెంకటకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎనగందుల కృష్ణమూర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం, అశోక్, బీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల ముఖేష్ గౌడ్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తుల ఆంజనేయులు, కిసాన్ రాష్ట్ర కార్యదర్శి రమణా రావు, ఉపాధ్యక్షులు కోడి రమేష్, కమలాకర్ రావు, సేవ సంకల్ప్ అభియాన్ కో కన్వీనర్లు మోటపలుకుల తిరుపతి, కస్తూరి నాగరాజు, జిల్లా కార్యదర్శులు వైద్య శ్రీదర్, రాచర్ల సంతోష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బియ్యాల సతీష్ రావు, సుధీర్ గౌడ్, కార్పొరేటర్లు బోట్ల అనిత సత్యం, జోనల్ అధ్యక్షులు మోర్చా అధ్యక్షులు, బీసీ మోర్చా అధ్యక్షులు ఆకుల అశోక్ వర్ధన్, గిరిజన మోర్చా అధ్యక్షులు ప్రేమ్ సింగ్, సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్



నిజామాబాద్, అక్టోబర్ 07 :(విజన్ ఆంధ్ర )జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి శంకర్, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# 28న" జర్నలిస్టుల"ఛలో ఢిల్లీ"

**- జంతర్ మంతర్ లో ఒక రోజు నిరసన**

హైదరాబాద్, అక్టోబర్ 07:ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం "జర్నలిస్టుల రక్షణ చట్టం" అమలు చేయాలనే డిమాండ్ తో ఈ నెల 28వ తేదీన "ఛలో ఢిల్లీ" కార్యక్రమం చేపడుతున్నట్లు ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఆ రోజు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వందలాది మంది జర్నలిస్టులతో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో ధర్నా జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివెళతారని తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలను అరికట్టి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయాలన్న ఐఎఫ్ డబ్ల్యూజే దీర్ఘకాలిక డిమాండ్ ను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. అదేవిధంగా సీనియర్ జర్నలిస్టుల కోసం జాతీయ పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలని, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాస్ లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీర్ఘ కాలిక ఈ డిమాండ్ల సాధనకై 28న తలపెట్టిన "ఛలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలి

**- మంత్రి వివేక్ వెంకటస్వామి**



మందమర్రి, అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇటీవల నస్పూర్ రహదారి ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కాగా మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులకు సంబంధించి సుమారు 15 కోట్ల రూపాయల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ బానోత్ రాజన్న, తహసిల్దార్ సతీష్, ఎంపీడీఓ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ పుట్టినరోజు వేడుక



మల్కాజిగిరి, అక్టోబర్ 7,(విజన్ ఆంధ్ర) : తన పుట్టిన రోజు సందర్భంగా మౌలాలి డివిజన్ మాజీ కార్పొరేటర్ సునీత చంద్రశేఖర్ యాదవ్ బుధవారం ఆనంద్ బాగ్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ లు చేసి, స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ తర్వాత తన గృహంలో కాలనీ మహిళలు పిల్లలతో కలిసి తన పుట్టినరోజు వేడుకను ఘనంగా జరుపుకున్నారు.

# మహిళా శక్తికి కొత్త వేదికలు

**- జిల్లాల వారీగా సిద్ధమైన 'ఇందిరా మహిళా శక్తి భవనాలు'**

**- మహిళల ఆర్థిక స్వావలంబనకు కీలక కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్న వేదికలు**




హైదరాబాద్: తెలంగాణలో మహిళా సాధికారతకు మరింత ఊతమిచ్చేలా 'ఇందిరా మహిళా శక్తి భవనాలు' రూపుదిద్దుకున్నాయి. రాష్ట్రంలోని జిల్లాల వారీగా నిర్మాణ పనులు పూర్తిచేసుకున్న ఈ భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. మహిళల ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబనకు ఇవి కేంద్రాలుగా నిలవనున్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ భవనాలను ఏర్పాటు చేస్తున్నారు. మహిళలకు అవసరమైన శిక్షణ, ఉపాధి అవకాశాలు, ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ తదితర సేవలను ఒకే వేదికపై అందించేలా వీటిని అభివృద్ధి చేస్తున్నారు. స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లేందుకు అవసరమైన అవకాశాలను కల్పించనున్నారు. మహిళలకు ఆర్థికంగా ఎదిగే అవకాశాలు కల్పించడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు తీసుకురావడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కూడా దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 'మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి' అనే లక్ష్యంతో, రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది. మహిళల ఆర్థిక సాధికారతకు మరింత ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణ అభివృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి





సంగారెడ్డి, డెస్క్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 7: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టి, ప్రమాద మరణాలను తగ్గించాలని రాష్ట్ర డీజీపీ సి వి ఆనంద్, రవాణా శాఖ కమిషనర్ డా. కె. ఇలంబరితి, సూచించారు. రోడ్డు భద్రతపై సుప్రీంకోర్టు కమిటీ సమీక్ష నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ, రవాణా శాఖ కమిషనర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రంగారెడ్డి, మేడ్చల్––మల్కాజిగిరి, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాల వారీగా సమగ్ర రోడ్డు భద్రతా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అమలు చఓయాలని సూచించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలు, బ్లాక్‌స్పాట్లను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాల అనంతరం తక్షణ వైద్య సేవలు అందేలా పోలీస్, ఆరోగ్య, 108 సేవల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, జిల్లా వారీగా చేపట్టిన చర్యలు, పురోగతి, తదుపరి కార్యాచరణతో కూడిన జిల్లా వారీ నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంగారెడ్డి కలెక్టరేట్ విసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్ పాండు, డి ఎం ఎం హెచ్ ఓ, ఆర్ అండ్ బి, ఎన్ హెచ్ ఎ ఐ, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విశేషంగా ఆకట్టుకున్న "స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్"



హైదరాబాద్ అక్టోబర్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : నారాయణ విద్యాసంస్థల కూకట్పల్లి జోన్ ఎజిఎం. వేణుగోపాల్, బీరంగూడ బ్రాంచ్ లో నిర్వహించిన "స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్" (ఎస్ .ఎల్ .సి ) కార్యక్రమం అందరి దృష్టిని విశేషంగా ఆకట్టుకుంది, ఆకర్షించింది. ఈ కార్యక్రమం లో పీపీ1, పీపీ2, 1 స్ట్ క్లాస్, 2 న్డ్ క్లాస్ తరగతుల విద్యార్థినీ విద్యార్థులు 2026 – 27 విద్యా సంవత్సరం మొదటి సెమిస్టర్ లో వారు నేర్చుకున్న పాఠ్యాంశాలను తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, రీడింగ్, రైటింగ్, ప్రాజెక్టులు వివిధ తరగతి కార్యకలాపాలను ప్రతిభతో దేర్యంగా తల్లిదండ్రులుకు చూపించారు. విద్యార్థుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకులను, అధ్యాపక సిబ్బందిని ప్రశంసించారు. తమ ప్రతిభను ధైర్యంగా విద్యార్థులు ప్రదర్శిస్తూ , భవిష్యత్తులో మరింత ఆత్మ విశ్వాసంతో బాధ్యతతో సృజనాత్మకశీగా ఎదగడానికి, ఒక మంచి దారిలో అడుగులు వేయడానికి ఇలాంటి 'స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్' ఎంతగానో దోహద పడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు 'విద్య' ఈ సందర్భంగా తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఆర్ అండ్ డి హెడ్స్ శర్వాణి, శ్రీవల్లి, కోఆర్డినేటర్స్ సల్మా బేగం, వనిత , వైస్ ప్రిన్సిపల్స్ శేషరత్నం, పవార్ ఋతుజ అలాగే అధ్యాపక బృందం, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇంటర్‌సిటీ స్మార్ట్‌బస్ ప్రయాణికులకు ఉచిత హైదరాబాద్ మెట్రో ప్రయాణం

**- ఎల్అండ్‌టీ మెట్రో రైల్‌తో భాగస్వామ్యం..**

**- బస్ ప్రయాణికులకు అదనపు ఛార్జీ లేకుండా మెట్రో సేవలు**



శేర్లింగంపల్లి । అక్టోబర్ 7 : విజన్ ఆంధ్ర : ఇంటర్‌సిటీ స్మార్ట్‌బస్ ప్రయాణికులకు అదనపు ఛార్జీ లేకుండా హైదరాబాద్ మెట్రోలో ప్రయాణించే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఇంటర్‌సిటీ స్మార్ట్‌బస్ సంస్థ, ఎల్అండ్‌టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుని ఈ సదుపాయాన్ని ప్రకటించింది. హైదరాబాద్ నుంచి ప్రారంభమయ్యే లేదా హైదరాబాద్‌లో ముగిసే ఇంటర్‌సిటీ స్మార్ట్‌బస్ ప్రయాణికులు తమ బస్ ఎక్కే ప్రాంతానికి చేరుకోవడానికి లేదా నగరానికి చేరుకున్న అనంతరం తమ గమ్యస్థానానికి వెళ్లేందుకు హైదరాబాద్ మెట్రోను ఉచితంగా వినియోగించుకోవచ్చు. నగర ట్రాఫిక్‌లో బస్ బోర్డింగ్ పాయింట్‌కు చేరుకోవడంలో ప్రయాణికులు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని సంస్థ తెలిపింది.

*ఎలా పొందాలి? :* హైదరాబాద్ నుంచి ప్రారంభమయ్యే లేదా హైదరాబాద్‌లో ముగిసే ఏదైనా మార్గానికి ఇంటర్‌సిటీ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా స్మార్ట్‌బస్ టికెట్ బుక్ చేసుకోవాలి. అనంతరం మెట్రో స్టేషన్‌లో ఇంటర్‌సిటీ బుకింగ్ టికెట్‌ను చూపిస్తే మెట్రో ప్రయాణ టికెట్ అందజేస్తారు. ప్రయాణం రోజున ఆ మెట్రో టికెట్‌ను ఉపయోగించి స్మార్ట్‌బస్ బోర్డింగ్ పాయింట్లకు సేవలందించే లేదా సమీపంలోని మెట్రో స్టేషన్లలో ప్రయాణించవచ్చు. ఇంటర్‌సిటీ స్మార్ట్‌బస్ సీఈఓ మనీష్ రాఠీ మాట్లాడుతూ ప్రయాణికుల ప్రయాణం బస్ వద్ద ప్రారంభం కాదని, వారి ఇంటి వద్ద నుంచే ప్రారంభమవుతుందని అన్నారు. బస్ ఎక్కే ప్రదేశానికి చేరుకోవడం, అక్కడి నుంచి తిరిగి గమ్యస్థానానికి వెళ్లడం వంటి ప్రయాణంలో కీలకమైన దశను సులభతరం చేయడానికి హైదరాబాద్ మెట్రోతో ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని తెలిపారు. మెట్రో ప్రయాణాన్ని ఉచితంగా అందించడం ద్వారా ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా, అంచనా వేయగలిగేలా, ఖర్చుతో కూడుకున్నదిగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రజా రవాణాను ప్రోత్సహించడం ద్వారా నగరంలో పరిశుభ్రమైన, పర్యావరణహిత రవాణాకు కూడా ఈ కార్యక్రమం తోడ్పడుతుందని సంస్థ తెలిపింది. ఇంటర్‌సిటీ స్మార్ట్‌బస్ ప్రస్తుతం హైదరాబాద్‌ను బెంగళూరు, విజయవాడ, చెన్నై, విశాఖపట్నం, ముంబై, పుణె సహా 35కుపైగా నగరాలతో అనుసంధానిస్తూ 20కుపైగా మార్గాల్లో సేవలు అందిస్తోంది.

# రైతుల ఆదాయం పెంపునకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలి

***- వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు మార్కెటింగ్ - ఎగుమతులపై దృష్టి***

***- రైతు ఉత్పత్తిదారుల సంఘాలను 'పాలమూరు బ్రాండ్'గా తీర్చిదిద్దాలి***

మహబూబ్‌నగర్, అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర): వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తి ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల కార్యదర్శి కే. సురేంద్ర మోహన్ ఆదేశించారు. రైతు పండించిన పంటకు మద్దతు ధర, బోనస్‌తో పాటు మార్కెట్‌లో అదనపు ధర లభించేలా మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలపై పడుతున్న ప్రభావం, ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లు, రబీ ప్రణాళిక, పత్తి, జొన్న తదితర పంటల సాగు, కనీస మద్దతు ధర, ఫార్మర్ ఐడీ, ఆయిల్‌పామ్, మల్బరీ సాగు తదితర అంశాలపై సమీక్షించారు.

### 31 శాతం వర్షపాతం లోటు

జిల్లాలో సాధారణం కంటే 31 శాతం వర్షపాతం లోటు నమోదైందని, 11 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1.45 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగినట్లు తెలిపారు. గత ఖరీఫ్‌తో పోలిస్తే వరి సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. వర్షపాతం లోటు కారణంగా రైతులను ప్రత్యామ్నాయ తడి, ఉద్యాన పంటల సాగువైపు ప్రోత్సహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ తెలిపారు. సన్న రకం వరి ధాన్యంలో ప్రభుత్వం బోనస్ ప్రకటించిన ఏడు రకాల గుర్తింపునకు వ్యవసాయ డిప్లొమా, బీఎస్సీ అగ్రికల్చర్ అభ్యర్థులను అవసరమైన చోట నియమించుకోవాలని సురేంద్ర మోహన్ సూచించారు. తేలికపాటి నేలల కారణంగా జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పత్తి పంట దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

### ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

వరి నాట్లు ఆలస్యంగా, ఆగస్టు వరకు కూడా సాగు చేసినందున అక్టోబర్ చివరి నుంచి ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. దీంతో ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కార్యదర్శి ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో బ్యానర్లు ఏర్పాటు చేసి, ప్రభుత్వం బోనస్ ప్రకటించిన ఏడు సన్న రకం ధాన్యాల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. పత్తి, జొన్నలకు మార్కెట్‌లో కనీస మద్దతు ధర కంటే అధిక ధర లభిస్తున్నట్లు అధికారులు వివరించారు. రబీ సాగుకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధంగా ఉంచి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సురేంద్ర మోహన్ ఆదేశించారు.

### ఉద్యాన, ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం 656 ఎకరాల నుంచి 3,160 ఎకరాలకు పెరిగిందని జిల్లా ఉద్యాన అధికారి వేణుగోపాల్ తెలిపారు. వరి, పత్తి సాగు నుంచి ఉద్యాన పంటల వైపు మళ్లుతున్న రైతులు అధిక ఆదాయం పొందుతున్నారని వివరించారు. కూరగాయల సాగును కూడా మరింత ప్రోత్సహించాలని కార్యదర్శి సూచించారు. ఆయిల్‌పామ్‌తో పాటు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, బయో రిసోర్స్ సెంటర్లు చురుగ్గా పనిచేసేలా చూడాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం, భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. పంట మార్పిడి, సెరికల్చర్, హార్టికల్చర్ సాగును విస్తరించడంతో పాటు చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

### 'పాలమూరు బ్రాండ్'గా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు

హైదరాబాద్‌కు మహబూబ్‌నగర్ జిల్లా సమీపంలో ఉన్నందున ఇక్కడి వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయని సురేంద్ర మోహన్ అన్నారు. వ్యవసాయ, సహకార శాఖల పరిధిలోని 17 రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవోలు) ద్వారా ఉత్పత్తుల మార్కెటింగ్, ఎగుమతులకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. మహిళా



సంఘాలు 'బెనీషా' బ్రాండ్ ద్వారా వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్న తరహాలోనే రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి లిలి'పాలమూరు బ్రాండ్'లిలిగా అభివృద్ధి చేయాలని అన్నారు. రైతు ఉత్పత్తులకు సంబంధించి బయ్యర్స్, సెల్లర్స్ సమావేశాలు నిర్వహించి, హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలతో ఎఫ్‌పీవోలను అనుసంధానం చేయాలని సూచించారు. కంపెనీల ద్వారా సంఘాలకు శిక్షణ అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కొనుగోలు ప్రణాళికకు డీపీఆర్ రూపొందిస్తే ఎన్‌సీడీసీ ద్వారా రూ.2 కోట్ల వరకు రుణ సదుపాయం పొందే అవకాశం ఉందని తెలిపారు.

### ఫార్మర్ ఐడీ పూర్తి చేయాలి

రైతులు సబ్సిడీ పథకాలు, ఎరువులు తదితర ప్రయోజనాలు పొందేందుకు కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ ఐడీని తప్పనిసరి చేసినందున జిల్లాలో రైతుల ఫార్మర్ ఐడీల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో రైతును రక్షించుకోవడం ద్వారా మాత్రమే సమాజానికి మేలు జరుగుతుందని, రైతుల ఆదాయం పెంచేందుకు వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, సహకార తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సురేంద్ర మోహన్ సూచించారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జిల్లా వ్యవసాయ, ఉద్యాన, సహకార తదితర శాఖల కార్యకలాపాలపై వివరాలు వెల్లడించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్వో ఎ. నిర్మల, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా ఉద్యాన అధికారి వేణుగోపాల్, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# ఘనంగా 'డి. ఇ. షా ఇండియా' 30 ఏళ్ల విజయోత్సవ వేడుక

**- 2027 లో హైదరాబాద్ లో కొత్త కార్యాలయం ఏర్పాటు**

హైదరాబాద్, అక్టోబర్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : ప్రపంచస్థాయి పెట్టుబడి, సాంకేతిక అభివృద్ధి సంస్థ 'డి . ఇ . షా గ్రూప్' లో భాగమైన 'డి . ఇ . షా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' , భారతదేశంలో తన కార్యకలాపాలు ప్రారంభించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారాంనాడు వార్షికోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని నియోపోలిస్లో ఉన్న 'గ్రావా బిజినెస్ పార్క్' కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. 'డి . ఇ . షా ఇండియా' మొదటిగా 1996లో హైదరాబాద్ లో తన తొలి కార్యాలయాన్ని ప్రారంభించింది. అనంతరం 2023లో బెంగళూరు, గురుగ్రామ్లలో కార్యాలయాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ మూడు ప్రాంతాల్లోని బృందాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ సహచరులతో కలిసి పనిచేస్తూ, 'డి . ఇ . షా గ్రూప్' కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పరిశోధన, కార్యకలాపాల సామర్థ్యాలను అందిస్తున్నాయి. హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లో ఉన్న సంస్థ కార్యాలయంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించిన ఈ 30 వ వార్షికోత్సవ వేడుకల కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 'డి . ఇ . షా గ్రూప్' నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ ని ఉద్దేశించి మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, హైదరాబాద్ లో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న 'డి . ఇ. షా ఇండియా' కు అభినందనలు తెలుపుతూ, మూడు దశాబ్దాలుగా ఈ సంస్థ హైదరాబాద్ నగరంతో కలిసి తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోందన్నారు. హైదరాబాద్ తో సంస్థకు ఉన్న నిరంతర నమ్మకానికి ప్రతీకగా కొత్త కార్యాలయం స్థాపించాలని తన కార్యకలాపాలను మరింత విస్తరించాలన్నది గొప్ప నిబద్ధతకు నిదర్శనం అని అన్నారు. కార్యక్రమంలో ఎడి ఫిష్ మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు, 'డి . ఇ . షా



గ్రూప్', మాట్లాడుతూ, 30 ఏళ్లలో పెట్టుబడులు, సాంకేతికత రంగాలు గణనీయంగా మారాయన్నారు. ఈ మార్పులకు అనుగుణంగా సంస్థను ముందంజలో కొనసాగించడంలో 'డి . ఇ . షా ఇండియా 'లోని తమ సహచరులు ప్రదర్శిస్తున్న క్రమశిక్షణ, నైపుణ్యం కీలక పాత్ర పోషించాయి. హై–పర్ఫార్మెన్స్ కలిగిన డేటా, కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను నిర్మించడంతో పాటు, వినూత్న 'ఎఐ' సాధనాలు, ప్రపంచవ్యాప్తంగా కొత్త సమస్యలను పరిష్కరించేందుకు, తమ పని విధానాలను నిరంతరం మెరుగుపరచేందుకు ఉపయోగపడే అనేక ఇతర వ్యవస్థలను కూడా తాము అభివృద్ధి చేశామని తెలిపారు. 2027లో ప్రారంభం కానున్న అత్యాధునిక కార్యాలయం 6 లక్షల స్క్వేర్ ఫీట్ కు పైగా విస్తీర్ణంలో ఉండనుంన్నధి డి . ఇ . షా ఇండియా లోని డైనమిక్ వర్క్ కల్చర్కు మరింత బలం చేకూర్చడంతో పాటు, వివిధ బృందాలు కలిసి పనిచేయడానికి ఉద్యోగులకు మరిన్ని అవకాశాలను ఈ కొత్త కార్యాలయం అందించనుందని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్, 'డి . ఇ . షా ఇండియా' ఆపరేటింగ్ కమిటీ సభ్యుడు చైతన్య గొర్రెపాటి మాట్లాడుతూ, డి . ఇ . షా ఇండియా ప్రయాణం మొదలైంది హైదరాబాద్లోనే. 30 ఏళ్ల తర్వాత కూడా ఈ నగరమే తమ కథకు కేంద్ర బిందువు, అని అన్నారు. "గ్రావా బిజినెస్ పార్క్ లో తమ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఎదురుచూస్తున్నామని భారతదేశంలో మా వృద్ధిలో ఇది తదుపరి అధ్యాయానికి నాంది అని తెలిపారు.

## 48 పోగొట్టుకున్న ఫోన్లు యజమానులకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన మాదాపూర్ పోలీసులు



శేర్లింగంపల్లి । అక్టోబర్ 7 : (విజన్ ఆంధ్ర) : హైదరాబాద్, అక్టోబర్ 7: పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన 48 మొబైల్ ఫోన్లను మాదాపూర్ పోలీసులు గుర్తించి బుధవారం వాటి యజమానులకు అప్పగించారు. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖకు చెందిన కేంద్ర పరికర గుర్తింపు నమోదు (సీఈఐఆర్) పోర్టల్ సహాయంతో ఫోన్ల ప్రత్యేక గుర్తింపు సంఖ్యల ఆధారంగా వాటిని వివిధ ప్రాంతాల్లో గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి, ఫోన్ ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో పాటు బిల్లు, ఇతర వివరాలను అందించాలని సూచించారు. దీనివల్ల ఫోన్‌ను గుర్తించి తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

*ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఎలా తెలుసుకోవాలి?*

మొబైల్ ఫోన్‌లో లిచ06చ డయల్ చేయడం ద్వారా ప్రత్యేక గుర్తింపు సంఖ్యను తెలుసుకోవచ్చు. ఈ సంఖ్య ఫోన్ బాక్స్, కొనుగోలు బిల్లు లేదా రశీదుపై కూడా ఉంటుంది. కొనుగోలు చేసే సమయంలో నిషేధిత జాబితాలో ఉన్న లేదా నకిలీ గుర్తింపు సంఖ్య కలిగిన ఫోన్లను తీసుకోవద్దని పోలీసులు సూచించారు.

# మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి

**- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి**

**- కలెక్టర్ తో కలిసి ఎక్సైజ్ అధికారులతో సమీక్ష**



నిజామాబాద్, అక్టోబర్ 07 :( విజన్ ఆంధ్ర) మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా కొనసాగించాలని, అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో ప్రభుత్వ సలహాదారు సమీక్ష జరిపారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకుని, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇటీవలి కాలంలో పల్లెల్లో గుడుంబా, నాటుసారా విక్రయాలు మళ్ళీ మొదలైనట్లు తెలుస్తోందని, ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే ఇలాంటి మత్తు పదార్థాల నిరోధానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తూ వారి భవిష్యత్తును అంధకారంగా మారుస్తున్న గంజాయి విక్రయాలపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. ఎన్ ఫోర్సుమెంట్, ఎక్సైజ్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని, ఎక్కడ కూడా మత్తు పదార్థాల జాడ కానరాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా కల్తీకల్లు విక్రయాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడైనా కల్తీ కల్లు కారణంగా అవాంఛనీయ ఘటనలు జరిగితే, అందుకు ఎక్సైజ్ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగిస్తున్న అల్ప్రాజోలం, డైజోఫాం, క్లోరోఫాం ఎక్కడి నుండి వస్తుంది, సరఫరాదారులు ఎవరు అనే మూలాలను అన్వేషించి, సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను రవాణా చేసే వారిని, వాటిని విక్రయిస్తున్న వారిని, వాటిని వినియోగిస్తున్న వారిని పక్కాగా గుర్తిస్తూ నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. అవసరమైతే పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని, జిల్లాలో ఎక్కడ కూడా గంజాయి, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలం, గుడుంబా, నాటుసారా వంటివి ఉనికిలో లేకుండా జిల్లాను మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల దూరం లోపు సిగరెట్లు, గుట్కాలు వంటి విక్రయాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా రెవెన్యూ అధికారి గీత, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీధర్, సూపరింటెండెంట్ నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ కంజర్ భూ సమస్యలకు త్వరలో పరిష్కారం

**- చామన్‌పల్లిలో రీ-సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలి**

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ జిల్లా,అక్టోబర్ 07,(విజన్ ఆంధ్ర); లక్ష్మణచందా మండలం న్యూ కంజర్, చామన్‌పల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం పర్యటించి భూ సమస్యలు, రీ–సర్వే పనుల పురోగతిని పరిశీలించారు. ముందుగా న్యూ కంజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు, గ్రామస్తులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో భూముల పట్టాలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యల పరిష్కారంలో గ్రామస్తుల సహకారం కీలకమని పేర్కొన్నారు. భూ సమస్యలపై గ్రామసభలు నిర్వహించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి సమస్యను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భూముల పట్టాలకు సంబంధించి ఎవరికైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. గ్రామస్తుల సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా అధికారులు చొరవతో పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం చామన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ–సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ–సర్వే పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలి ఉన్న కమతాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన రీ–సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీ–సర్వేలో పూర్తి పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే బృందం సిబ్బంది పర్యవేక్షణలో, సంబంధిత భూ కమతాల రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో వనజ, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, లక్ష్మి, ఉప సర్పంచ్‌లు ముత్యం, గంగారెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## సామాజిక బహిష్కరణలపై రాష్ట్ర బీ.సీ కమిషన్ కు ఫిర్యాదులు

**- విజ్ఞాపనలు సమర్పించిన బాధితులు**



నిజామాబాద్, అక్టోబర్ 07 :( విజన్ ఆంధ్ర) సామాజిక బహిష్కరణ ఉదంతాలపై తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలో సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మిలతో కూడిన బృందం బుధవారం నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బాధితులతో భేటీ అయ్యింది. ఐ.డీ.ఓ.సీకి చేరుకున్న కమిషన్ ప్రతినిధులను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాంఘిక, కుల బహిష్కరణలకు గురైన బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కమిషన్ చైర్మన్, సభ్యులకు లిఖితపూర్వకంగా విజ్ఞాపనలు సమర్పించారు. బాధితులు నిర్భీతితో, స్వేచ్ఛగా వారి అభిప్రాయాలను వెల్లడించేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశారు. దీంతో జిల్లాలోని ఆయా ప్రాంతాలలో గ్రామాభివృద్ధి కమిటీల పేరిట కొనసాగుతున్న అరాచకాల గురించి, సామాజిక బహిష్కరణ ఘటనలను బాధితులు కమిషన్ కు ఏకరువు పెట్టారు. బీసీ కుల సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారు, ప్రజా సంఘాల ప్రతినిధులు సైతం హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్ కు అందిస్తూ, మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. సాంఘిక బహిష్కరణలపై ఫిర్యాదులు సమర్పించేందుకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

# మహిళల భద్రతకు పటిష్ఠ వ్యవస్థ!

- పని ప్రదేశంలో వేధింపులకు తావులేకుండా చర్యలు
- ఐసీసీ, పోష్ చట్టంపై ప్రతి మహిళా ఉద్యోగికి అవగాహన అవసరం
- సమస్యలు ఎదురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలి
- ఆధునిక టెక్నాలజీపై పట్టు సాధించాలి: ఎస్పీ రోహిత్ రాజు



కొత్తగూడెం బ్యూరో, అక్టోబర్ 08 (విజన్ ఆంధ్ర): పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది ఆత్మవిశ్వాసంతో, భద్రతతో విధులు నిర్వహించేలా అనుకూలమైన పని వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో మహిళల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ఐసీసీ), ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్మెంట్ (పోష్) చట్టం--2013పై ప్రతి మహిళా ఉద్యోగి పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం మహిళా పోలీసు అధికారులు, సిబ్బందికి ఐసీసీ, పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ మహిళా సిబ్బందికి విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులు, పని ప్రదేశంలో ఏవైనా అనుచిత సంఘటనలు చోటుచేసుకున్నా వాటిని భయపడకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**మహిళల హక్కుల పరిరక్షణకు ఐసీసీ**

మహిళలు ఒకవైపు కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ మరోవైపు పోలీస్ శాఖలో కీలకమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ విధుల్లో భాగంగా మహిళా సిబ్బంది వివిధ ప్రాంతాల్లో, విభిన్న పరిస్థితుల్లో పనిచేయాల్సి ఉంటుందని, అలాంటి సందర్భాల్లో వారికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు పోష్ చట్టం--2013 అమల్లో ఉందని, ఈ చట్టంలోని నిబంధనలు, మహిళలకు కల్పించిన హక్కులు, ఫిర్యాదు చేసే విధానం తదితర అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మహిళా ఉద్యోగుల గౌరవం, భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా పోలీస్ శాఖలో పటిష్టమైన వ్యవస్థను కొనసాగిస్తున్నామని తెలిపారు.

**సమస్యలను దాచుకోవద్దు.. నిర్భయంగా చెప్పండి**

విధి నిర్వహణలో మహిళా సిబ్బందికి ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురైతే వాటిని దాచుకోకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచించారు. అవసరమైతే నేరుగా తన దృష్టికి కూడా తీసుకురావచ్చని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళా ఉద్యోగులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు తమకు అందుబాటులో ఉన్న ఫిర్యాదు వ్యవస్థలను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. మహిళా సిబ్బంది భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా విధులు నిర్వహించే వాతావరణాన్ని కల్పించడమే పోలీస్ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు.

**ఆధునిక టెక్నాలజీపై పట్టు అవసరం**

మహిళా పోలీసు సిబ్బంది కేవలం విధి నిర్వహణలోనే కాకుండా సాంకేతిక పరిజ్ఞానంలోనూ ముందుండాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. ఆధునిక పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని, అందుకు అనుగుణంగా పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం పోలీసింగ్‌లో వినియోగిస్తున్న నాట్‌గ్రిడ్, గాండీవ, సహాయోగ్ తదితర వెబ్ అప్లికేషన్లపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సాంకేతిక వేదికలను విధి నిర్వహణలో సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా నేరాల నియంత్రణ, దర్యాప్తు, సమాచార సేకరణతో పాటు ప్రజలకు మరింత వేగవంతమైన పోలీస్ సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ, ఆధునిక టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. టెక్నాలజీని అందిపుచ్చుకున్నప్పుడే ఆధునిక పోలీసింగ్‌లో మరింత సమర్థవంతంగా పనిచేయగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్యా నాయక్, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ అధికారులు సీఐ శ్రీలక్ష్మి, సీఐ రాము, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇన్‌చార్జ్ ఎస్సై శ్రీనివాస్, షీ టీమ్ ఎస్సై రమాదేవితో పాటు జిల్లాలోని మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినీలు చక్కగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**- జ్యోతి బా పూలే గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక**



మక్తల్, అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : మక్తల్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పదో తరగతి తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వారి విషయ పరిజ్ఞానం, చదువుపై ఆసక్తి, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి అనంతరం ఏం చదవాలని అనుకుంటున్నారని విద్యార్థులను కలెక్టర్ ప్రశ్నించారు. డాక్టర్లు, ఇంజనీర్లు, పోలీసు అధికారులు కావాలనుకునే విద్యార్థులు ఎంతమంది ఉన్నారో తెలుసుకున్నారు. ఐఏఎస్ కావాలంటే ఏ విధంగా చదవాలి, సివిల్స్ పరీక్షల్లో ఎలాంటి అంశాలు ఉంటాయనే విషయాలను విద్యార్థులకు వివరించారు. సివిల్స్ పరీక్షల్లో ప్రాథమిక విషయ పరిజ్ఞానానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, 8, 9, 10వ తరగతుల్లో చదివే సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లోని ప్రాథమిక అంశాలపై అవగాహన అవసరమని కలెక్టర్ తెలిపారు. కేవలం బట్టీ పట్టి చదవడం కాకుండా విషయాన్ని అర్థం చేసుకుని చదివే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల్లో లక్షలాది మంది పాల్గొన్నప్పటికీ తమ లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఇతరులు చదవడం లేదనే కారణంతో తాము చదువును నిర్లక్ష్యం చేయవద్దని, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. చదువుతో పాటు ఆటలు ఆడాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం 5, 6వ తరగతి విద్యార్థులు రాస్తున్న ఎస్ఏ-1 పరీక్షను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరును, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాల వంటగదిని సందర్శించిన కలెక్టర్ కూరగాయల నిల్వలు, విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి అక్కడ పాఠశాల యూనిఫాంలు, బెడ్‌షీట్లు నిల్వ ఉంచడంపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసిల్దార్ సతీష్ కుమార్, పాఠశాల హెచ్ ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మక్తల్‌లో ఇరిగేషన్ భవన నిర్మాణానికి భూమిపూజ

**- రూ.4 కోట్లతో ఆధునిక భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మంత్రి వాకిటి శ్రీహరి.**



మక్తల్, అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : మక్తల్ పట్టణంలో రూ.4 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఇరిగేషన్ శాఖ భవన నిర్మాణానికి రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య శాఖ క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ ప్రియాంకతో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. అధికారులతో కలిసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కార్యాలయాలు, సిబ్బంది విధుల నిర్వహణకు మెరుగైన వసతులు కల్పించేందుకు నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మక్తల్ పట్టణంలోని ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలాల్లో గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు మంత్రి తెలిపారు. గోదాముల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకకు సూచించారు. అదేవిధంగా మక్తల్ పట్టణంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి అవసరమైన మున్సిపల్ స్థలాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి సూచించారు. మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. సాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్ కుమార్, నీటి పారుదల శాఖ ఈ ఈ గోపాల చారీ, డీ ఈ ఈ లు సురేష్,మహేశ్, శివుడు, వెంకట రమణ, శేఖర్, ఏ. ఈ లు , వార్డు కౌన్సిలర్, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి బోర్డుల్లో నాణ్యత మాయం... ఫ్లెక్సీల మాయాజాలం!

- శాశ్వత పెయింటింగ్ లు వేయకుండా తాత్కాలిక ఫ్లెక్సీలతో సరిపెడుతున్న వైనం
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా? తల్లిదండ్రుల ఆగ్రహం
- టైటిల్ బోర్డు, ఎస్ఎస్సి, కెరీర్ గైడెన్స్ బోర్డులను గోడలపై నాణ్యతగా పెయింటింగ్ రూపంలోనే ఏర్పాటు చేయాలి - విద్యార్థుల డిమాండ్




తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 07,విజన్ ఆంధ్ర : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రయోజనం కోసం ఏర్పాటు చేస్తున్న టైటిల్ బోర్డులు, ఎస్ఎస్సి ప్రాముఖ్యతను తెలిపే బోర్డులు, అలాగే పదవ తరగతి తర్వాత కెరీర్ గైడెన్స్ బోర్డుల ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పదవ తరగతి అనేది ప్రతి విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన మలుపు. ఆ దశలో సరైన మార్గనిర్దేశం లేకపోతే విద్యార్థి భవిష్యత్తు అంధకారంలో పడే ప్రమాదం ఉంది. అలాంటి కీలకమైన సమయంలో విద్యార్థులకు దిక్సూచిగా నిలవాల్సిన కెరీర్ గైడెన్స్ బోర్డులను కొందరు కాంట్రాక్టర్లు, అధికారులు కేవలం తక్కువ ఖర్చుతో వచ్చే తాత్కాలిక ఫ్లెక్సీలకు పరిమితం చేస్తూ నాసిరకంగా ఏర్పాటు చేస్తున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవ తరగతి పూర్తయిన తర్వాత ఇంటర్ లో ఏ గ్రూపు తీసుకోవాలి, పాలిటెక్నిక్ లో చేరితే ఏ కోర్సులు ఉన్నాయి, ఐటీఐ, పారామెడికల్, ఇతర వృత్తి విద్యా కోర్సులలో ఎలాంటి అవకాశాలు ఉన్నాయి అనే విషయాలపై గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సరైన అవగాహన ఉండదు. పట్టణాల్లో అయితే ప్రైవేట్ కౌన్సెలింగ్ సెంటర్లు ఉంటాయి కానీ పల్లెల్లోని నిరుపేద విద్యార్థులకు పాఠశాలలో ఉన్న గైడెన్స్ బోర్డే ఏకైక ఆధారం. అలాంటి బోర్డును అత్యంత నాణ్యతగా, అందరికీ అర్థమయ్యేలా, ఆకర్షణీయమైన రంగులతో పాఠశాల ప్రధాన గోడపై శాశ్వత పెయింటింగ్ రూపంలో ఏర్పాటు చేస్తే అది ఈ సంవత్సరం విద్యార్థులకే కాకుండా రాబోయే పదేళ్ల పాటు వచ్చే వందలాది మంది విద్యార్థులకు ఉపయోగపడుతుంది. కానీ ప్రస్తుతం జరుగుతున్నది ఏమిటంటే పెయింటింగ్ కు ఎక్కువ ఖర్చు అవుతుందనే సాకుతో కేవలం రెండు మూడు వందల రూపాయలతో వచ్చే ఫ్లెక్సీ బోర్డులను తెచ్చి గోడలకు కొట్టేస్తున్నారు. ఆ ఫ్లెక్సీలు ఎండకు, వానకు రెండు నెలల్లోనే రంగు వెలిసిపోయి, చిరిగిపోయి, అక్షరాలు కనిపించకుండా పోతున్నాయి. దీంతో ప్రభుత్వం పెడుతున్న డబ్బు వృథా అవుతోందే తప్ప విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. అందుకే విద్యార్థులు, తల్లిదండ్రులు ఒకే మాట చెబుతున్నారు. తాత్కాలిక ఫ్లెక్సీల వద్దు, శాశ్వత పెయింటింగ్ ముద్దు అని. టైటిల్ బోర్డు నుండి మొదలుకొని ఎస్ఎస్సి బోర్డు, కెరీర్ గైడెన్స్ బోర్డు వరకు ప్రతి ఒక్కటి నాణ్యమైన పెయింట్ తో, అందమైన డిజైన్ తో గోడలపై రాయించాలని, అప్పుడే అది భావితరాలకు కూడా ఉపయోగపడుతుందని వారు డిమాండ్ చేస్తున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఫ్లెక్సీ బోర్డులను నిషేధించి, అన్ని పాఠశాలల్లో నాణ్యతతో కూడిన శాశ్వత పెయింటింగ్ బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విజన్ ఆంధ్ర పత్రిక తరపున కూడా మేము కోరుతున్నాము.




## వికారాబాద్ లో నకిలీ సర్టిఫికెట్ల కలకలం - ముగ్గురు జూనియర్ లెక్చరర్లకు షాక్!

***ఇబ్రహీంపట్నంలో ఇద్దరు, తాండూర్ లో ఒకరు - RJD వేటు - విద్యాశాఖలో ప్రకంపన***

***చదువు చెప్పాల్సిన వారే మోసం చేస్తే..? నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం.. చివరకు డిస్మిస్!***




తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 7, విజన్ ఆంధ్ర: వికారాబాద్ జిల్లా విద్యాశాఖలో సంచలనం చోటుచేసుకుం ది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యాబుద్ధులు నేర్పాల్సిన లెక్చరర్లే నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు బయటపడటం తీవ్ర కలకలం రేపుతోంది.

***ఏం జరిగింది? :*** జిల్లాలోని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఇద్దరు జూనియర్ లెక్చరర్లు, తాండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న మరో లెక్చరర్ – మొత్తం ముగ్గురు తమ విద్యార్హతకు సంబంధించి నకిలీ సర్టిఫికెట్లను సమర్పించి ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఫిర్యాదు అందడంతో RJD (రీజినల్ జాయింట్ డైరెక్టర్) అధికారులు లోతుగా విచారణ జరిపారు. యూనివర్సిటీలకు లేఖలు రాసి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించగా అవి ఫేక్ అని తేలింది. దీంతో వెంటనే వారిని విధుల నుండి డిస్మిస్ చేస్తూ =జీణ అధికారులు సంచలన ఉత్తర్వులు జారీ చేశారు.

***అర్హులకు అన్యాయం! :*** ఒకవైపు లక్షల మంది నిరుద్యోగులు అసలైన సర్టిఫికెట్లతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే, నకిలీ సర్టిఫికెట్లతో కొందరు సులభంగా ప్రభుత్వ ఉద్యోగాలు కొట్టేయడం అర్హులకు తీవ్ర అన్యాయం చేసినట్లయిందని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

***ఇంకా ఎంత మంది? :*** ఈ ముగ్గురితో ఆగలేదు, జిల్లాలో ఇంకా చాలా మంది ఇదే తరహాలో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొంది ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల సర్టిఫికెట్లను మళ్లీ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ వినిపిస్తోంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు కూడా ఈ దిశగా చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై విద్యాశాఖలో చర్చ మొదలైంది. నకిలీ సర్టిఫికెట్ల మాఫియా వెనుక ఎవరున్నారనే కోణంలో కూడా విచారణ జరగాలని అందరూ కోరుతున్నారు.

# ఎస్. ఐ. ఆర్ ను పారదర్శకంగా పకడ్బందీగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

***: మహబూబ్ నగర్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్.***






మహబూబ్ నగర్ అక్టోబర్ 07 విజన్ ఆంధ్ర ప్రతినిధి : పారదర్శక ఓటరు జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం ముఖ్య ఉద్దేశమని ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్.ఐ.ఆర్) మహబూబ్ నగర్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ అన్నారు. బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియ పై రాజకీయ పార్టీల ప్రతినిధుల లు, ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ముందుగా మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల ఈఆర్‌ఓలు ఆయా నియోజకవర్గాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై అబ్జర్వర్‌కు వివరించారు. ఇప్పటివరకు జారీ చేసిన నోటీసులు, పెండింగ్‌లో ఉన్న నోటీసులు, నిర్వహించిన హియరింగ్‌లు, మృతులు, వలస వెళ్లిన ఓటర్లు, 2002 నాటి ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని కేసులు, ఇతర అనామలీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలెక్టోరల్ రోల్ పరిశీలకులు, సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, ఆయా పార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్ల (బి. ఎల్. ఎ) వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతోంది అనే అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పూర్తి చేయడంలో రాజకీయ పార్టీలు, బి.ఎల్.ఎ లు అధికారులకు సహకరించాలని కోరారు. దీనిపై స్పందిస్తూ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలో జిల్లా యంత్రాంగం, సర్ ప్రక్రియను సవ్యంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నారని , ఎలాంటి ఇబ్బంది లేదని, సర్ లో భాగస్వాములైన జిల్లా కలెక్టర్, ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లు, మొదలుకొని కిందిస్థాయి బూత్ లెవెల్ అధికారుల (బి.ఎల్.ఓ) వరకు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. అయితే పట్టణ ప్రాంతాల్లో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మున్సిపల్ సిబ్బందిని కూడా ప్రక్రియలో భాగస్వామ్యులను చేయాలని అన్నారు. ముఖ్యంగా ఉద్యోగస్తులకు కూడా నోటీసులకు స్పందించేలా ఆయా శాఖల అధికారులకు తెలుపాలని కోరారు.బి.ఎల్.ఓ లు , మున్సిపల్ సిబ్బంది ఓటర్లను చైతన్యం చేయాలని అన్నారు. అనంతరం ఓటరు జాబితా పరిశీలకులు సురేం ద్ర మోహన్ మాట్లాడుతూ ఎస్.ఐ.అర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాను పూర్తి పారదర్శకంగా తయారు చేయాలన్నదే ఎన్నికల సంఘం ఉద్దేశమని, ఇందులో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో ఉండాలని, అలాగే అర్హత లేని వారు జాబితాలో ఉండకూడదని, ఈ విషయంలో అధికారులతో పాటు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కలిసి పని చేస్తే సాధ్యమవుతుందని అన్నారు. పెండింగ్ నోటీసులు జారీ పూర్తి చేయాలని , నిర్దేశిత గడువు లోగా సర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన సూచించారు ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ లు, ప్రతి బి.ఎల్. ఓ తో వారి పరిధిలో జారీ చేసిన నోటీసులు , అందుకున్న వారి వివరాలు, అలాగే నోటీసులకు సమాధానం ఇస్తూ ధ్రువపత్రాలు సమర్పించిన వారు, నోటీసులకు సమాధానం లేని రాని వారి విషయంలో తీసుకుంటున్న చర్యలు, నోటీస్ అందుకున్న ఓటర్లు ఎలాంటి ధ్రువపత్రాలు సమర్పిస్తున్నారు అన్న విషయాలపై క్షుణ్ణంగా సమీక్షించాలన్నారు. నోటీసులు అందుకు న్న ఓటర్లకు డాక్యుమెంట్స్ సమర్పణ విషయంలో అవగాహన కలిగించాలని అన్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ వారీగా బూత్ లెవెల్ ఏజెంట్ ల నియామకం చేయాలని అన్నారు. ఒక ఓటర్‌కు రెండు చోట్ల ఓటు హక్కు లేకుండా నోటీసు జారీ చేసి ఒక చోటే ఓటు హక్కు ఉండేలా చూడాలని, సర్ ప్రక్రియలు ఎక్కడైనా సమస్యలు ఉంటే అలాంటి వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి కూడా తీసుకువెళ్లి పరిష్కరించాలని చెప్పారు. ఎన్నికల జాబితా తయారీ అనుమానాస్పద కార్యక్రమం కాదని, పూర్తి పారదర్శకంగా, అందరికీ తెలియజేసి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని, సర్ ప్రక్రియ పూర్తి ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతుందన్నారు . జాబితా తయారీలో ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్. ఓ లు పూర్తి జాగ్రత్తగా ఉండాలని, అలాగే పార్టీల ప్రతినిధుకలిసి పని చేస్తే తప్పులు లేని జాబితా తయారవు తుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ నోటీసు లు, హియరింగ్ ప్రక్రియ నిర్దేశిత గడువు కు ముందుగానే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సర్ ప్రక్రియలో జిల్లా స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, సమావేశంలో వారు దృష్టికి తెచ్చిన సమస్యలు పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు సర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు, నియోజకవర్గాలు, ఈ. అర్. ఓ లు , ఎ .ఈ.ఆర్. ఓ లు, బి.ఎల్.ఓ, బి ఎల్ ఏ నియామకం, సర్ లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని వివరాలన్నింటినీ వివరించారు. జిల్లాలో రేషనలైజేషన్ తర్వాత 862 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రానికి బిఎల్‌ఓ ను నియమించడం జరిగిందని, అలాగే 2316 మంది బి.ఎల్.ఎ లు ఉన్నారని , 732488 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 103086 మంది చనిపోయిన, గుర్తించలేని, డబుల్ ఓటర్లు పోగా ఆగస్టు 17 న ముసాయిదా జాబితా ప్రకారం 629402 మంది నమోదయ్యారని అన్నారు. ఓటరు జాబితాలో పేర్లలో అక్షర దోషాలు, చిరునామా, వయసు తదితర విషయాలలో తేడాలున్న 236590 మంది ఓటర్లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేశామ ని, విచారణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జడ్చర్ల నియోజకవర్గం ఈ.ఆర్. ఓ, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, డి . ఆర్.ఓ ఎ.నిర్మల, ఆర్ . డి.ఓ నవీన్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఎ.ఈ. ఆర్. ఓ లు, ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనుల పరిశీలన

**జటప్రోలు గ్రామంలో కాసేపు క్రికెట్ ఆడిన మంత్రి జూపల్లి**





కొల్లాపూర్ అక్టోబర్ 07:(విజన్ ఆంధ్ర) : కొల్లాపూర్ నియోజకవర్గంలోని జటప్రోలులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవన నిర్మాణం, చేపడుతున్న పనుల వివరాలు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, తదుపరి చేపట్టాల్సిన పనులపై అధికారులతో మంత్రి చర్చించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు అక్కడ కాసేపు క్రికెట్ ఆడుతూ సందడి చేశారు. క్రీడాకారులతో మమేకమై క్రీడల ప్రాధాన్యాన్ని చాటారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఆయనతో పాటు అధికారులు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతుల మేలు కోసం పండ్లతోటలు, కూరగాయ లు పండించాలి

**- రైతు సంక్షేమ కమిషన్ కోదండరామిరెడ్డి**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) అక్టోబర్ 7: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వైశ్య సంక్షేమ సంఘం భవనంలో వ్యవసాయ శాఖ వారు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో కిసాన్ మేళ 2026 ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి ముఖ్యఅతిథి హాజరై కిసాన్ మేళాను ప్రారంభించి వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ రంగాలు , విత్తన సంస్థలు, వ్యవసాయ యాంత్రికరణ పనిముట్ల సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను రైతులతో కలిసి సందర్శించి పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కోదండ రామిరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇద్దరు రైతు కుటుంబాల నుండి వచ్చారని అన్నారు. రైతుల కష్టాలను తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పంటల మార్పిడి గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి నాతో 9 నెలల క్రితమే చర్చించి పంట మార్పిడి జరిగినప్పుడే రైతుకు మేలు జరుగుతుందని చెప్పారన్నారు. రైతులకు అధిక ఆదాయం సమకూరాలంటే పండ్లతోటలు, కూరగాయలు సాగు లో రైతులనుప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఈ సమావేశానికి వస్తూ వంటిమామిడి మార్కెట్ ను చూడడం జరిగిందనీ రైతు పండించిన వివిధ రకాల పంటలను అమ్ముకోవాలంటే ఆయా ప్రాంతాల్లో పండే పంటల కొనుగోలుకు ప్రత్యేక మార్కెట్ఉండాలన్నారు. ఆ మార్కెట్లో కమిషన్ ఏజెంట్లు లేకుండా రైతులు నేరుగా అమ్ముకునేలా ఉండాలని అన్నారు. ఎల్ నినో ప్రకృతి వైపరీత్యం వలన వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, ఇప్పుడే ఇంత వేడి ఉంటే ఏప్రిల్ నెల వరకు విపరీతమైన వేడి ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వెంటనే మెట్ట పంటలతో రబీ సాగు మొదలు పెట్టాలన్నారు. పత్తి, వరి పంటలకు అలవాటు పడ్డామని, పూర్వపు సంప్రదాయ పంటలను పండించాలన్నారు. కరోనా కాలంలో అందరం మాస్క్ పెట్టుకుంటే రైతులు మాత్రం ఒక్క రోజు కూడా ఇంట్లో ఉండకుండా ఆకు,కూరలు, కాయగూరల పండించి ప్రజలకు అందించి అన్నదాతలుగా నిలిచారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మిమ్మల్ని గుర్తించారనీ, దేశంలో రైతు భరోసా, రుణమాఫీ చేసింది, ఉచిత కరెంటు ఇస్తుంది ఇక్కడ మాత్రమే అన్నారు. కలిసి కట్టుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, ప్రాంతాల వారీగా ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ లుఏర్పాటుచెయ్యాలన్నారు. మార్కెట్ లో న్యాయమైన ధరలు వచ్చే పంటలను రైతులకు సూచించాలనీ శాస్త్రవేత్తలకుసూచించారు. ఎల్ నినో పరిస్తితుల్లో రైతులు ప్రభుత్వానికి సహకరించి ప్రభుత్వ సూచించిన పంటలను మాత్రమే వేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ కే.హైమావతిమాట్లాడుతూ రైతు ఉంటేనే రాజ్యమని, ఇంత సాంకేతిక ఉన్న కూడా మన దేశం ఇప్పటికీ వ్యవసాయం ప్రధాన దేశమే అని అన్నారు.ఎల్మినో ప్రభావం ఉన్నా జిల్లాలో 5 లక్షల ఎకరాలలో పంటలు వేశారని అన్నారు. ఈ ప్రాంతంలో గతంలో మెట్టపంటలు ఎక్కువ వేసేవారని, సాగునీటి వసతులు పెరగడంతో ఇప్పుడు ఎక్కువగా వరి పండిస్తున్నారు అని అన్నారు. జూన్ నుండే ఎల్ నినో పై రైతులను అప్రమత్తం చేయడం జరిగిందని, ఈ సారి యాసంగిలో వరి వేయవద్దని అన్నారు. ఈ నెల నుండే వర్షాలు పడవన్నారు. మక్కలు, జొన్నలు, శనగలు, కంది, సన్ఫ్లవర్, ఆయిల్ ఫామ్, ఆమదాలు, జనుముపండించాలన్నారు. పంట మార్పిడితో భూమి ఆరోగ్యం పెరుగుతుందనీ రైతుకు దిగుబడిపెరుగుతుందన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలు పండించాలనీ వ్యవసాయానికి ప్రాజెక్టుల నుండి నీటిని సరఫరా చేసేంత నీరు నిలవ లేదన్నారు. శాస్త్రవేత్తలు సూచనలతో కొత్త కొత్త పంటలు పండించి జిల్లా రైతులు ఆదర్శంగా నిలవాలనీ, పంట చేలలో ఫాం పాండ్లువ్వుకోవాలన్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ రంగాల అభ్యుదయ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం, సిద్దిపేట డివిజన్ ఆత్మ చైర్మన్ పూజల గోపికృష్ణ, ఇతర డివిజన్లో ఆత్మ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, పిఎసిఎస్ చైర్మన్, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్యశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగండి... ఆలోచించండి... అడుగు వేయండి..!

**- అత్యాశే మోసగాడి ఆయుధం - అప్రమత్తతే మీ కవచం**

**- సైబర్ నేరాలపై పోరాటం ప్రజా ఉద్యమంగా మారాలి**

**- సైబర్ మోసాలపై అవగాహన పోస్టర్లను విడుదల చేసిన**

**- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**



గద్వాల అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర బ్యూరో): ప్రజల అత్యాశ, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఆగండి.. ఆలోచించండి.. ఆ తర్వాతే అడుగు వేయండి.. అనే జాగ్రత్తను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు (ఐపీఎస్) సూచించారు. ఒక్క వ్యక్తి అప్రమత్తత ఒక కుటుంబాన్ని కాపాడుతుందని, ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను సమర్థవంతంగా అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మార్గదర్శకాల మేరకు సైబర్ జాగృక దివాస్ లో భాగంగా అక్టోబర్ నెలను సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మంత్‌గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైబర్ మోసాల నివారణ ప్రజా ఉద్యమంగా మారాలని పిలుపునిస్తూ, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సైబర్ మోసాలపై అవగాహన పోస్టర్లను ఎస్పీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడికి అధిక లాభాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లోన్ యాప్‌లు, ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్లు, లాటరీలు, అధికారుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్ వంటి వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ, ఏటీఎం, పిన్, యూ.పి.ఐ. పిన్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, గుర్తుతెలియని లింకులపై క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ఆగండి.. ఆలోచించండి.. ఆ తర్వాతే అడుగు వేయండి.. అనే జాగ్రత్తను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఏదైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930కు ఫోన్ చేసి, ఏ...ఏ...ఏ. (www.cybercrime.gov.in) ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సకాలంలో సమాచారం అందిస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అక్టోబర్ నెలంతా పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్లు, బస్టాండ్లు, ప్రజలు అధికంగా ఉండే ప్రాంతాల్లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాల నివారణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండి కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

### మోదీ 25 ఏళ్ల పాలన పూర్తి సందర్భంగా సేవా జ్యోతి యాత్ర సేవా సంకల్ప సభకు హాజరైన సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు




ఆసిఫాబాద్ అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర): భారత ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, దేశ ప్రధానిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని మొత్తం 25 సంవత్సరాల ప్రజాసేవను పూర్తిచేసుకున్న సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్‌లో సేవా సంకల్ప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం నాయకులు, కార్యకర్తలతో వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ నరేంద్ర మోదీ పాలన కోట్లాది మంది దేశ ప్రజల జీవితాలను ప్రభావితం చేసిందని, ఆయన నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని అన్నారు. దేశ అభివృద్ధిని అడ్డుకునేందుకు విదేశీ శక్తులు కుట్రలు చేస్తూ నరేంద్ర మోదీ నాయకత్వాన్ని, దేశాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లు దాటాయని, రాష్ట్రంలో ప్రతి వ్యక్తిపై సుమారు రూ.2.5 లక్షల అప్పు ఉందని తెలిపారు. గత 12 సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. అనంతరం వడ్డేపల్లి గార్డెన్ నుంచి కోర్టు చౌరస్తా వరకు సేవా జ్యోతి కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరిగెల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు కోవ విజయ్, అరిగెల మల్లికార్జున్ యాదవ్, నాయకులు డా. శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నారా వనజ, కొట్నాక విజయ్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

**- ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా ఆన్లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి**

**- విద్యార్థుల కెరీర్ కు ఉపయోగపడేలా బోధించాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర బ్యూరో) : మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ, సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా విద్యాశాఖ జ్ఞాన దీప్తి కార్యక్రమం ఆధ్వర్యంలో బుధవారం గోనుపాడు గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గణిత ఉపాధ్యాయులకు డిజిటల్ లర్నింగ్ పై వారం రోజులుగా నిర్వహిస్తున్న వర్క్ షాప్ లో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. గణితం, సైన్స్ సబ్జెక్టులకు ఎంతో ప్రాధాన్యత ఉన్నందున సృజనాత్మకతతో సాంకేతికతను వినియోగించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఉద్యోగాలు, వృత్తులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకునేలా ఏఐ వంటి సాంకేతికతను కూడా వినియోగించి బోధించేందుకు కృషి చేయాలన్నారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, ఎఫ్ ఎల్ఎన్ఏఎక్స్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఐటి, నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షలను రాసే విద్యార్థులు కూడా ఆన్లైన్ తరగతులను సద్వినియోగం చేసుకొని ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులందరూ ప్రతిభ చాటేలా బోధించాలని వంద శాతం ఫలితాలు రావాలని ఆదేశించారు. ముఖ్యమైన పాఠ్యాంశాలు, పాత ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా సాధన చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. గట్టు, కేటీ దొడ్డి వంటి వెనుకబడిన మండలాల్లోనూ ఇటీవలి కాలంలో విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారని, ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని తమ పాఠశాలలలో అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, శిక్షకులు నరేష్, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

***జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్***



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7: (విజన్ ఆంధ్ర) : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 335 గ్రామ సమాఖ్య భవనాలు మంజూరు కాగా 17 భవనాలు పూర్తి అయ్యాయని, 187 భవనాల పనులు పురోగతిలో ఉన్నాయని, మిగతా భవనాల పనులను త్వరగా ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 100 జి.పి. భవనాలు మంజూరు కాగా 10 చోట్ల పనులు ప్రారంభం కాలేదని, ఇందుకు గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పనులు ప్రారంభించేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడ, మూత్రశాలలు, త్రాగునీరు వంటి మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల నిర్మాణ పనులను చేపట్టాలని తెలిపారు. జిల్లాలో చేయూత పింఛన్ల కొరకు 9 వేల 466 దరఖాస్తులు వచ్చాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా అర్హుల జాబితాను రూపొందించాలని తెలిపారు. జిల్లాలోని 8 వేల 163 స్వయం సహాయక సంఘాల బ్యాంకు లీకేజీ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందిరమ్మ మహిళా చీరల పంపిణీ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అధికారులు తమ పరిధిలోని అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పనులు వేగవంతంగా పూర్తిచేసేలా దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, పంచాయితీరాజ్ ఈ.ఈ. ధర్మేందర్, పంచాయితీ రాజు ఇంజనీరింగ్, టి జి ఈ డబ్ల్యూ ఐ డి సి, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో పెచ్చులు ఊడి ఐదుగురికి గాయాలు బాధితులను పరామర్శించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



ఆసిఫాబాద్ అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర): ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తేలిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో ముగ్గురు చిన్నారులు, ఇద్దరు తల్లులు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. గాయపడిన చిన్నారులు, తల్లుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. చిన్నారులు, తల్లులకు అవసరమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల భవనాల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదకరంగా ఉన్న భవనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సుగుణక్క వెంట సర్పంచ్ గంగారాం, డీసీసీ ఉపాధ్యక్షులు తారిక్, భీంరావ్, ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ కోవ ఇందిర, యూత్ కాంగ్రెస్ రెబ్బెన మండల అధ్యక్షుడు సాయి, రాము తదితరులు ఉన్నారు.

# కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.3.80 కోట్లు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర )అక్టోబర్ 7 : పొట్లపల్లి శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.1.50 కోట్లుహుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి రూ.85 లక్షలుహుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తో తెలంగాణ ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిధుల వినియోగానికి దేవాదాయ శాఖ పరిపాలనా అనుమతులు జారీ చేసింది.కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.3.80 కోట్లుహనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.3,80,33,750ల పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. ఈ నిధులతో 5 అంతస్తుల రాజగోపురం, ప్రాకార మండపం/బౌండరీ వాల్, దక్షిణ మరియు పశ్చిమ వైపులా 3 అంతస్తుల రాజగోపురాలు, కార్యాలయ భవనం, శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. 5 అంతస్తుల రాజగోపురం - రూ.65 లక్షలలి ప్రాకార మండపం/బౌండరీ వాల్ - రూ.1.06 కోట్లులి దక్షిణ వైపు 3 అంతస్తుల రాజగోపురం - రూ.35 లక్షలు పశ్చిమ వైపు 3 అంతస్తుల రాజగోపురం - రూ.35 లక్షలు కార్యాలయ భవనం - రూ.1.04 కోట్లుశ్రీ లక్ష్మీ గణపతి ఆలయం - రూ.17 లక్షలు శ్రీ ఆంజనేయస్వామి ఆలయం - రూ.17 లక్షలు అలాగే పనుల అమలుకు అవసరమైన నిధుల కోసం దేవస్థానం వద్ద ఉన్న 9 ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఖీణ=ం) నుంచి గరిష్టంగా రూ.3,85,29,060 వరకు ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది.

**పొట్లపల్లి శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి ఆలయానికి రూ.1.50 కోట్లు**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు రూ.1.50 కోట్ల నిధుల వినియోగానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.ఈ నిధులతో 5 అంతస్తుల రాజగోపురం నిర్మాణంలో మిగిలిన పనులకు రూ.50 లక్షలు, ఆలయం చుట్టూ ప్రాకార మండపం నిర్మాణానికి రూ.1 కోటి ఖర్చు చేయనున్నారు. ఆలయం వద్ద ఉన్న 5 ల నుంచి అవసరమైన మేరకు గరిష్టంగా రూ.1.50కోట్లను ఉపసంహరించుకుని ఆమోదించిన అభివృద్ధిపనులకువినియోగించేందుకు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

**హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి రూ.85 లక్షలు**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధి పనులకు ఆలయం వద్ద ఉన్న ల నుంచి రూ.85 లక్షల వరకు నిధులు ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసింది.ఈ నిధులతో: పట్నాల మండపం నిర్మాణం - రూ.40 లక్షలలి బోనాల మండపం నిర్మాణం - రూ.40 లక్షలి ప్రసాదం తయారీ కాంప్లెక్స్ - రూ.5 లక్షలు వెరసి మొత్తం రూ.85 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. నిబంధనల మేరకే నిధుల వినియోగంఆమోదించిన ప్లాన్లు, అంచనాలు, దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగానే నిధులనువినియోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పనులకు వాస్తవంగా అవసరమైన మేరకు మాత్రమే ల నుంచినిధులుఉపసంహరించుకోవాలని, మిగిలిన మొత్తాన్ని లలోనే కొనసాగించాలని ఆదేశించింది.నిధుల ఉపసంహరణ, ల వివరాలు, ఖర్చు చేసిన మొత్తం తదితర అంశాలతో పూర్తి నివేదికనుసమర్పించాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. హుస్నాబాద్నియోజకవర్గంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల భక్తులు, ఆలయ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన దేవాలయాలను మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

### కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణి చేసిన ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7:(విజన్ ఆంధ్ర) : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేరమేరి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి,షాధి ముబారక్ 74 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణి చేసిన ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ పేదింటి ఆడబిడ్డ కోసం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన పథకం ఈ కళ్యాణ లక్ష్మి పథకం అని అన్నారు, ఈ కార్యక్రమంలో మారుసుకోలా సరస్వతి , కేరమేరి మండల ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా..

**- బాలికల హక్కులు, రక్షణపై అవగాహన కార్యక్రమం..**

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిష్కా పాత్రుడు**




గద్వాల అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర బ్యూరో) : అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికల హక్కులు, భద్రత, రక్షణ మరియు సాధికారతపై అవగాహన కల్పించేందుకు జోగులాంబ గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఆధ్వర్యంలో తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ బాలికల పాఠశాల, గద్వాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, వక్తగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జోగులాంబ గద్వాల కార్యదర్శి నిష్కా పాత్రుడు పాల్గొని బాలికలకు వారి హక్కులు, చట్టపరమైన రక్షణలు, అందుబాటులో ఉన్న న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ, బాలికలు తమ విద్యా హక్కు, సమానత్వ హక్కు, గౌరవంగా జీవించే హక్కు, వ్యక్తిగత భద్రత, రక్షణ హక్కు గురించి తెలుసుకోవాలని సూచించారు. బాలికలపై వేధింపులు, లైంగిక దాడులు, బాల్య వివాహాలు, బాల కార్మికత్వం, అక్రమ రవాణా వంటి సమస్యల నుంచి వారిని రక్షించేందుకు చట్టపరమైన నిబంధనలు ఉన్నాయని వివరించారు. భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కు, వివక్షకు వ్యతిరేకమైన హక్కులు,బాల్య వివాహాల నిషేధ చట్టం, 2006-- 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని వివరించారు. లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం (ఫోక్సో యాక్ట్ ), 2012-- బాలికలతో సహా పిల్లలను లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, దోపిడీ నుంచి రక్షించే చట్టపరమైన నిబంధనలు.బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం, 2009 (అర్ టిఈ. యాక్ట్)-- పిల్లల విద్యా హక్కు గురించి వివరించారు.బాల న్యాయ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం, 2015-- సంరక్షణ, రక్షణ అవసరమైన పిల్లలకు అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణలను వివరించారు. కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, 2013 గురించి ప్రాథమిక అవగాహన కల్పించారు. బాలికలు ఏదైనా వేధింపులు లేదా హింసకు గురైనప్పుడు నమ్మకమైన పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులను వెంటనే సంప్రదించాలని సూచించారు.అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు.బాలికలు తమపై జరిగే అన్యాయం లేదా వేధింపులను మౌనంగా భరించకుండా, తమ హక్కులను తెలుసుకుని అవసరమైన సమయంలో సహాయం కోరాలని కార్యదర్శి సూచించారు. బాలికల విద్య, భద్రత, సాధికారత సమాజ అభివృద్ధికి ఎంతో ముఖ్యమైనవని తెలిపారు.అలాగే, బాలికల రక్షణకు అందుబాటులో ఉన్న చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలు , న్యాయ సహాయ సేవలను అవసరమైన సందర్భాల్లో వినియోగించుకోవాలని తెలిపారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో విద్యను కొనసాగించి, తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.భవాని, జిల్లా బాలల పరిరక్షణ అధికారి నరసింహులు, చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యులు సరోజ, లక్ష్మి, ఉపాధ్యాయులు, బాలికా విద్యార్థులు పాల్గొన్నారు.

# స్పీకర్ ను దొర అంటావా ?

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కు బుద్ధి లేదు
- మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు అహంకారానికి పరాకాష్ట
- మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి ఫైర్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 07 ( విజన్ ఆంధ్ర ) : ఓడిపోయిన బాధలో, ప్రజలు తిరస్కరించారనే ఫ్రస్ట్రేషన్ లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి మండిపడ్డారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను "దొర" అని పిలవడం ఆయన సంస్కారహీనతకు నిదర్శనమని గుర్తు చేశారు.

*ధారూర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దగ్గర నోరు జారిన మాజీ ఎమ్మెల్యే :*

ధారూర్ లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గురించి మాట్లాడుతూ స్పీకర్ గారిని కించపరిచేలా మాట్లాడటం సరైన పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు. 10 ఏళ్లు అధికారంలో ఉండి వికారాబాద్ ను అభివృద్ధి చేయకుండా భ్రష్టు పట్టించిన మీరు, ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తారా అని ప్రశ్నించారు.

*మీ బిఆర్ఎస్ పాలనలో ఏం చేశారు ?*

మా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే పేదోడికి అన్నం పెడుతున్నాం, ఆడబిడ్డలకు ఉచిత బస్సు ఇచ్చాం, రైతన్నకు ఉచిత కరెంటు ఇచ్చాం, ప్రతి ఇంటికి సన్న బియ్యం ఇస్తున్నాం. మీరు 10 ఏళ్లు ఏం చేశారు? ఇప్పుడు ప్రజా సమస్యలపై మాట్లాడటం చేతకాక స్పీకర్ పై ఏడుస్తున్నారా?

*అర్థ సుధాకర్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్:*

ఇదే మీకు చివరి హెచ్చరిక. ఇకపై స్పీకర్ ను గానీ, మా కాంగ్రెస్ పార్టీ నాయకులను గానీ ఇలాంటి భాషతో విమర్శిస్తే ఊరుకునేది లేదు. మీ పద్ధతి మార్చుకోండి. లేదంటే వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి లిమీ ఇంటిని ముట్టడించి, మిమ్మల్ని నిర్భందిస్తాం ఖబర్దార్ ఆనంద్ అని అర్థ సుధాకర్ రెడ్డి హెచ్చరించారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి





కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 7(విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ జాగ్రూకత దివస్ సందర్భంగా శ్రీనిధి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ క్రైమ్ ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (అడ్మిన్) కే. నరసింహారెడ్డి కలిసి సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, ఇతరుల పేరుతో నకిలీగా పరిచయం చేసుకుని చేసే మోసాలు, రుణాల పేరుతో జరిగే మోసాలపై వివరించారు. సైబర్ నేరానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ నేరాల సహాయ నంబర్‌కు ఫోన్ చేయాలని, www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. అపరిచిత ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వంటి సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని పోలీసులు సూచించారు.

# ఎస్ ఏ 1 పరీక్ష సరళి ని పర్యవేక్షించిన డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ...

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7: (విజన్ ఆంధ్ర) కోమరం భీమ్ ఆసిఫాబాద్



జిల్లా జైనూర్ మండల్ కేంద్రం లోని ఆశ్రమ పాఠశాల,బాలికలు లో జిల్లా గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు జాదవ్ అంబాజీ బుధవారం ఆకస్మికంగా సందర్శించి ఎస్ ఏ 1పరీక్షల సరళిని పర్యవేకశించి ఉపాధ్యాయులకుసలహా సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, పరీక్షల విధి విధానాలు , వసతి గృహ నిర్వహణ, భోజనశాల, వంటశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సదుపాయాలు, విద్యార్థుల భద్రతా చర్యలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, భోజనం నాణ్యత, వసతి సౌకర్యాలు, ఆరోగ్యం, పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థినికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందేలా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా సౌకర్యాలు విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలల్లోని రికార్డులు, విద్యార్థుల హాజరు, వసతి గృహ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి, విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలల నిర్వహణ మరింత మెరుగుపడాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన లక్ష్యమని జాదవ్ అంబాజీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆత్రం పార్వతి ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాదు:మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 7 )విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాలో మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రామ్‌ల్యాం' అమలులో భాగంగా ఎన్ఆర్ఎల్ఎం పథకం కింద బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాదు గ్రామీణ మండలం రాజర్షిషాగూడ గ్రామానికి చెందిన అర్హులైన మహిళ సంఘాల సభ్యులకు ఆయన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పథకం అమలులో భాగంగా గొర్రెలు, మేకల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఝాన్సీ లక్ష్మీ, అంజలి మహిళా సంఘాలను గుర్తించి వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో గ్రూపులో నలుగురు సభ్యుల చొప్పున గుర్తించి, వారికి రూ. 1 లక్ష చొప్పున (ఒక్కొక్కరికి రూ. 25,000) రుణం అందించామని తెలిపారు. ఈ ఆర్థిక సహాయంతో మహిళలు మేకల పెంపకం చేపట్టి, వాటిని సక్రమంగా పెంపకం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఏపిఎం అనిల్, డిపిఎం శోభా, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టిక అల్పాహారం అందించడమే సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం లక్ష్యం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

***హసన్ పర్తిలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే***



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్, 7 ( విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టిక అల్పాహారాన్ని అందించాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారని, తద్వారా ప్రతిరోజూ ఉదయం బ్రేక్ ఫాస్ట్ లో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉదయం పూట ఆకలితో పాఠశాలకు వస్తున్నారనే విషయాన్ని తెలుసుకొని, సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని అన్నారు. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్, చార్జీలను పెంచారని, విద్యార్థులకు సన్న బియ్యం భోజనాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆకలితో ఉండొద్దనే, వారికి పౌష్టిక ఆహారాన్ని అందించాలనే గొప్ప నిర్ణయంతో ఉదయం పూట సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని తీసుకువచ్చారని అన్నారు. సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకంలో భాగంగా విద్యార్థులకు ఇడ్లీ, మిల్లెట్స్, పూరి, ఉప్మా తదితర పౌష్టికాహారాన్ని రోజువారీ మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు డ్రాపౌట్లను పూర్తిగా నివారించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, భోజన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి విద్యను అభ్యసించేలా ప్రభుత్వం అవసరమైన సదుపాయాలు కల్పిస్తోందన్నారు. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి విద్యార్థులు పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయడంతో పాటు పాఠశాల పేరును నిలబెట్టాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. హసన్ పర్తి లోని ఇదే పాఠశాలను రూ. 6. 80 కోట్ల నిధులతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మార్చుకోబోతున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా 35 ఎకరాలలో స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభం కాబోతుందని, త్వరలో నిర్మాణానికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఫౌండేషన్ వేయనున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్ లో ఇండోర్ స్టేడియం, హాకీ, షటిల్, బాక్సింగ్, తదితర అన్నీ వసతులు అందులో ఉంటాయన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ మంజూరు కాగా ఉప్పరపల్లి క్రాస్ లో నిర్మాణ దశలో ఉందని, వచ్చే సంవత్సరం నాటికి పూర్తవుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి విద్యాభ్యాసానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం ద్వారా పౌష్టికమైన అల్పాహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. విద్యార్థులు ప్రతిరోజు తప్పనిసరిగా పాఠశాలకు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు హాజరు శాతం బాగుండాలన్నారు. కరిక్యులం తోపాటు ఆరు నుంచి పదో తరగతి వరకు వర్క్ బుక్ లు వచ్చాయన్నారు. ఖాన్ అకాడమీ, తదితర వనరులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన మెనూ పాఠశాలల్లో ఉందన్నారు. స్వయంగా వడ్డించి.. విద్యార్థులతో కలిసి కూర్చుని అల్పాహారం భుజించిన ఎమ్మెల్యే, కలెక్టర్ సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ పాఠశాల విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డించారు. పాఠశాల తరగతి ఆవరణలో ఉన్న మెట్లపై విద్యార్థులతో కలిసి కూర్చొని ఎమ్మెల్యే, కలెక్టర్ లు అల్పాహారాన్ని భుజించారు. విద్యార్థులతో వారు మాట్లాడారు. విద్యార్థులు తమతో కలిసి కూర్చుని ఎమ్మెల్యే, కలెక్టర్ అల్పాహారాన్ని తినడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఎంఈఓ శ్రీనివాస్, తహసిల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమన వాణి, బాలికల, బాలుర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుమాదేవి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# రెండు నెలల్లో అర్హులందరికీ జీవో.76పట్టాల పంపిణీ

- ఆరు ప్రత్యేక బృందాలతో సర్వే ప్రారంభమైంది
- అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పట్టాలు అందిస్తాం
- కొత్తగూడెంలో రూ.1.99కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించాం
- నగర ప్రజలకు సకల సౌకర్యాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు



కొత్తగూడెం బ్యూరో అక్టోబర్ 08(విజన్ ఆంధ్ర) : పట్టణ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న జీవో.76 పట్టాల మంజూరు ప్రక్రియ వేగంగా జరుగుతోందని, రెండు నెలల్లోనే అర్హులైన లబ్ధిదారులందరికీ అందజేస్తామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం నగర పరిధిలోని 12, 14, 25, 49 డివిజన్లలో రూ.169 లక్షల వ్యంతో నిర్మించనున్న రోడ్లు, డ్రైన్లు, బతుకమ్మ ఘాట్ తదితర అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే 29వ డివిజన్లో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. మూడో విడతలో భాగంగా జీవో.76 కింద పట్టణంలో 2,241 దరఖాస్తులు అందాయని, అందులో 1,420 దరఖాస్తుల విచారణ ఇప్పటికే పూర్తయిందని వెల్లడించారు. వీటిలో 150 పట్టాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. మిగిలిన 821 దరఖాస్తుల పరిశీలన కోసం ఆరుగురు తహసీల్దార్ల నేతృత్వంలో ఆరు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సర్వే ప్రారంభించాయని చెప్పారు. రాబోయే రెండు నెలల వ్యవధిలోనే పూర్తి స్థాయి విచారణ ముగించి ప్రతి దరఖాస్తుదారుడికీ పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేదని, ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, డివిజన్ల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. శంకుస్థాపనలు పూర్తయిన అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, కమిషనర్ సుజాత, తహసీల్దార్ పుల్లయ్య, కార్పొరేటర్లు సుధాకర్ రాజు, బోయిన విజయ్ కుమార్, మంద నాగలక్ష్మి, వై శంకర్, స్థానిక నాయకులు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, గోపి కృష్ణ, గుత్తుల శ్రీనివాస్, యూసుఫ్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, భవాని ప్రసాద్, సాంబి రెడ్డి, వాడె రాములు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# బీబీపేట్ పిఎసియస్ గా చైర్మన్ గా సుతారి రమేష్ ప్రమాణ స్వీకారం

- రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్





కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 7(విజన్ఆంధ్ర) : కామారెడ్డి నియోజకవర్గంలోని బీబీపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన పిఎసియస్ చైర్మన్‌గా సుతారి రమేష్ ప్రమాణ స్వీకారం చేయగా, పాలకవర్గ సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్‌తో పాటు నూతన పాలకవర్గ సభ్యులను షబ్బీర్ అలీ అభినందించారు.

*- రైతులకు అండగా పిఎసియస్ లు పనిచేయాలి*

– ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడితేనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా పిఎసియస్ లు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సహకార సంఘాలు కేవలం రుణాల పంపిణీకి మాత్రమే పరిమితం కాకుండా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందించే కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ గారు తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీబీపేట్ పిఎసియస్ నూతన చైర్మన్ సుతారి రమేష్ ని అభినందించిన ఆయన.. రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఎలాంటి రాజకీయ భేదాలు లేకుండా ప్రతి రైతుకు సమానంగా సేవలందిస్తూ టిఎంసి యస్ ను మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఇల్యాస్ గారు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, బీబీపేట్ సర్పంచ్ సాత్విక సాయి, బీబీపేట్ మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేన రెడ్డి, సొసైటీ చైర్మన్లు ఇంద్రకరణ్ రెడ్డి, దోమకొండ సొసైటీ చైర్మన్ అనంత రెడ్డి, గూడెం శ్రీనివాస్, భీంరెడ్డి, సుధాకర్, అనంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బాలరాజు, మాజీ జడ్పీటీసీ తీర్మల్ గౌడ్, నరేందర్ రెడ్డి, ఆశబోయిన శ్రీనివాస్, నాయకులు భరత్, డేవిడ్, అనిరుద్, భూమాగౌడ్, మధు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహేష్, ప్రదీప్ మహిళలు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అసిఫాబాద్ లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పోస్టర్ ఆవిష్కరణ..

**33 జిల్లాల నుంచి 1,500 మంది అథ్లెట్లు.. 200 మంది టెక్నికల్ అఫీషియల్స్ హాజరు..**





ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7:(విజన్ ఆంధ్ర) కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చరిత్రలో తొలిసారిగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా 12వ తెలంగాణ రాష్ట్ర సబ్-జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్--2026 (ఖ-10, ఖ-12, ఖ-14 బాలబాలికలు) పోస్టర్‌ను బుధవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, జిల్లా కలెక్టర్ కె. హరిత సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ రాష్ట్రస్థాయి పోటీలు అక్టోబర్ 11, 2026న ఆసిఫాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ (బాలికలు) ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 1,500 మంది అథ్లెట్లు, 200 మంది టెక్నికల్ అఫీషియల్స్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ.. గిరిజన జిల్లా అయిన ఆసిఫాబాద్‌లో ఇంత ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. పోటీల విజయవంతమైన నిర్వహణకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. చిన్నారుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. జిల్లా కలెక్టర్ కె. హరిత ×ూాా మాట్లాడుతూ.. సుమారు 1,500 మంది చిన్నారులు పాల్గొనే ఈ మహా క్రీడా సంగమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలకు వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, ఆసిఫాబాద్ జిల్లా ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో చాటాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ణ=ణూా.ౣణ బి. దత్తారావు, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జె. అంబాజీ,ాూజమీూ ఉద్ధవ్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొట్నాక విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గుండం లక్ష్మణ్, యంగ్ ఇండియా నోడల్ ఆఫీసర్ మీనా రెడ్డి, అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, సుభాష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.డి. హైమద్, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 7(విజన్ఆంధ్ర) : పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. పత్తి కొనుగోళ్లను సజావుగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పత్తి కొనుగోళ్లపై జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించి, కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలు, కొనుగోలు ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్‌లో పత్తికి క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. పత్తిలో తేమ శాతం, నాణ్యత, రకాన్ని బట్టి ధరలో మార్పులు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు పత్తిని ఇంటి వద్దనే బాగా ఆరబెట్టి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులకు పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే వ్యవసాయ మార్కెటింగ్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-5779ను సంప్రదించి సలహాలు, సూచనలు పొందవచ్చని తెలిపారు. అలాగే జజ× వాట్సాప్ చాట్‌బాట్ నంబర్ 88972-81111 ద్వారా సీసీఐ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన సేవలు, సమాచారాన్ని పొందవచ్చని చెప్పారు. గత సంవత్సరం మాదిరిగానే కపాస్ కిసాన్ యాప్ ద్వారా జిల్లాలోని మద్నూర్‌లో ఉన్న 7 జిన్నింగ్ మిల్లులు, గాంధారిలోని 1 జిన్నింగ్ మిల్లులో పత్తిని విక్రయించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని 67 రైతు వేదికల్లో 67 తేమ కొలిచే పరికరాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకురావడానికి ముందే రైతు వేదికల వద్ద తేమ శాతాన్ని పరీక్షించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. పత్తి కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, జిల్లా వ్యవసాయ అధికారి విజయభారతి, అటవీ శాఖ అధికారులు సంధాన, విజయ్, మద్నూర్, గాంధారి మార్కెట్ కమిటీ కార్యదర్శులు, డీఎస్పీ, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు, ఎఫ్‌పీవోల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నుండి కాంగ్రెస్‌లో బారి చేరికలు



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 6 (విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇందులో భాగంగా సాత్నాల మండలం బీజేపీ శక్తి కమిటీ అధ్యక్షులు మెంతం సురేష్, సైద్‌పూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు జాదవ్ దత్తు గారు బీజేపీ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రవీంద్ర నగర్ కాలనీలో ఉన్న ఆదిలాబాద్ లిడీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లిడీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులయ్యామని తెలిపారు. అలాగే ఆదిలాబాద్ జిల్లాలో లిడా. నరేష్ జాదవ్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ: కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో విశ్వాసం కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత గౌరవం ఉంటుందని తెలిపారు. బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని, అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ ఉ డీసీసీ ఆఫీస్ ఇంచార్జి గౌలి సంజీవ్ , టౌన్ అధ్యక్షులు లికిజార్ పాష, సాత్నాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కినక బాపూరావు, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొడసం దౌలత్ రావు, రాథోడ్ కిషన్ , రాదేశ్యం తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య సిబ్బంది, వాహన డ్రైవర్లతో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్ సమావేశం



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ మున్సిపల్ ఫిల్టర్ బెడ్ వద్ద శానిటేషన్ సిబ్బంది, ట్రాక్టర్లు, టాటా ఏస్ వాహనాల డ్రైవర్లు, శానిటేషన్ జవాన్లు, ఎస్ఐలతో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలో జనాభా, విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా వాహన డ్రైవర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లోని చెత్తను పూర్తిగా తరలించాలని సూచించారు.ప్రతి ఒక్కరూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విధులను తప్పనిసరిగా నిర్వహించి, తమకు కేటాయించిన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే శానిటేషన్ జవాన్లు, ఎస్ఐల ద్వారా లేదా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో శానిటేషన్ సిబ్బంది, ట్రాక్టర్ డ్రైవర్లు, టాటా ఏస్ డ్రైవర్లు, జవాన్లు, ఎస్ఐలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ఆదిలాబాద్ పట్టణాన్ని స్వచ్ఛమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఐ శంకర్ గారు , జవాన్లు శానిటేషన్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ, దసరా ఉత్సవాలకు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి**

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7 ( విజన్ ఆంధ్ర ) : జిల్లాలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 10వ తేదీ నుండి 21 వరకు జరగనున్న బతుకమ్మ, దసరా ఉత్సవాలకు సంబందించి వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఇతర శాఖల అధికారులతో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సమీక్షించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతీ పండుగకు సంబంధిత అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటే అన్నీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవచ్చున్నారు. అధికారులు సమన్వయంతో బాధ్యతయుతంగా విధులని నిర్వర్తించి బతుకమ్మ, దసరా ఉత్సవాలు ఘనంగా జరిగేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, దేవాదాయ శాఖ, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు ఇబ్బంది కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.... ఎంగిలి పూల బతుకమ్మ వేయి స్తంభాల గుడిలో.. అలాగే సద్దుల బతుకమ్మ వేడుకలు పద్మాక్షమ్మ ఆలయంలో జరుగుతాయాన్నారు. సంబంధిత అధికారులు అప్పగించిన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించి ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా చూడాలన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలు జరిగే ప్రదేశాలలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. ఈ సమావేశంలో భద్రకాళి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల గురించిన వివరాలను ప్రధానార్చకులు భద్రకాళి శేషు వివరించగా, వేయి స్తంభాల గుడి, పద్మాక్షమ్మ దేవాలయాలలో జరగనున్న బతుకమ్మ ఉత్సవాలను గురించి ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, శంకర్ శర్మ అర్చకులు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత , గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న , జడ్పీ సీఈఓ శేషాద్రి, డిఆర్డివో మేన శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు వెంకన్న , వెంకటేష్ , దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, వివిధ శాఖల అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ పదవిపై.. బెజ్జంకి అనిల్‌కుమార్ ఆశలు

**- 34 ఏళ్ల రాజకీయ అనుభవం.. కాంగ్రెస్‌తోనే తొలి అడుగు**

**- ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా జాతీయ స్థాయిలో గుర్తింపు**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 7: (విజన్ ఆంధ్ర)విద్యార్థి దశలో మొదలైన రాజకీయ ప్రయాణం.. మూడు దశాబ్దాలు దాటినా కొనసాగుతూనే ఉంది. బాధ్యతలు మారినా.. రాజకీయ అనుభవం మాత్రం పెరుగుతూనే వచ్చింది. ఇప్పుడు అదే అనుభవంతో కాంగ్రెస్‌లో మరో బాధ్యత కోసం ఎదురుచూస్తున్నారు బెజ్జంకి అనిల్‌కుమార్. నామినేటెడ్ పదవుల భర్తీపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో కార్పొరేషన్ పదవిపై ఆయన ఆశలు పెట్టుకున్నారు. 1992లో కాంగ్రెస్ విద్యార్థి విభాగమైన ఎన్ఎస్‌యూఐతో అనిల్‌కుమార్ రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షుడిగా మొదలై జిల్లా కన్వీనర్, జిల్లా అధ్యక్షుడి స్థాయికి ఎదిగారు. 1996 నుంచి 2007 వరకు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. విద్యార్థి విభాగంలో ఆయన నిర్వహించిన బాధ్యతలకు గుర్తింపుగా 2006–07లో న్యూఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సులో ఉత్తమ జిల్లా అధ్యక్షుడి అవార్డు అందుకున్నారు. అప్పటి ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలక ఘట్టంగా నిలిచింది. ఎన్ఎస్‌యూఐ తర్వాత యూత్ కాంగ్రెస్‌లోనూ అనిల్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. 2007లో మెదక్ యూత్ కాంగ్రెస్ డీఆర్వోగా, అనంతరం ఏపీ యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేశారు. 2008 నుంచి 2010 వరకు కరీంనగర్, వరంగల్ నగరాల యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. దీంతో విద్యార్థి, యువజన విభాగాల్లో సంస్థాగత అనుభవం సంపాదించారు. రాజకీయ ప్రయాణంలో తరువాతి దశల్లో వేర్వేరు బాధ్యతలు నిర్వహించినప్పటికీ.. తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన అనంతరం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా కొనసాగుతున్నారు. 2024 జనవరి 4న న్యూఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జ్‌గా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, జిల్లాలో పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో తన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ సంస్థాగత కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతున్నారు

**పార్టీ కోసం సుదీర్ఘ ప్రయాణం**

అనిల్‌కుమార్ రాజకీయ జీవితంలో పార్టీ బాధ్యతలు మాత్రమే కాకుండా.. ప్రజా, సంస్థాగత కార్యక్రమాల్లోనూ తనదైన ముద్ర వేసిన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యంగా వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో పదేళ్లపాటు పాదరక్షలు ధరించకుండా కొనసాగిన ఆయన నిర్ణయం అప్పట్లో రాజకీయ వర్గాల్లో ప్రత్యేక చర్చకు దారితీసింది. అంతేకాకుండా ఆదిలాబాద్ నుంచి బాసరకు సుమారు 160 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టడం, దీక్ష చేయడం వంటి కార్యక్రమాలు ఆయన రాజకీయ ప్రయాణంలో ప్రత్యేకంగా నిలిచాయి. అయితే ప్రస్తుతం ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రధానంగా కనిపిస్తున్న అంశం కాంగ్రెస్‌లో తిరిగి క్రియాశీలంగా కొనసాగడం. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ, సంస్థాగత వ్యవహారాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. తాజా కాంగ్రెస్ కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొన్నట్లు వార్తలు నమోదయ్యాయి.

**ఇప్పుడు నామినేటెడ్ పదవిపై ఆశలు**

విద్యార్థి విభాగం నుంచి మొదలైన రాజకీయ జీవితం.. యూత్ కాంగ్రెస్ వరకు సాగింది. వివిధ రాజకీయ దశలను దాటి తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఆయనకు ఇప్పుడు కార్పొరేషన్ పదవి దక్కుతుందా అన్న చర్చ మొదలైంది. మూడు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం, ఎన్ఎస్‌యూఐ--యూత్ కాంగ్రెస్‌లో నిర్వహించిన సంస్థాగత బాధ్యతలు, ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్న పాత్ర.. ఇవన్నీ ఆయన ఆశలకు నేపథ్యంగా మారుతున్నాయి.

**అధిష్ఠానం గుర్తింపు దక్కేనా?**

సుదీర్ఘకాలం పాటు పార్టీ సిద్ధాంతాల కోసం పని చేసిన సీనియర్లకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. అనిల్‌కుమార్ ఆశలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 34 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం, విద్యార్థి దశ నుంచి పార్టీ కోసం చేసిన కృషి ఆయనకు శ్రీరామరక్షగా మారుతాయని అనుచరులు భావిస్తున్నారు. అయితే, సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం వంటి అంశాలు ఏ మేరకు అనుకూలిస్తాయనే దానిపైనే ఆయన భవితవ్యం ఆధారపడి ఉంది. ఏదేమైనా, మూడు దశాబ్దాల రాజకీయ ప్రస్థానానికి కాంగ్రెస్ పెద్దలు ఎలాంటి గుర్తింపు ఇస్తారనేది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

## ఆగండి... ఆలోచించండి... అడుగు వేయండి!

**- అత్యాశే సైబర్ నేరగాడి ప్రధాన ఆయుధం**

**- తక్కువ పెట్టుబడి.. అధిక లాభం అంటే సైబర్ మోసానికి సంకేతం**

**- తెలియని కాల్స్, లింకులు, ఆఫర్లకు స్పందించొద్దు**

**- సైబర్ నేరాల అవగాహన పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : దేశవ్యాప్తంగా అక్టోబర్ నెలను నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ నెల గా నిర్వహిస్తున్న నేపథ్యంలో, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచనల మేరకు ఆదిలాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఎఆర్ డీఎస్పీ కమతం ఇంద్ర వర్ధన్, డి4సి ఏఎస్ఐ సురేందర్, సిబ్బంది శివతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు అత్యాశ, అత్యవసర పరిస్థితులు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, తక్షణ రుణాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ పెట్టుబడులు వంటి అంశాలను ఆసరాగా చేసుకుని ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. “తక్కువ పెట్టుబడి.. అధిక లాభం”, “నిమిషాల్లో లోన్”, “తక్షణ ఉద్యోగం” వంటి ఆకర్షణీయమైన ఆఫర్లు కనిపిస్తే ముందుగా ఆలోచించాలని, తొందరపడి ఎలాంటి చెల్లింపులు చేయవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, లోన్ యాప్‌లు, ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు తమ బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. మోసం జరిగిన వెంటనే సమాచారం అందిస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అక్టోబర్ నెలంతా పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్లు, ప్రజలు అధికంగా గుమికూడే ప్రాంతాల్లో సైబర్ నేరాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు సైతం సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని పోలీసులు కోరారు. “ఆగండి... ఆలోచించండి... అడుగు వేయండి – సైబర్ మోసాలకు చెక్ పెట్టండి” అని సూచించారు.

## పాఠశాలలో వసతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7 ( విజన్ ఆంధ్ర ) : హసన్ పర్తి లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని వసతులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం పరిశీలించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, సీసీ కెమెరాల పనితీరు, కిచెన్ షెడ్, కిచెన్ గార్డెన్ లో పెంచుతున్న మొక్కలు, పాఠశాల పై సమావేశాలు, యోగ శిక్షణకు ఏర్పాటు చేసిన షెడ్డును కలెక్టర్ పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమా దేవి వివరించారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో అనేక సదుపాయాలను కల్పిస్తుందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఈవో ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఎంఈఓ శ్రీనివాస్, స్థానిక తహసిల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమన వాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ పట్టణం లోని పిట్టలవాడ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్

**- 150 మంది పోలీసు సిబ్బందితో విస్తృత తనిఖీలు**

**- రోడ్డు భద్రత, మహిళల రక్షణ, గంజాయి పై అవగాహన.**

**- 116 ద్విచక్ర వాహనాలు, 20 ఆటోలు, ఒక కారు తాత్కాలికంగా స్వాధీనం**

**- నంబర్ ప్లేట్లు లేని 6, నంబర్ ప్లేట్లు చెరిపివేసిన 2 వాహనాలు స్వాధీనం**

**- రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల పై నిరంతర తనిఖీలు.**

**- 3 బెల్ట్ షాపులపై కేసులు.. 42 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం....జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 7(విజన్ ఆంధ్ర)ప్రజల రక్షణ, భద్రతలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 5 గంటల నుంచి ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టలవాడ కాలనీలో సుమారు 150 మంది పోలీసు సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 116 ద్విచక్ర వాహనాలు, 20 ఆటోలు, ఒక కారును తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్లు లేని 6 వాహనాలు, నంబర్ ప్లేట్లను చెరిపివేసిన 2 వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వాహనాలకు సంబంధించిన పూర్తి పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని, దొంగ వాహనాలను కొనుగోలు చేయడం లేదా వినియోగించడం నేరమని హెచ్చరించారు. వాహనాల నంబర్ ప్లేట్లను చెరిపివేయడం, మార్చడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్పీ సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని కోరారు. అక్రమ మద్యం విక్రయాలపై కూడా తనిఖీలు నిర్వహించగా, 3 బెల్ట్ షాపుల్లో సుమారు 42 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించినా, నిల్వ చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి రహిత ఆదిలాబాద్ కోసం ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. యువత గంజాయికి దూరంగా ఉండాలని, గంజాయి సాగు, విక్రయం, రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గంజాయికి సంబంధించిన సమాచారం ప్రజలు పోలీసులకు అందించి సమాజాన్ని మత్తు పదార్థాల నుంచి కాపాడేందుకు భాగస్వాములు కావాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్లను కూడా పలువురు వాహనదారులు చెల్లించగా, మొత్తం రూ.57,110/- చలాన్ల రూపంలో చెల్లించినట్లు తెలిపారు. మహిళలు, చిన్నారుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం జిల్లా పోలీసు యంత్రాంగం షీ టీమ్స్, పోలీస్ అక్క ద్వారా నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. మహిళలు, చిన్నారుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడినా వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రౌడీ షీటర్ల పై సస్పెక్ట్ షీటర్ల పై తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ప్రవర్తన మార్చుకొని సత్ప్రవర్తనతో ఎదగాలని సూచించారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణలో భాగంగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ సురక్షితమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఓఎస్డీ బి. సురేందర్ రావు, పట్టణ సీఐలు బీడీ ప్రేమ్ కుమార్, ప్రణయ్ కుమార్, రహీం పాషా, బి వెంకటేశ్వర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి. వెంకటి, టి. మురళి, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూటమి విజయం ఖాయం

**- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి.**

**- టి డబ్ల్యూ యు, ఎస్ డబ్ల్యూ ఎఫ్ కూటమి నాయకుల కార్మిక సమస్యల లక్ష్యమే మా ధ్యేయం**




నారాయణపేట ,అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నారాయణపేట డిపోలో ఆర్టీసీ యూనియన్ లో గుర్తింపు ఎన్నికలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారేందుకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా ఉన్నాయని యూనియన్ లను భావిస్తూ కార్మికులను చైతన్యవంతులుగా చేస్తున్నాయి. ఎన్నికల్లో తమకూటమికి మద్దతు కూడగట్టేందుకు ఇరువర్గాల కార్మికులను కలుస్తూ బుధవారం ప్రచారం హోరెత్తిస్తున్నారు. టి డబ్ల్యూ యు, ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఐక్య కూటమి నాయకుల ప్రచారాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అంతేకాకుండా నారాయణపేట డిపోలో పనిచేస్తున్న కండక్టర్ డ్రైవర్లతోపాటు డిపోలో ఉన్న సిబ్బందిని కలుసుకొని వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీలు ఇస్తున్నారు. ఎలాగైనా ఈసారి తమకూటమి అభ్యర్థి గెలుపు కోసం నాయకులు ప్రచారంలో ముందంజలో ఉన్నారని తెలుస్తోంది. ఆర్టీసీని ప్రభుత్వ పరం చేసేందుకు తమకూటమి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తుందని ప్రచారంలో కార్మికులకు హామీలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద బాణం గుర్తు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని యూనియన్ నాయకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. గెలుపే లక్ష్యంగా తమ కూటమి నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తూ తమ దైన శైలిలో ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటున్నారు.

## ఉరివేసుకుని రాజంపేట ఏ ఈ ఓ మృతి!

**- పూర్తి సమాచారం పోలీస్ తర్యాప్తులో తేలాల్సింది**

**-కెసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు**



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 7 విజన్‌ఆంధ్ర : వ్యవసాయ శాఖలో ఏఈవోగా పనిచేస్తున్న ఉద్యోగి ఆత్మహత్య చేసుకోవడం జిల్లాలో విషాదం నింపింది. ఈ ఘటన రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని శ్యామ్ సుందర్ రెడ్డి(47) రాజంపేట ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజూలాగే ఉదయం ఫార్మ్ హౌస్ వద్దకు వెళ్లిన ఆయన, విధులకు వెళ్లే సమయం దాటినా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఫార్మ్ హౌస్ వద్దకు వెళ్లి చూశారు. అక్కడ ఓ గదిలో శ్యామ్ సుందర్ రెడ్డి ఉరేసుకుని ఉన్నట్లు గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రెగ్యులర్?గా విధులకు వెళ్లే శ్యాంసుందర్ రెడ్డి అకస్మాత్తుగా ఆత్మహత్యకు పాల్పడటం ఇటు వ్యవసాయ శాఖలో, అటు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జీజీహెచ్?కు తరలించారు. ఆత్మహత్యకు ఉన్న కారణాలు ఇంకా తెలియరాలేదు. ఉద్యోగపరమైన ఒత్తిడి ఉందా.. కుటుంబ సమస్యలా లేదా మరేదైనా కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఈవీఎం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 7(విజన్ఆంధ్ర) ఈవీఎం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. కామారెడ్డి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన ఈవీఎం గోదాము వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కామారెడ్డి జిల్లాలోని ఈవీఎం గోదామును నెలవారీ తనిఖీలో భాగంగా ఎన్నికల విభాగం అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గోదాము వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాము వద్ద పోలీసు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన బందోబస్తు కొనసాగించాలని సూచించారు. గోదాము పరిసరాలను 24 గంటల పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, తహసీల్దార్ హిమబిందు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బిల్ల యాదవ్ రెడ్డిని పరామర్శించిన ఎర్రబెల్లి దయాకర్ రావు,జక్క వెంకట్ రెడ్డి

**- గుండె శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిపై ఆరా**



బోడుప్పల్,అక్టోబర్ 07(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ సాయినగర్ కాలనీకి చెందిన బిల్ల యాదవ్ రెడ్డి ఇటీవల గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు,మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.బిల్ల యాదవ్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వారు త్వరగా సంపూర్ణంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కౌడే పోచయ్య, లేతాకుల రఘుపతిరెడ్డి, ఆకుల మధుకర్,పాశం నరేందర్‌రెడ్డి, అయోధ్య యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కార్డుల కోసం రేషన్ షాపుల వద్ద సందడి

**- బోడుప్పల్ సర్కిల్‌లో అర్హులకు కార్డుల పంపిణీ**



బోడుప్పల్,అక్టోబర్ 07(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని రేషన్ షాపుల్లో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతోంది. సంబంధిత అధికారులు,రేషన్ డీలర్లు లబ్ధిదారులకు కార్డులను అందజేస్తున్నారు.దీంతో రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ మరింత సులభతరం కానుంది.స్మార్ట్ రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులు కార్డులోని తమ పేరు,కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు.వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు.రేషన్ షాపుల వద్ద కార్డుల పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.పంపిణీ ప్రక్రియను సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

# బోడుప్పల్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తి

**- డీసీ పర్యవేక్షణలో బీఎల్‌ఓల ఇంటింటి పరిశీలన**



బోడుప్పల్,అక్టోబర్ 07(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తయింది. బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ ఏ శైలజ పర్యవేక్షణలో బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు.ఓటరు జాబితాలో నమోదైన వివరాలను కుటుంబ సభ్యులతో నిర్ధారించడంతో పాటు,మార్పులు, చేర్పులు,తొలగింపులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు.ప్రక్రియలో భాగంగా ఇంటి వద్ద అందుబాటులో లేని ఓటర్లు,చిరునామా మారినవారు, మరణించినవారి వివరాలను గుర్తించేందుకు బీఎల్‌ఓలు ప్రత్యేకంగా దృష్టి సారించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.సవరణ ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బీఎల్‌ఓలకు అవసరమైన సూచనలు,మార్గదర్శకాలు అందించారు.నిర్ణీత ప్రకారం క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయడంతో బోడుప్పల్ సర్కిల్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముగిసింది.ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి,బిఎల్ఓ పాల్గొన్నారు.

# లిఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

**- యువజన సంఘం రాష్ట్ర నాయకులు కొండపల్లి రాము.**




నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర): అక్టోబర్ 07 : భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనా మా చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ూ×ఖీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండపల్లి రాము డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.దేశంలో 13.30 కోట్ల ఓట్లను బిజెపి ప్రభుత్వం కనుసన్నల్లో కొల్లగొట్టారని, ఇందుకు ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పూర్తి బాధ్యత వహించాలనిఆరోపించారు. బిజెపి ప్రభుత్వ కనుసన్నల్లో నడుస్తున్న జ్ఞానేష్ కుమార్ ఎన్నికల కమిషనర్ గా కొనసాగడానికి ఏ మాత్రం అర్హుడు కాదని హెచ్చరించారు. జ్ఞానేష్ కుమార్, ప్రధాని మోడీ, అమిత్ షా చెప్పిన విధంగావ్యవహ రిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు చెందిన కొన్ని కోట్ల ఓట్లను తొలగించి, బిజెపికి అనుకూలంగా ఉన్నవారి ఓట్లను మాత్రమే జాబితాలో ఉంచడం దారుణమని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. అప్పుడు బ్రిటిష్ వాళ్ళ నుంచి దేశ స్వాతంత్ర్యం కోసం ఏ విధంగా పోరాటం చేసిదేశాన్నిసాధించు కున్నామో, అదే విధంగా నేడు యువత, విద్యార్థులు, మేధావులు అందరూ ఏకమై ఈ ప్రజా వ్యతిరేక బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ముందుకు రావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేంత వరకు అఖిల భారత యువజన సమాఖ్య ముందుండి దేశ ప్రజల పక్షాన న్యాయం కోసం పోరాడుతుందని తెలిపారు. దేశంలో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా విద్యార్థి, యువజన సంఘాలు, వామపక్ష పార్టీలు ముందుండి పోరాటం చేస్తాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో AIYF జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ మధు గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ , యూసఫ్,కిరణ్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సామ రామ్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ శ్రేణులు కదలాలి

**- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలి**
**- మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**

మేడ్చల్ జిల్లా,అక్టోబర్07(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : హైదరాబాద్,రంగారెడ్డి,మహబూబ్‌నగర్ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్‌మోహన్‌రెడ్డి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని రామ్‌మోహన్‌రెడ్డి కోరారు.పట్టభద్రుల సమస్యలను శాసన మండలి వేదికగా బలంగా ప్రస్తావించి,వారి హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. నిరుద్యోగులు,యువత, ఉద్యోగులు,పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి సామ రామ్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు.నియోజకవర్గంలోని పట్టభద్రులను పెద్ద సంఖ్యలో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి విధానాలు, పట్టభద్రుల సమస్యలపై ఆయన తీసుకోబోయే చర్యలను వివరించాలని సూచించారు.



*ప్రతి పట్టభద్రుడి ఓటు కీలకమే*

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని వజ్రేష్ యాదవ్ అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తూ పట్టభద్రులను కలవాలని సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్‌మోహన్‌రెడ్డికి మద్దతు కూడగట్టి ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు కొత్త సుశాంత్ గౌడ్,రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ గణేష్ నాయక్,చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల దీలిప్ రెడ్డి,అర్జున్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# హన్మకొండలో ఘనంగా 'సేవా జ్యోతి యాత్ర' - 'వికసిత్ భారత్ సంకల్ప సభ'

**- ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏండ్ల పాలనా ప్రస్థానం దేశ ప్రగతికి దిక్సూచి**
**- బిజెపి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కాంటెస్టెడ్ కాండిడేట్ రావు పద్మ రెడ్డి**
**- ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జాతీయ నాయకులు పి.మురళీధర్ రావు, జిల్లా ఇంచార్జ్ డా. బూర నర్సయ్య గౌడ్,**



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7 ( విజన్ ఆంధ్ర ) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాప్రతినిధిగా, ప్రభుత్వాధినేతగా 25 ఏండ్ల నిరంతర ప్రజాసేవను పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన హన్మకొండలో 'సేవా జ్యోతి యాత్ర -- వికసిత భారత్ సంకల్ప సభ' నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ నాయకులు పి.మురళీధర్ రావు ముఖ్యఅతిథిగా, హనుమకొండ జిల్లా ఇంచార్జ్, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు రావు పద్మ రెడ్డి మరియు ముఖ్య నేతలు హాజరయ్యారు.అంబేద్కర్ విగ్రహం వద్ద శాస్త్రోక్తంగా 'సేవా జ్యోతి'ని ప్రతిష్ఠించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదికపై అమర్చిన ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ సందేశాన్ని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సామూహికంగా వీక్షించారు. అనంతరం 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్య సాధన కోసం, దేశ నిర్మాణంలో భాగస్వామ్యమవుతామని వేలాది మంది కార్యకర్తలు, ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేసారు. సభ అనంతరం అంబేద్కర్ విగ్రహం నుండి అమరవీరుల స్థూపం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది - రావు పద్మ రెడ్డి.సభలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ నాయకురాలు రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ... 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి నేటి వరకు నరేంద్ర మోదీ నిరంతరం ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సర్వతోముఖంగా సహకరిస్తోందని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. రహదారులు, రైల్వేలు, వ్యవసాయం, విద్య, వైద్యం, పరిశ్రమలు, పర్యాటకం, విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు కేటాయిస్తోంది. పన్నుల వాటా, ఎస్ డి ఆర్ ఎఫ్, ఎస్డిఎంఎఫ్ తో పాటు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు గణనీయమైన నిధులు అందించింది.తెలంగాణలో రూ.47,984 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వేగంగా సాగుతున్నాయి. కొత్త లైన్లు, అమృత్ భారత్, వందే భారత్ రైళ్లతో పాటు జాతీయ రహదారుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్నారు.కాజీపేట రైల్వే కోచ్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, హైదరాబాద్‌ను బయోఫార్మా, సెమీకండక్టర్, టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోంది.పీఎం స్వానిధి, ఎం ఎస్ ఎం ఈ గ్రోత్ ఫండ్ ద్వారా చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తూ, యువతకు స్టమ్ , నైపుణ్యాభివృద్ధి రంగాల్లో నూతన అవకాశాలు కల్పిస్తోంది. సేవే సంకల్పంగా... అభివృద్ధే లక్ష్యంగా... వికసిత భారత్ కోసం మనమందరం కలిసి ముందుకు సాగుదాం"బి అని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా పదాధికారులు, వివిధ డివిజన్ మరియు మండల అధ్యక్షులు, కౌన్సిల్ సభ్యులు, యువమోర్చా నాయకులు, విద్యార్థులు, భాజపా శ్రేణులు మరియు ప్రజలు వేలాదిగా పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి వివరాలు వెల్లడించిన,జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్




నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర): అక్టోబర్ 07 : రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ సవరణ (ా×=) ప్రక్రియలో భాగంగా నోటీసులు, విచారణలు, డీఈఓ స్థాయి పరిశీలన, పరిష్కార ప్రక్రియకు సంబంధించిన నేటి వరకు నమోదైన వివరాలను కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వెల్లడించారు. బుధవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ......, నాగర్‌కర్నూల్ జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1,15,824 నోటీసులు రూపొందించి, అదే సంఖ్యలో నోటీసులు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 1,15,494 విచారణలు నిర్వహించగా, 323 కేసుల్లో విచారణ గడువు ముగిసిందని, 7 కేసులకు రీషెడ్యూల్ గడువు ముగిసిందని జిల్లా కలెక్టర్ వివరించారు.డీఈఓ స్థాయిలో మొత్తం 1,036 కేసులు పెండింగ్‌లో ఉండగా, 123 కేసులు 5 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, 6,904 కేసులు వెరిఫై చేయబడి, 5 కేసులు ఇంకా వెరిఫై చేయాల్సి ఉన్నాయని కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. అలాగే, కేటగిరీ వారీగా డిస్పోజల్ స్థితిని కూడా కలెక్టర్ వివరించారు. మొత్తం 509 కేసులు ఫైనల్‌కు అనర్హమైనవిగా గుర్తించగా, 1,06,793 కేసులు విచారణ అనంతరం ఫైనల్‌కు పార్క్ చేయబడ్డాయి, 3,862 కేసులు విచారణ లేకుండానే ఫైనల్‌కు పార్క్ చేయబడ్డాయి. ఇతర అంశాలకు సంబంధించి ఫైనల్ కోసం పార్క్ చేసిన ఓట్లు మొత్తం 5,02,767గా ఉన్నాయని తెలిపారు. అలాగే లాజికల్ డిస్క్రెపెన్సీస్ 1,00,965, నో మ్యాపింగ్ 9,716, లాజికల్ డిస్క్రెపెన్సీస్ 154, నో మ్యాపింగ్ 355గా ఉన్నాయని, వివరించారు. నియోజకవర్గాల వారీగా వివరాలను కూడా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. నాగర్‌కర్నూల్‌నియోజకవర్గంలో43,569, ,అచ్చంపేటలో 39,594, కొల్లాపూర్‌లో 32,687 నోటీసులు జారీ చేయాల్సినవిగా నమోదయ్యాయని, ఆయా నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించినట్లు కలెక్టర్ తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, యస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా నేటి సాయంత్రం నాలుగు గంటల వరకు నమోదు ప్రక్రియ ముగిస్తుందని, కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, ఎన్నికల డిటీ కల్పన, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎండి హబీబ్, ఎండి హుస్సేన్, బాలకృష్ణ, హరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా రాస్తారోకో సిర్పూర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారి దిగ్బంధం



సిర్పూర్, అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర): రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనను నిరసిస్తూ సిర్పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన రహదారిపై బైఠాయించిన నాయకులు, కార్యకర్తలు రాహుల్ గాంధీకి మద్దతుగా, ఓటు హక్కు మరియు ప్రజాస్వామ్య పరిరక్షణకు అనుకూలంగా నినాదాలు చేశారు. ప్రజల ఓటు హక్కు, ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపిన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని నాయకులు ఆరోపించారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య విలువలు, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా "ఓటు చోరీ ఆపాలి -- ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి", "రాహుల్ గాంధీకి మద్దతుగా యువజన కాంగ్రెస్" అంటూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ విలువలు మరియు ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిర్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ వి ఎం గోదాము వద్ద పటిష్ట భద్రతకు చర్యలు

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7: (విజన్ ఆంధ్ర) : జిల్లా కేంద్రంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాం వద్ద పటిష్ట బందోబస్తు, సి.సి. కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం గోదామును తనిఖీ చేసి సీలు, సి.సి. కెమెరాల పర్యవేక్షణ, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని, 24 గంటల పాటు సి.సి. కెమెరాల పర్యవేక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్యాంలాల్, సిబ్బంది ముసావీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖలో 49 పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో మొత్తం 49 పోస్టులను కాంట్రాక్ట్/అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 49 పోస్టుల్లో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద 36,ఆయుష్ కింద 08,జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టీఈపీ) కింద 05 పోస్టులు ఉన్నాయని తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు జిల్లా అధికారిక వెబ్‌సైట్ ప్తుఝుఝ్రీ.వశ్రీఝఅ-ప్తుఝుఝ.ప్రశీజ.అఅ నుండి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను 08-10-2026 నుండి 13-10-2026 సాయంత్రం 5:00 గంటల వరకు సమర్పించాలని సూచించారు. పోస్టుల వారీగా ఖాళీలు, విద్యార్హతలు,వయోపరిమితి, ఎంపిక విధానం,దరఖాస్తు విధానం తదితర పూర్తి వివరాల కోసం జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# భీంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**- బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ సత్వర న్యాయం అందించాలి**
**- గంజాయి, సైబర్ క్రైమ్, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలి**
**- చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవు**
**- అసాంఘిక కార్యకలాపాలపై నేరుగా జిల్లా ఎస్పీ కి వాట్సప్ ద్వారా 8712659973 నెంబర్ కి సమాచారం అందించవచ్చు.....**




ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 6 (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ భీంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న వాహనాల ప్రస్తుత స్థితిగతులను, నిర్వహణ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సత్వర న్యాయం అందించే దిశగా కృషి చేయాలని ఎస్పీ సూచించారు. ప్రజలతో మంచి సత్సంబంధాలను కొనసాగిస్తూ పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంచేలా విధులు నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని తెలిపారు. నేరాల నియంత్రణకు బీట్ వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేస్తూ గ్రామాల్లో నిరంతరం పర్యటించాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి, సైబర్ క్రైమ్, రోడ్డు భద్రత తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించడంతో పాటు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సూచనలు చేయాలన్నారు. చిన్నారులు, మహిళల పట్ల వేధింపులు లేదా ఇతర నేరాలకు పాల్పడినట్లయితే వెంటనే పోలీసులను ఆశ్రయించేలా ప్రజల్లో భరోసా కల్పించాలని, ఫిర్యాదు అందిన వెంటనే చట్ట ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మండలంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సంఘ వ్యతిరేక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సరిహద్దు ప్రాంతం కావడంతో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలపై చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలకు ఎలాంటి సమాచారం ఉన్న నిర్భయంగా 8712659973 నెంబర్ కి వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చు, ఈ వాట్సాప్ నంబర్ జిల్లా ఎస్పీ గారిచే నిర్వహించబడుతుంది. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ జి. శ్రావణ్, భీంపూర్ ఎస్సై పీర్ సింగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఒక బస్సు.. రెండు బస్సుల పిల్లలు!!

- కిక్కిరిసిన బస్సులో విద్యార్థుల ప్రయాణం
- ఇంకో బస్సు కావాలని చిన్నారుల వేడుకోలు
- పిల్లల భద్రతపై ఎవరి దృష్టి?
- బస్సు భారంతో బాలల భవిష్యత్ ప్రయాణం



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర):** విద్య అంటే వెలుగు అంటారు. కానీ ఆ వెలుగును అందుకోవడానికి వెళ్తున్న చిన్నారుల ప్రయాణం మాత్రం రోజురోజుకీ భారంగా మారుతోంది. లింగాపూర్ ఆదర్శ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న రవాణా సమస్య ప్రతి తల్లిదండ్రి హృదయాన్ని కలచివేస్తోంది. విద్యార్థుల సంఖ్య పెరిగినా, స్కూల్‌కు మాత్రం ఇప్పటికీ ఒకే బస్సు సేవ అందుబాటులో ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక బస్సులో పట్టాల్సిన సీట్ల కంటే రెండు మూడు రెట్లు ఎక్కువ మంది పిల్లలను ఎక్కించి ప్రతిరోజూ ప్రయాణింపజేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉదయం పాఠశాలకు చేరుకోవడం నుంచి సాయంత్రం ఇంటికి చేరుకునే వరకు చిన్నారులు నరకయాతన అనుభవిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. సీటు దొరకక నిలబడి ప్రయాణించే పరిస్థితి, ఇరుకైన బస్సులో ఊపిరాడని వాతావరణం, ప్రమాద భయం ప్రతి రోజూ వారిని వెంటాడుతోందని చెబుతున్నారు. "మాకు ఇంకో బస్సు ఏర్పాటు చేయండి" అంటూ పలు మార్లు సంబంధిత అధికారులకు, పాఠశాల యాజమాన్యానికి మొరపెట్టుకున్నా స్పందన లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భద్రత కంటే నిర్లక్ష్యమే పెద్దదైందా అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పాఠశాలలు వారి భద్రత విషయంలోనూ అంతే బాధ్యత వహించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగాక చర్యలు తీసుకోవడం కంటే ముందే సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. "బస్సు కోసం పిల్లల వేడుకోలు... వినిపించని అధికార యంత్రాంగం. చదువుకోసం వెళ్తున్న బంగారు భవిష్యత్తులు, కిక్కిరిసిన బస్సుల్లో కాకుండా సురక్షితంగా ప్రయాణించే రోజు ఎప్పుడు వస్తుందో అని లింగాపూర్ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు.

## ఆల్ ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

- విద్యార్థులు పండుగలను పరీక్షలను ఒకే విధంగా చూడాలి
- విద్యార్థులకు సంస్కృతిక సాంప్రదాయాలను చెప్పడమే ప్రధాన ఉద్దేశం
- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి




హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7 ( విజన్ ఆంధ్ర ) : ఆల్ ఫోర్స్ జూనియర్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విద్యాసంస్థల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయాలను తెలియచేసేందుకే కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు పండుగలను పరీక్షలను సమానంగా చూస్తూ ఒత్తిడి లేని విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా పూలనే దేవతగా భావించి కొలిచే అతి గొప్ప సంస్కృతి తెలంగాణలోనే ఉంది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అల్ ఫోర్స్ విద్యా సంస్థల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# "మీ సురక్ష".. లేదు ఎలాంటి రక్ష..!!

- మల్కాజిగిరి కమిషనరేట్‌లో కొరవడిన పర్యవేక్షణ
- మూడో కళ్ళు వేల సంఖ్యలు.. అయినా ఆగని చోరీలు
- నాడు మేటిగా నిలిచిన మేడిపల్లిలో నేడు ప్రశ్నార్థకమైన నిఘా వ్యవస్థ
- స్పష్టం చేసిన రెండు కోట్ల ఆభరణాల చోరీ ఉదంతం
- తరచూ వివాదాలు.. వరుస చోరీలతో స్థానికుల్లో బెంబేలు
- నిఘా వ్యవస్థ పనితీరును సమీక్షించాలి..




*ధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా వ్యవస్థను విస్తరిస్తున్నామని పోలీసు శాఖ చెబుతున్నా.. కెమెరాల సంఖ్య పెరగడం మాత్రమే భద్రతకు కొలమానం కాదని మేడిపల్లిలో జరిగిన భారీ చోరీ మరోసారి చాటిచెబుతోంది. హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిపై క్యారెట్‌లేన్ నగల దుకాణంలో సుమారు రూ.2 కోట్ల విలువైన ఆభరణాలు చోరీ కావడం.. ఘటన అనంతరం కొన్ని సీసీ కెమెరాలు పనిచేస్తుండగా, మరికొన్ని పనిచేయలేదన్న సమాచారం వెలుగులోకి రావడం.. మల్కాజిగిరి కమిషనరేట్‌లోని నిఘా వ్యవస్థ వాస్తవ పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. వేల సంఖ్యలో కెమెరాలు ఉన్నా.. అవసరమైన సమయంలో అవి ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న..!!*

మేడ్చల్ జిల్లా/బోడుప్పల్,అక్టోబర్ 07(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం పరిధిలో 14,161 సీసీ కెమెరాలు ఉండగా, వాటిలో 900 కెమెరాలు కమాండ్ కంట్రోల్ వ్యవస్థకు అనుసంధానమై ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంతటి విస్తృత నిఘా వ్యవస్థ ఉన్నప్పుడు వాటి నిర్వహణ, పర్యవేక్షణ కూడా అదే స్థాయిలో ఉండాలి. ప్రస్తుతం ఎన్ని కెమెరాలు పనిచేస్తున్నాయి? ఎన్ని మరమ్మతుల్లో ఉన్నాయి? ప్రధాన రహదారులు, కీలక కూడళ్లు, వాణిజ్య ప్రాంతాల్లో నిఘా లోపాలెక్కడున్నాయి? అన్నది ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఉంది.

### 5 నిమిషాల్లోనే అంతా..!!

మేడిపల్లి చోరీలో ఏడుగురు వ్యక్తులు పాల్గొన్నట్లు ప్రాథమిక సమాచారం వెలువడింది. కొద్ది నిమిషాల్లోనే షోరూమ్‌లోకి ప్రవేశించి ఆభరణాలను అపహరించినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. నిందితులు ఎక్కడి నుంచి వచ్చారు? ఏ మార్గంలో వెళ్లారు? పరిసర ప్రాంతాల్లోని కెమెరాల్లో వారి కదలికలు నమోదయ్యాయా? అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే పనిచేయని కెమెరాల కారణంగానే చోరీ జరిగిందని చెప్పేందుకు ప్రస్తుతం నిర్ధారిత ఆధారాలు లేవు. ఆ అంశం దర్యాప్తులోనే తేలాల్సి ఉంది.

### భద్రతపై ప్రశ్నల పరంపర ...?

కెమెరాల ద్వారా నేరాలను గుర్తించడం ఎంత ముఖ్యమో.. నేరం జరగకముందే అనుమానాస్పద కదలికలను గుర్తించి అడ్డుకోవడం అంతకంటే కీలకం. ఇందుకోసం బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, వ్యాపార సంస్థలతో పోలీసుల సమన్వయం, అనుమానాస్పద వ్యక్తులు--వాహనాలపై నిఘా సమర్థంగా ఉండాలి. కెమెరాల్లో అనుమానాస్పద కదలికలు నమోదైతే వెంటనే స్పందించే వ్యవస్థ కూడా అవసరం. కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానమైన కెమెరాలు వాస్తవంగా ఎంతవరకు పనిచేస్తున్నాయి? పనిచేయని



కెమెరాల సమాచారాన్ని ఎవరు సేకరిస్తున్నారు? మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ నిఘా ఏర్పాటు చేస్తున్నారా? అన్న ప్రశ్నలకు స్పష్టత రావాలి.

### నిఘా వ్యవస్థ పనితీరును సమీక్షించాలి..

కెమెరాలు పనిచేయని ప్రాంతాల్లో అదనపు గస్తీ ఏర్పాటు చేయడం, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టడం అత్యవసరం. మేడిపల్లి ఘటనను ఒక కేసుగా మాత్రమే కాకుండా.. కమిషనరేట్ పరిధిలోని మొత్తం నిఘా వ్యవస్థ పనితీరును సమీక్షించేందుకు ఒక హెచ్చరికగా చూడాల్సిన అవసరం ఉంది. ఈ చోరీ కేసును చేదించడం తక్షణ కర్తవ్యం కాగా.. మల్కాజిగిరి కమిషనరేట్‌లో సీసీ కెమెరాల వాస్తవ పనితీరుపై సమగ్ర సమీక్ష జరిగి, లోపాలు సరిదిద్దినప్పుడే "మీ సురక్ష"కు నిజమైన అర్థం చేకూరుతుందన్న విషయం నిష్ఠుర సత్యం..!

# పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్‌కు కొత్త అందాలు

**రూ.1.50 కోట్లతో వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటస్థలం, గ్రీన్ జోన్**

**శిల్పారామంలో మహిళా సంఘాలకు స్టాళ్లు ప్రారంభం**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 7 (విజన్ ఆంధ్ర): మహబూబ్‌నగర్ నగర నడిబొడ్డున ఉన్న పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్‌కు కొత్త సొబగులు అద్దారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటస్థలం, గ్రీన్ జోన్, సెల్ఫీ పాయింట్, బతుకమ్మ ఘాట్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం సాయంత్రం ప్రారంభించారు. శిల్పారామంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు కేటాయించిన స్టాళ్లను కూడా వారు ప్రారంభించారు.

### కుటుంబాలతో ఆహ్లాదంగా గడిపేందుకు సౌకర్యాలు

ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. దసరా సెలవుల నేపథ్యంలో పిల్లలు, కుటుంబ సభ్యులు ఆహ్లాదంగా గడిపేందుకు ట్యాంక్ బండ్‌పై వినోదం, విశ్రాంతి, ఆరోగ్యకరమైన కార్యకలాపాలకు అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నగరవాసులు వాకింగ్, యోగా, వ్యాయామాలు చేసుకునేలా వాకింగ్ ట్రాక్, గ్రీన్ జోన్, పిల్లల ఆటస్థలం తదితర సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

### దశలవారీగా ట్యాంక్ బండ్ అభివృద్ధి

మహబూబ్‌నగర్ నగరానికి ట్యాంక్ బండ్‌ను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దే దిశగా ఇది తొలి దశ అభివృద్ధి కార్యక్రమమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలను దశలవారీగా మరింత అభివృద్ధి చేసి నగరవాసులు గర్వపడేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇందుకు సహకరించిన ముడా చైర్మన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లను అభినందించారు.

### పరిశుభ్రత, భద్రతపై ప్రత్యేక దృష్టి

ప్రజలు కొత్తగా ఏర్పాటు చేసిన సౌకర్యాలను విస్తృతంగా వినియోగించుకోవడంతో పాటు వాటిని పరిశుభ్రంగా, సురక్షితంగా కాపాడుకోవాలని ఆయన కోరారు. గ్రీనరీ పరిరక్షణకు డ్రిప్ ఇరిగేషన్, నీటి సరఫరా వంటి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పార్కు నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని



ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పోలీసుల గస్తీ, భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

### మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ వేదిక

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. శిల్పారామంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు కేటాయించిన స్టాళ్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు తాము తయారు చేసిన ఉత్పత్తులను స్టాళ్లలో ప్రదర్శించి విక్రయించడం ద్వారా వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మేయర్ జి. మమతా, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెరచాటునే శివాజీ..!

- 3 ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని విగ్రహం.!
- శివాజీ చౌక్ అని పేరుంది కానీ.. దర్శనం కరువు
- 3 ఏళ్లుగా మూతపడిన ముసుగు.. తెరచాటునే ఛత్రపతి..!

కల్వకుర్తి, అక్టోబర్ 07, (విజన్ ఆంధ్ర) : కల్వకుర్తి పట్టణంలో నెలకొల్పిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ప్రారంభానికి నోచుకోకపోవడం ఇప్పుడు పట్టణంలో హాట్ టాపిక్ గా మారింది. గత మూడు సంవత్సరాల క్రితం ఎంతో ఘనంగా, హిందూ సంఘాల చొరవతో ఏర్పాటు చేసిన విగ్రహం నేటికీ ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంపై స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పట్టణంలోని ప్రధాన కూడలిని శివాజీ చౌక్ గా నామకరణం చేశారు. కానీ ఆ చౌక్ లో శివాజీ విగ్రహం మాత్రం ఇంకా గుడ్డ కప్పుకునే ఉండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "చౌక్ కు శివాజీ చౌక్ అని పేరు పెట్టారు కానీ, శివాజీ దర్శనం మాత్రం కల్వకుర్తి ప్రజలకు కరువైంది" అని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు.



*హిందూ సంఘాల ఆగ్రహం:*

గత 3 సంవత్సరాలుగా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని హిందూ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన నేతలు, ఇప్పుడు విగ్రహ ప్రారంభోత్సవం విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే విగ్రహాన్ని ప్రారంభించి, శివాజీకి ఘన నివాళి అర్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

*ప్రజల్లో ఉత్కంఠ:*

"శివాజీ విగ్రహం ఏర్పాటు చేసి 3 ఏళ్లు దాటింది, కనీసం దండ వేసే దిక్కు లేదు. పండుగలు, జయంతులు వచ్చినప్పుడు ఆ గుడ్డ కప్పిన విగ్రహం ముందే నిలబడి దండం పెట్టుకుంటున్నాం. ఇది శివాజీని అవమానించినట్లే" అని ఓ యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానిక నాయకులు స్పందించి ఇప్పటికైనా విగ్రహ ప్రారంభానికి తేదీ ప్రకటించాలని, శివాజీ చౌక్ కు సరైన రూపు తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా కల్వకుర్తిలో శివాజీ విగ్రహం కళ్లు తెరుస్తుందా? లేక మరో ఏడాది ఇలాగే మూసి ఉంచుతారా? అని పట్టణ వాసులు ఎదురు చూస్తున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.